TGTEL/25/A3603

# కింగ్
డైలీ న్యూస్ పేపర్

King Daily News Paper

PUBLISHED FROM HYDERABAD AND VIJAYAWADA

హైదరాబాద్ సంపుటి: 01 సంచిక : 218 బుధవారం, జూన్ 24, 2026 పేజీలు :8 వెల.1/-




# హైదరాబాద్ మెట్రో స్వాధీనం, విస్తరణకు గ్రీన్ సిగ్నల్..

దిల్లీ, హైదరాబాద్: హైదరాబాద్ మెట్రో రైలు స్వాధీనం, విస్తరణపై కేంద్ర మంత్రులతో దిల్లీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రెండు రోజులపాటు జరిపిన చర్చలు ఫలప్రదమయ్యాయి. ఫేజ్-1 విలువ నిర్ధారణ, స్వాధీనానికి రుణ సేకరణ.. ఫేజ్-2 విస్తరణ, నిర్మాణ వ్యయం, ఇందుకు అవసరమైన రుణ సేకరణకు సంబంధించిన అంశాలపై కన్సల్టెంట్‌తో సమగ్ర అధ్యయనం చేయించాలని ఈ సందర్భంగా నిర్ణయించారు. ఈ బాధ్యతను 'ఎస్‌బీఐ క్యాప్స్' సంస్థకు అప్పగించనున్నారు. హైదరాబాద్ మెట్రో రైలు స్వాధీనం.. విస్తరణపై సోమవారం రాత్రి దిల్లీలో రైల్వేశాఖ మంత్రి అశ్వినీవైష్ణవ్‌తో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి, సీఎం రేవంత్‌రెడ్డి చర్చించారు. కొనసాగింపుగా మంగళవారం కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌తో ఆయన నివాసంలో ఇద్దరూ సమావేశమయ్యారు. వారి వెంట అశ్వినీవైష్ణవ్ కూడా ఉన్నారు. మెట్రో ఫేజ్-1 స్వాధీనం, ఫేజ్-2 విస్తరణకు ఉన్న ఆటంకాలను తొలగించేందుకు కేంద్ర మంత్రులతో వరుసగా రెండు రోజులపాటు ముఖ్యమంత్రి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించి ఏకాభిప్రాయానికి వచ్చారు.

**పట్టువదలని ముఖ్యమంత్రి.. చొరవ చూపిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి**

మెట్రో ఫేజ్-1ను ఫేజ్-2కు విస్తరించాలనే ప్రభుత్వ ప్రయత్నాలకు మొదటి నుంచీ అనేక అడ్డంకులు ఎదురవుతున్నాయి. అయినా, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆయా అడ్డంకులను అధిగమించడానికి పట్టువదలకుండా ప్రయత్నిస్తూనే ఉన్నారు. వివిధ కారణాలతో మెట్రో రైలు ఫేజ్-1 పూర్తి కావడానికి ఆలస్యమవడం, కొవిడ్ ప్రభావం తదితరాలతో ఎల్‌అండ్‌టీ నష్టాలను చవిచూసింది. దాదాపు రూ.30 వేల కోట్ల ఆస్తులను సృష్టించినా.. ఏటా రూ.400 కోట్లకుపైగా నష్టం వస్తోందని ఎల్‌అండ్‌టీ ప్రభుత్వానికి నివేదించినట్లు స్వయంగా ముఖ్యమంత్రే చెప్పారు. ఈ కారణంతోనే మెట్రో రెండో దశ నిర్మాణం, నిర్వహణకు ఎల్‌అండ్‌టీ ముందుకు రాలేదు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వమే మెట్రో ఫేజ్-1ను ఎల్‌అండ్‌టీ నుంచి రూ.15 వేల కోట్లకు కొనుగోలు చేసింది. ఈ నేపథ్యంలో మెట్రో మొదటి దశ నిర్వహణ, రెండో దశ నిర్మాణం, నిర్వహణ.. రెండూ రాష్ట్ర ప్రభుత్వం అధీనంలోకి వచ్చాయి. ఎల్‌అండ్‌టీ సంస్థ మెట్రో కోసం 8.25 శాతం వడ్డీకి బ్యాంకుల్లో రూ.13,600 కోట్ల రుణం తెచ్చుకుంది. ఆ లోన్‌ను రాష్ట్ర ప్రభుత్వానికి బదిలీ చేయాలని కేంద్రానికి ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. తక్కువ వడ్డీకి రుణాలు తీసుకోవడానికి 'ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్(ఐఆర్‌ఎఫ్‌సీ)'ను మధ్యవర్తిగా ఒప్పించారు. రూ.13,600 కోట్లు నిధులను 4 శాతం వడ్డీకి జపాన్ సంస్థ ద్వారా అప్పుగా తెచ్చారు. ఆ సంస్థ నుంచి ఐఆర్‌ఎఫ్‌సీకి నిధులు బదిలీ అయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం తరపున కట్టాల్సిన రూ.1,400 కోట్లను కూడా చెల్లించారు. ఈ దశలో ఐఆర్‌ఎఫ్‌సీ నుంచి నిధులు విడుదల కాకపోవడంతో.. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అడ్డుకుంటున్నారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. దీనిపై కిషన్‌రెడ్డి కూడా సమాధానమిచ్చారు. రాష్ట్ర అభివృద్ధిని తాను అడ్డుకోవడం లేదంటూ స్పష్టంచేశారు. ఈ క్రమంలోనే కిషన్‌రెడ్డికి సీఎం లేఖ రాశారు. 'ఈ సమస్య పరిష్కారానికి మీరే చొరవ తీసుకొని.. రైల్వే మంత్రితో త్వరగా సమావేశం ఏర్పాటు చేయించాలి. సంబంధిత ఒప్పందాలు, ఆధార పత్రాలతో ఆ సమావేశానికి హాజరై అన్ని వివరణలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాను' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి రాసిన లేఖలో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రులతో ఈ అంశంపై చర్చించేందుకు కిషన్‌రెడ్డి చొరవ తీసుకున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి.. కిషన్‌రెడ్డితో కలిసి సోమ, మంగళవారాల్లో రైల్వే, పట్టణాభివృద్ధి శాఖల మంత్రులతో సమావేశమయ్యారు. ఫలితంగా మెట్రో ఫేజ్-1, ఫేజ్-2 అంశాలను సాధ్యమైనంత వేగంగా కొలిక్కి తీసుకొచ్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో కూడిన సమన్వయ కమిటీ ఏర్పాటైంది.

**కీలక నిర్ణయాలు**

- మెట్రో ఫేజ్-1 విలువ నిర్ధారణ, ఫేజ్-2 విస్తరణ సహా ఇతర అంశాలపై 'ఎస్‌బీఐ క్యాప్స్' సమగ్రంగా అధ్యయనం చేస్తుంది
- ఆ సంస్థ ఇచ్చే నివేదిక ఆధారంగా భవిష్యత్తు కార్యాచరణ చేపడతారు.



మెట్రోపై చర్చలు ఫలప్రదం
ఫేజ్-1 స్వాధీనం.. ఫేజ్-2 విస్తరణపై సమగ్ర అధ్యయనం
కన్సల్టెంట్‌గా 'ఎస్‌బీఐ క్యాప్స్'
ఆ సంస్థ నివేదిక ఆధారంగా భవిష్యత్ కార్యాచరణ
సమన్వయ సభ్యులుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు
ఖట్టర్, అశ్వినీవైష్ణవ్‌లతో సీఎం రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సమావేశంలో నిర్ణయం

- సమన్వయానికి కేంద్ర ప్రభుత్వం నుంచి ఒక అధికారి, రాష్ట్ర ప్రభుత్వం నుంచి పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక కార్యదర్శి ప్రతినిధులుగా ఉంటారు.
- ఈ అధికారులిద్దరూ సమన్వయం చేసుకుంటూ.. అధ్యయన ప్రక్రియ వేగంగా సాగేందుకు కృషిచేస్తారు.

**సానుకూల వాతావరణంలో చర్చలు: కిషన్‌రెడ్డి**

హైదరాబాద్ మెట్రోపై దిల్లీలో రైల్వే, పట్టణాభివృద్ధి శాఖల మంత్రులు అశ్వినీ వైష్ణవ్, మనోహర్‌లాల్ ఖట్టర్‌తో సానుకూల వాతావరణంలో చర్చలు జరిగినట్లు కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. "రైల్వేశాఖ మంత్రితో సమావేశం ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రెండుసార్లు లేఖలు రాశారు. గత రెండు రోజులుగా కేంద్ర మంత్రులతో సమావేశాలు ఏర్పాటు చేశా. సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి ఆయా సమావేశాల్లో పాల్గొన్నా. కేంద్ర మంత్రివర్గంలో తెలంగాణ ప్రతినిధిగా... రాష్ట్ర అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి ఎప్పుడూ కృషి చేస్తా" అని 'ఎక్స్'లో వివరించారు.

# రాష్ట్రపతితో ప్రధాని భేటీ

దిల్లీ: రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో ప్రధాని నరేంద్ర మోదీ భేటీ అయ్యారు. 'పద్మ' అవార్డుల ప్రదానోత్సవం అనంతరం రాష్ట్రపతి భవన్‌లో మంగళవారం సాయంత్రం సమావేశం జరిగింది. కేంద్ర మంత్రివర్గం పునర్‌వ్యస్థీకరణ ఊహాగానాల వేళ ఈ భేటీ జరగడం ప్రాధాన్యం సంతరించుకుంది. సమావేశం ఫొటోలను రాష్ట్రపతి కార్యాలయం 'ఎక్స్' వేదికగా షేర్ చేసింది.

కేరళకు చెందిన భాజపా నేత జార్జ్ కురియన్ కేంద్ర సహాయ మంత్రి పదవికి ఈ ఉదయం రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. ఆయన రాజీనామాకు రాష్ట్రపతి ఆమోదం తెలిపారు. ఈ పరిణామంతో కేంద్రమంత్రివర్గ పునర్‌వ్యవస్థీకరణ తథ్యమన్న ఊహాగానాలు మొదలయ్యాయి. దీనికితోడు ఇటీవల పలువురు



కేంద్రమంత్రులకు వారి వారి రాష్ట్రాల్లో పార్టీ బాధ్యతలను అప్పగించడం దీనికి మరింత బలం చేకూరింది. కేంద్ర రోడ్డు రవాణా శాఖ సహాయ మంత్రిగా ఉన్న హర్ష్ మల్హోత్రాను దిల్లీ భాజపా అధ్యక్షుడిగా పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ మే నెలలో నియమించారు.

ఎన్నికలు జరగనున్న రాష్ట్రాల్లో మరింత మంది మంత్రులకు పార్టీ బాధ్యతలు అప్పగిస్తారనే ప్రచారం జరుగుతోంది. దీంతో రాబోయే రోజుల్లో మరికొంతమంది తమ మంత్రి పదవులకు రాజీనామా చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. అదే సమయంలో కొత్త వారిని మంత్రివర్గంలోకి తీసుకుంటారన్న ప్రచారమూ జరుగుతోంది. వివిధ పార్టీల నుంచి భాజపాలోకి, ఎన్డీయేలోకి వచ్చిన వారిని కేబినెట్‌లోకి తీసుకుంటారని జాతీయ మీడియా కథనాలు పేర్కొంటున్నాయి. ఈ క్రమంలోనే ప్రధాని మోదీ రాష్ట్రపతి భేటీ కావడంతో త్వరలోనే కేబినెట్ పునర్‌వ్యవస్థీకరణ ఉండొచ్చన్న సంకేతాలు ఇచ్చినట్లయ్యింది.

# వచ్చే ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌దే అధికారం: మంత్రి జూపల్లి

హైదరాబాద్ : వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీనే అధికారంలోకి వస్తుందని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు ధీమా వ్యక్తంచేశారు. ప్రతిపక్షాలు ఎన్ని ఊకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చినా ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. మాజీ మంత్రి హరీశ్‌రావు అచ్చంపేట సభలో రైతులపై మొసలి కన్నీరు కార్చారని, భారాస పదేండ్ల పాలనలో అన్నదాతల గురించి ఏనాడూ పట్టించుకోలేదని ధ్వజమెత్తారు. ఎంపీ మల్లు రవి, విప్ అద్దంకి దయాకర్, ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణరెడ్డి, వంశీకృష్ణ, మధుసూదన్‌రెడ్డి తదితరులతో కలిసి ఆయన మంగళవారం అసెంబ్లీ ఆవరణలోని సీఎల్పీ మీడియా హాలులో




మాట్లాడుతూ... "మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రూ.లక్ష రైతు రుణమాఫీకి నాలుగేళ్ల సమయం తీసుకున్నారు. రైతుల ఆకాంక్షలకు అనుగుణంగా భారాస పాలన సాగలేదు. రైతుబంధు కోసం ఓఆర్‌ఆర్‌ను లీజుకిచ్చిన ఘన చరిత్ర వారిది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఆర్థికంగా ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఆరు గ్యారంటీలతోపాటు చెప్పనివి కూడా అమలు చేస్తున్నాం. ఈసారి రికార్డు స్థాయిలో ధాన్యం కొన్నాం. భారాస సర్కార్ ఉమ్మడి పాలమూరు ప్రాజెక్టులపై రూ.6 వేల కోట్లే ఖర్చు పెట్టింది. కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నరేళ్లలో రూ.8 వేల కోట్లు ఖర్చు చేసింది" అని వివరించారు.

## ప్ర రా బి నేటిమాట..

గతం తిరిగి పొందలేము. భవిషత్ ఊహకు కూడా అందనిది. వర్తమానమే భవిష్యత్ కు పునాది/బీజం. బీజం ఎంత నాణ్యంగా వుంటే ఫలం కూడా అంత నాణ్యంగా వుండే అవకాశాలు ఎక్కువ. కావున గతానికి ఫుల్ స్టాప్ పెట్టి వర్తమానంలో పరమాత్మ సత్య జ్ఞానాన్ని తెలుసుకుని ఆచరించటం అత్యుత్తమం.

వర్తమానంలో సంతోషంగా జీవించగలిగేవారే భవిష్యత్తులో కూడా ఇలాగే సుఖ సంతోషాలతో జీవించడానికి అవకాశాలు ఎక్కువగా వుంటాయి. వారికి భూతకాల జ్ఞాపకాలు గాని, వాటికి సంబంధించిన వ్యర్థ సంకల్పాలు కానీ ఏవీ చేసే అవసరం గాని, సమయం గాని వుండదు. అందువలన ఇప్పటి, వారి సంకల్పాలన్నీ సమర్థవంతంగా, ఫలదాయకంగా వుంటాయి. వారి ఆత్మిక శక్తి జమ అవుతూ వుంటుంది. దీనికి పరమాత్మ సత్య పరిచయము, వారితో మనస్త్ర మనసు బుద్ధి యోగము జోడించుకొవడం చాలా సహకరిస్తుంది.

– ప్రమీల రాణి బి

# రాష్ట్ర ప్రభుత్వ అంచనాలకు సమానంగా ధాన్యం కొనండి

- **కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషికి విన్నవించిన ఉత్తమ్, తుమ్మల**
- **ప్రహ్లాద్‌జోషిని సన్మానిస్తున్న మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు**

దిల్లీ: తెలంగాణలో రికార్డుస్థాయిలో ధాన్యం కొన్నామని, అందుకనుగుణంగా కేంద్రం కూడా రాష్ట్రం నుంచి కొనుగోళ్లను పెంచాలని కేంద్ర ప్రజా పంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషిని వ్యవసాయశాఖ తుమ్మల నాగేశ్వరరావు, నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కోరారు. ఈ మేరకు మంగళవారం దిల్లీలో ప్రహ్లాద్ జోషిని కలిసి విన్నవించారు. అనంతరం విలేకర్లతో మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ... "దేశంలోనే అత్యధికంగా తెలంగాణ ప్రభుత్వం ఇప్పటివరకు 80.09 లక్షల టన్నుల ధాన్యం సేకరించింది. కొనుగోలు ప్రక్రియ ఇంకా కొనసాగుతోంది. 2025-26 మార్కెటింగ్ సీజన్‌లో ఖరీఫ్, రబీ సీజన్లు కలిపి 152 లక్షల టన్నులకుపైగా ధాన్యాన్ని సేకరించాం. కానీ, రాష్ట్రం పంపిన ఉత్పత్తి అంచనాలకు విరుద్ధంగా కేంద్రం వరి సేకరణ లక్ష్యాలను తక్కువగా నిర్ధారించింది. గత 3 సీజన్ల నుంచి ఇలాగే చేయడంతో తెలంగాణ ఖజానాపై రూ.16,446 కోట్ల అదనపు ఎంఎస్‌పీ భారం పడింది. 2025-26 రబీ సీజన్‌కు రాష్ట్ర



ప్రభుత్వం 90 లక్షల టన్నుల వరి సేకరణ అంచనాలు సమర్పించినప్పటికీ కేంద్రం 35 లక్షల టన్నులే సేకరించింది. ఈ వ్యత్యాసాన్ని తొలగించేందుకు కేంద్రం చర్యలు తీసుకోవాలి. సీఎంఆర్ సరఫరా అంశంపైనా కేంద్ర మంత్రితో చర్చించాం. 2024-25 రబీకి సంబంధించి ఇంకా 5 లక్షల టన్నుల బియ్యం, ఖరీఫ్ 2025-26కు సంబంధించి 14.24 లక్షల టన్నుల బియ్యాన్ని కేంద్ర పూల్‌కు సరఫరా చేయాల్సి ఉంది. గిడ్డంగులు, నిల్వ స్థలాల కొరత, ఒకేసారి పలు సీజన్ల ధాన్యాన్ని కొనుగోలు చేయడం, మిల్లింగ్ సామర్థ్యాలపై ఒత్తిడి వంటి కారణాలను పరిగణనలోకి తీసుకొని రబీ 2024-25 సీఎంఆర్ సరఫరా గడువును మరో 60 రోజులు, ఖరీఫ్ 2025-26 గడువును 120 రోజులు పొడిగించాలి. భవిష్యత్తులో కేంద్రం నిర్ణయించే సేకరణ లక్ష్యాలు రాష్ట్ర ప్రభుత్వం సమర్పించే ఉత్పత్తి, కొనుగోలు అంచనాలకు సమానంగా ఉండాలి" అని పేర్కొన్నారు.

**కొత్తగూడెంలో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టుకు వినతి**

భద్రాద్రి రామాలయ దర్శనానికి వచ్చే భక్తుల కోసం కొత్తగూడెం వద్ద గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నిర్మించాలని మంత్రులు తుమ్మల, ఉత్తమ్‌లు... కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడిని కోరారు. దిల్లీలో ఆయనకు వినతిపత్రం అందించారు.

# సంపాదకీయం

**బుధవారం, జూన్ 24, 2026**

## ఒకప్పుడు ప్రపంచ ఆర్థిక శక్తి..

### 10 ఏళ్లలో ఏడుగురు ప్రధానులు

ఒకప్పుడు ప్రపంచాన్ని పాలించిన దేశం. పారిశ్రామిక విప్లవానికి పుట్టినిల్లు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు కేంద్ర బిందువు. అలాంటి బ్రిటన్ (యూకే) నేడు తీవ్రమైన ఆర్థిక, సామాజిక సంక్షోభాలను ఎదుర్కొంటోంది. ప్రపంచంలో అత్యంత అభివృద్ధి చెందిన దేశాల్లో ఒకటిగా పేరున్న యునైటెడ్ కింగ్‌డమ్ ప్రస్తుతం వృద్ధి మందగమనం, అధిక రుణభారం, జీవన వ్యయాల పెరుగుదల, ఆరోగ్య వ్యవస్థ ఒత్తిడి, వలసల సమస్యలు, ఉత్పాదకత తగ్గుదల వంటి అనేక సవాళ్లతో పోరాడుతోంది.ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో కీలక స్థానాన్ని కలిగి ఉన్న దేశం ఈ పరిస్థితికి ఎలా చేరుకుంది? ఈ ప్రశ్నకు సమాధానం గత కొన్ని దశాబ్దాల విధాన నిర్ణయాలు, రాజకీయ పరిణామాలు, ప్రపంచీకరణ ప్రభావాలు ఇంకా నిర్మాణాత్మక బలహీనతల్లో దాగి ఉంది.బ్రిటన్ రాజకీయాల్లో గత దశాబ్ద కాలంగా కొనసాగుతున్న తీవ్ర అస్థిరత మరోసారి ప్రపంచవ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారింది. బ్రిటన్ తాజా ప్రధానమంత్రి కీర్ స్టార్మర్ తన పూర్తి పదవీ కాలాన్ని పూర్తి చేయకుండానే అనూహ్యంగా రాజీనామా చేశారు. దీంతో గత 10 ఏళ్ల వ్యవధిలోనే బ్రిటన్ ఏకంగా ఆరుగురు ప్రధాన మంత్రులను మార్చినట్లయింది. ఒకప్పుడు ప్రపంచాన్ని శాసించిన ఒక అగ్రదేశంలో ఈ స్థాయి రాజకీయ సంక్షోభం తలెత్తడం ప్రజాస్వామ్య వ్యవస్థల స్థిరత్వంపై సరికొత్త చర్చకు దారితీస్తోంది.బ్రిటన్ రాజకీయాల చరిత్రను గమనిస్తే.. 2016 లో జరిగిన బ్రెక్సిట్ రెఫరెండం తర్వాత అక్కడ స్థిరమైన ప్రభుత్వం అనేది లేకుండా మారింది. నాటి ప్రధాని డేవిడ్ కామెరూన్ రాజీనామా తర్వాత తెరిసా మే, ఆపై బోరిస్ జాన్సన్, కేవలం 45 రోజులు మాత్రమే పదవిలో ఉన్న లిజ్ ట్రస్, ఆ తర్వాత భారత సంతతికి చెందిన రిషి సునక్.. ఇలా ఒకరి తర్వాత ఒకరు పదవుల నుంచి తప్పుకోవాల్సి వచ్చింది. ఇటీవలే లేబర్ పార్టీని భారీ విజయంతో అధికారంలోకి తెచ్చిన కీర్ స్టార్మర్ సైతం దేశంలోని ఆర్థిక సవాళ్లు, అంతర్గత రాజకీయ ఒత్తిళ్ల కారణంగా ఐదేళ్ల పూర్తి టర్మ్ ముగియకుండానే తప్పుకోవడంతో బ్రిటన్ పతనావస్థకు ఈ సంక్షోభం అద్దం పడుతోంది.సరిగ్గా ఇదే 10 ఏళ్ల కాలంలో ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారతదేశం సాధించిన రాజకీయ స్థిరత్వాన్ని ఇక్కడి పరిణామాలతో పోల్చి చూపిస్తున్నారు. లండన్ వీధుల్లో ప్రధానుల మార్పిడి ఒక ప్రహసనంగా మారిన తరుణంలో.. భారత్‌లో మాత్రం ఇదే దశాబ్ద కాలంలో కేవలం ఒకే ఒక్క ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో స్థిరమైన పరిపాలన సాగుతోంది. ఈ రాజకీయ స్థిరత్వమే అంతర్జాతీయంగా భారతదేశ ఆర్థిక వృద్ధికి, దౌత్యపరమైన విజయాలకు ప్రధాన ఇంధనంగా మారిందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.ఒకవైపు బ్రిటన్ వంటి సంప్రదాయ ప్రజాస్వామ్య దేశాలు నాయకత్వ మార్పులతో, విధానపరమైన అస్థిరతతో కొట్టుమిట్టాడుతుంటే.. భారతదేశం వరుసగా మూడోసారి ఒకే నాయకత్వాన్ని ఎన్నుకుని స్థిరమైన విధానాలతో ముందుకు సాగుతోంది. కీర్ స్టార్మర్ రాజీనామాతో బ్రిటన్ తదుపరి ప్రధాని ఎవరనే ఉత్కంఠ నెలకొనగా.. గ్లోబల్ ఇన్వెస్టర్లు మాత్రం స్థిరత్వానికి కేరాఫ్ అడ్రస్‌గా మారిన భారత్ వైపు మొగ్గు చూపే అవకాశాలు ఉన్నాయి.20వ శతాబ్దం మధ్య వరకు బ్రిటన్ తయారీ రంగంలో అగ్రగామిగా ఉండేది. అయితే కాలక్రమేణా భారీ పరిశ్రమలు క్షీణించాయి. దేశ ఆర్థిక వ్యవస్థ ఎక్కువగా ఫైనాన్స్, బ్యాంకింగ్, సేవల రంగాలపై ఆధారపడిపోయింది.ప్రత్యేకించి లండన్ నగరం ప్రపంచ ఆర్థిక కేంద్రంగా ఎదిగింది. కానీ ఈ మార్పు దేశంలోని మిగతా ప్రాంతాలకు సమాన అభివృద్ధిని తీసుకురాలేకపోయింది. ఫలితంగా లండన్ అభివృద్ధి చెందుతుండగా, ఇతర ప్రాంతాలు వెనుకబడ్డాయి.రెండో ప్రపంచ యుద్ధం తర్వాత పరిస్థితులు మారడం ప్రారంభమయ్యాయి. అమెరికా ఆ తరువాత చైనా వంటి దేశాలు ఆర్థికంగా బలపడటంతో బ్రిటన్ తన ఆధిపత్యాన్ని క్రమంగా కోల్పోయింది. అయినప్పటికీ, ఆర్థిక సేవలు, బ్యాంకింగ్ రంగం, విద్య, సాంకేతికత వంటి రంగాల ద్వారా ప్రపంచంలో ప్రాధాన్య స్థానాన్ని కొనసాగించింది.బ్రిటన్ ఎదుర్కొంటున్న ప్రస్తుత సంక్షోభానికి ప్రధాన కారణం ఉత్పాదక రంగం బలహీనపడటం. గత మూడు దశాబ్దాలుగా తయారీ పరిశ్రమల ప్రాధాన్యం తగ్గిపోయింది. పరిశ్రమలు తక్కువ ఖర్చుతో ఉత్పత్తి చేయగల దేశాలకు తరలిపోయాయి.దీంతో దేశ ఆర్థిక వ్యవస్థ అధికంగా ఫైనాన్షియల్ సర్వీసులపై ఆధారపడిపోయింది.ముఖ్యంగా లండన్ నగరం కేంద్రంగా బ్యాంకింగ్,ఇన్వెస్ట్‌మెంట్ రంగాలు విస్తరించాయి.కానీ ఈ రంగాలు దేశవ్యాప్తంగా సమాన అభివృద్ధిని తీసుకురాలేకపోయాయి.లండన్ సంపన్నంగా మారుతుంటే, ఇతర ప్రాంతాలు వెనుకబడిపోయాయి.2008 ప్రపంచ ఆర్థిక మాంద్యం బ్రిటన్‌కు పెద్ద దెబ్బగా మారింది.బ్యాంకింగ్ రంగంపై అధిక ఆధారపడటం కారణంగా ఆర్థిక వ్యవస్థ తీవ్రంగా దెబ్బతింది.ఆ తర్వాత ప్రభుత్వం భారీ వ్యయ నియంత్రణ విధానాలను అమలు చేసింది. ప్రభుత్వ ఖర్చులను తగ్గించడం వల్ల ఆరోగ్యం, విద్య, స్థానిక సంస్థలు, సామాజిక సంక్షేమ రంగాలు నిధుల కొరతను ఎదుర్కొన్నాయి.ఈ ప్రభావం ఇప్పటికీ కనిపిస్తూనే ఉంది. ప్రజా సేవల నాణ్యత క్రమంగా పడిపోయింది.బ్రిటన్ ఈ పరిస్థితి నుంచి బయటపడాలంటే దీర్ఘకాలిక నిర్మాణాత్మక సంస్కరణలు అవసరం.ఉత్పాదక రంగాన్ని పునరుద్ధరించడం,టెక్నాలజీ రంగంలో పెట్టుబడులు పెంచడం,గృహ నిర్మాణాలను వేగవంతం చేయడం,విద్య నైపుణ్యాభివృద్ధిపై దృష్టి పెట్టడం కీలకం.అలాగే ప్రాంతీయ అసమానతలను తగ్గించి లండన్ వెలుపల ఆర్థిక కార్యకలాపాలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది.బ్రిటన్ ఒక్కసారిగా కుప్పకూలిపోతున్న దేశం కాదు. కానీ గత కొన్ని దశాబ్దాలుగా పేరుకుపోయిన నిర్మాణాత్మక సమస్యలు ఇప్పుడు స్పష్టంగా బయటపడుతున్నాయి. ఒకప్పుడు ప్రపంచాన్ని నడిపించిన దేశం, నేడు తన ఆర్థిక భవిష్యత్తును తిరిగి నిర్వచించుకోవాల్సిన పరిస్థితిని ఎదుర్కొంటోంది.ఈ సంక్షోభం నుంచి బయటపడగలదా లేదా అనేది రాబోయే సంవత్సరాల్లో తీసుకునే రాజకీయ, ఆర్థిక నిర్ణయాలపై ఆధారపడి ఉంటుంది.

**- ఎడిటర్**

# మెట్రో కష్టాలు ఇంతింతకాదయా



హైదరాబాద్, జూన్ 23, (న్యూస్ పల్స్) తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హైదరాబాద్ మెట్రోను ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న విషయంలో ఆర్భాటంగా ప్రకటనలు చేస్తూ, తర్వాత కేంద్రం అడ్డుపడుతోందని ఆరోపిస్తున్నారు. ఇది రాజకీయ డైవర్షన్‌గా మారిందని విమర్శలు వస్తున్నాయి. అయితే వాస్తవాలు, ఆర్థిక సవాళ్లు, కేంద్ర?రాష్ట్ర సంబంధాలను పరిశీలిస్తే ఈ విషయం మరింత సంక్లిష్టంగా కనిపిస్తుందిహైదరాబాద్ మెట్రో ఫేజ్?1ను ఎల్‌అండ్‌టీ నిర్వహిస్తోంది. ఇది నష్టాల్లో ఉండటం, ఆర్థిక భారం కారణంగా లీజ్ వదులుకోవాలని నిర్ణయించింది. తెలంగాణ ప్రభుత్వం దీనిని స్వాధీనం చేసుకుని, హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ ద్వారా 100 శాతం ఈక్విటీని సొంతం చేసుకుంది. ఇందుకు సుమారు రూ.1,461 కోట్లు ఖర్చు అయింది. ఎల్‌అండ్‌టీకి చెల్లించాల్సిన బకాయిలు, రుణాలు క్లియర్ చేయడం ఈ టేకోవర్‌కు ముఖ్య కారణం. ఇది ఫేజ్?2 విస్తరణకు మార్గం సుగమం చేస్తుందని ప్రభుత్వం చెబుతోంది. అయితే ఎవరూ సూచించకుండానే టేకోవర్ చేశారని, రాజకీయ నేపథ్యం ఉందని విమర్శలు ఉన్నాయి.రూ.13,600 కోట్ల వరకు ఉన్న రుణాలు, ఇవి ఇంతకు ముందు బ్యాంకుల నుంచి 8.25% వడ్డీకి తీసుకున్నవి. ప్రభుత్వం ఇప్పుడు ఐఆర్‌ఎఫ్‌సీ (ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్) ద్వారా రీఫైనాన్సింగ్ చేయాలని చూస్తోంది. దీనిలో 4% వడ్డీకి జపాన్ నుంచి నిధులు వచ్చే అవకాశం ఉంది. కేంద్రం ఎఫ్‌ఆర్‌బీఎం (ఫిస్కల్ రెస్పాన్సిబిలిటీ అండ్ బడ్జెట్ మేనేజ్‌మెంట్) నిబంధనల ప్రకారం రుణం తీసుకోవాలని సూచిస్తోంది. ఇలా చేస్తే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇంకా దెబ్బతింటుంది. ఉద్యోగుల జీతాలు, ఇతర అభివృద్ధి పనులకు నిధులు కొరత ఏర్పడవచ్చు. రాష్ట్ర హామీతో రుణం తీసుకుంటే అది రాష్ట్ర బడ్జెట్‌పై భారం అవుతుంది. ఇది టేకోవర్‌ను ఆర్థికంగా సవాలుగా మార్చింది.మెట్రో ఫేజ్?2 (సుమారు 123 కి.మీ.,రూ.38,595 కోట్లు) కోసం రేవంత్‌రెడ్డి కేంద్రం నుంచి నిధులు, ఆమోదాలు కోరుతున్నారు. ఇంతకు ముందు 50:50 భాగస్వామ్యంగా ఒప్పందం జరిగిందని చెబుతున్నారు. కానీ యూనియన్ మినిస్టర్ గిరి కిషన్ రెడ్డి అడ్డుపడుతున్నారని ఆరోపిస్తున్నారు. ఫేజ్?2కు నిధులు తీసుకురావడం ద్వారా టేకోవర్ బకాయిలు చెల్లించాలని రేవంత్ సర్కార్ భావిస్తోంది. కిషన్ రెడ్డి మాత్రం రాష్ట్ర ప్రభుత్వం నిబంధనలు పాటించడం లేదు, ఆర్థిక బాధ్యతలు తీసుకోవడం లేదు అని ఆరోపిస్తున్నారు. వాదనలు వస్తున్నాయి. ఇది కేంద్ర?రాష్ట్ర రాజకీయాల్లో భాగమైంది.మెట్రో ఫేజ్?2 విస్తరణ ట్రాఫిక్ సమస్యలను తగ్గించవచ్చు. అయితే ఆర్థిక భారం, రుణాలు, కేంద్ర నిబంధనలు ఇది సులభం కాదని చూపిస్తున్నాయి. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం టేకోవర్‌ను గొప్ప విజయంగా చిత్రించి, తర్వాత కేంద్రం మీద బాధ్యత వేయడం రాజకీయ వ్యూహంగా కనిపిస్తోంది. అదే సమయంలో కిషన్‌రెడ్డి, కేంద్రం వైపు నుంచి రాష్ట్రం నిబంధనలు పాటించాలని, ఆర్థిక బాధ్యత తీసుకోవాలని ఒత్తిడి చేయడం సహజం. ఈ ప్రాజెక్టు కేంద్ర, రాష్ట్రాలు కలిసి చేయాల్సినది. రాజకీయ ఆరోపణలు, డైవర్షన్‌లు పక్కన పెట్టి, ఆర్థిక వాస్తవాలు, ప్రజా ప్రయోజనం ఆధారంగా ముందుకు సాగాలి. హైదరాబాద్ వంటి నగరానికి మెట్రో విస్తరణ అవసరం ఉంది, కానీ అది రాష్ట్ర ఆర్థిక స్థిరత్వాన్ని దెబ్బతీయకుండా జరగాలి.ఇలాంటి పెద్ద ప్రాజెక్టుల్లో రాజకీయాలు అనివార్యం. కానీ ప్రజలు ఫలితాలు చూడాలని కోరుకుంటారు. మెట్రో విస్తరణ, మెరుగైన రవాణా. రెండు పక్షాలు సహకరించి, సమస్యలను పరిష్కరించుకోవాలి. అప్పుడే ఈ టేకోవర్ నిజమైన అభివృద్ధికి దారితీస్తుంది.

## అంతర్జాతీయ ప్రమాణాలతో తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు

**ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి వెల్లడి**

**కలెక్టర్ తో కలిసి నవీపేటలో స్థల పరిశీలన**



నిజామాబాద్, జూన్ 23 : విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన నాణ్యమైన విద్యను అందించాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయలను వెచ్చిస్తూ తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ను ఏర్పాటు చేస్తోందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి వెల్లడించారు. నవీపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు కోసం అనువైన పరిస్థితులను కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పబ్లిక్ స్కూల్ కోసం అందుబాటులో ఉన్న స్థలం, ఇతర వసతులను పరిశీలించి, సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అన్ని వసతులు, అధునాతన సౌకర్యాలతో 4 ఎకరాల విస్తీర్ణంలో ఒకే చోట ఒకటవ తరగతి నుండి 12 తరగతి వరకు నాణ్యమైన విద్యా బోధన జరిగేలా తెలంగాణ పబ్లిక్ స్కూల్ ను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందని ఈ సందర్భంగా ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి తెలిపారు. ఇప్పటికే బోధన్ నియోజకవర్గంలో రూ. 200 కోట్ల నిధులతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి చర్యలు చేపట్టడం జరిగిందని గుర్తు చేశారు. కాగా, అధునాతన వసతులతో ప్రభుత్వం నిర్మించదల్చిన తెలంగాణ పబ్లిక్ స్కూల్ నిర్మాణానికి సమగ్ర ప్రతిపాదనలు రూపొందించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సంబంధిత అధికారులను ఆదేశించారు. అదనపు తరగతి గదులతో పాటు, ల్యాబ్ రూమ్ లు, లైబ్రరీ, కంప్యూటర్ గదులు, ఆర్.ఓ ప్లాంట్, బోర్ వెల్ తదితర నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. అనంతరం కలెక్టర్ పాఠశాలలోని తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో మమేకం అయ్యారు. పలు ప్రశ్నలు వేస్తూ, విద్యార్థుల సామర్థ్యాన్ని పరీక్షించారు. చక్కగా సమాధానాలు చెప్పిన విద్యార్థులకు చాక్లెట్లు, బహుమతులు అందించి ప్రోత్సహించారు. వీరి వెంట జిల్లా విద్యా శాఖ అధికారి అశోక్, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్ తదితరులు ఉన్నారు.



## అద్దె వద్దు... సొంతం ముద్దు

హైదరాబాద్, జూన్ 23, (న్యూస్ పల్స్)హైదరాబాద్ ఐటీ కారిడార్‌లో గడిచిన కొన్ని నెలలుగా నివాస గృహాల అద్దెలు ఊహించని రీతిలో పెరిగిపోవడం సగటు ఉద్యోగులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. కరోనా తర్వాతి పరిణామాల్లో వర్క్ ఫ్రమ్ హోమ్ పూర్తిగా ముగిసిపోవడం, గ్లోబల్ కంపెనీలన్నీ ఉద్యోగులను ఆఫీసులకు రప్పించడంతో పశ్చిమ హైదరాబాద్ పరిధిలోని గచ్చిబౌలి, మణికొండ, కొండాపూర్, మాదాపూర్, తెల్లాపూర్ వంటి పరిసర ప్రాంతాల్లో ఫ్లాట్ల కొరత ఏర్పడింది. దీనిని ఆసరాగా చేసుకుని ఓనర్లు అద్దెలను భారీగా పెంచేశారు. సాధారణ 2 ఃఊఐ, 3 ఃఊఐ ఫ్లాట్ల అద్దెలు కూడా ఏకంగా నెలకు 40,000 నుండి 60,000 వరకు పలుకుతుండటంతో ఐటీ శ్రేణులు ప్రత్యామ్నాయాల వైపు చూస్తున్నాయి.ప్రతి నెలా అంత భారీ మొత్తంలో అద్దెలు కట్టి యజమానుల జేబులు నింపే కంటే.. కొద్దిగా డౌన్ పేమెంట్ సర్దుబాటు చేసుకుని, ఆ మొత్తాన్ని బ్యాంకు ఈఎంఐ గా మార్చుకోవడమే ఉత్తమమనే ధోరణి ఐటీ ఉద్యోగుల్లో స్పష్టంగా పెరిగినట్లు ప్రముఖ రియల్ ఎస్టేట్ కన్సల్టెన్సీ నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. నెలకు 50,000 అద్దె రూపంలో చెల్లిస్తే ఐదేళ్ల తర్వాత మన చేతిలో ఏమీ మిగలదు.. అదే మొత్తాన్ని హోమ్ లోన్ ఈఎంఐగా చెల్లిస్తే దీర్ఘకాలంలో ఒక సొంత ఆస్తి సమకూరుతుంది అనే ఆర్థిక స్పృహ కొత్త తరం టెక్కీల్లో బలంగా కనిపిస్తోంది.ఈ మారిన మైండ్ సెట్ కారణంగా ఐటీ కారిడార్ చుట్టుపక్కల శరవేగంగా అభివృద్ధి చెందుతున్న సరికొత్త లొకేషన్లలో ఫ్లాట్ల విక్రయాలు ఒక్కసారిగా పుంజుకున్నాయి. తెల్లాపూర్, అమీన్‌పూర్, పటాన్‌చెరు, కొల్లూరు , నార్సింగి, గండిపేట పరిసర ప్రాంతాల్లో బడ్జెట్ అపార్ట్‌మెంట్లతో పాటు లగ్జరీ గేటెడ్ కమ్యూనిటీలు, సెమీ-గ్రేడెడ్ విల్లా ప్రాజెక్టుల వైపు ఐటీ నిపుణులు మొగ్గు చూపుతున్నారు. బ్యాంకులు కూడా ఐటీ ఉద్యోగుల జీతాల ప్రొఫైల్‌ను బట్టి సులభంగానే 80 నుండి 90 శాతం వరకు గృహ రుణాలు మంజూరు చేస్తుండటం ఈ కొనుగోళ్ల జోరుకు మరింత ఊపునిస్తోంది.హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో హైడ్రా యాక్షన్ తదితర పరిణామాల తర్వాత ప్రస్తుతం కేవలం క్లియర్ టైటిల్స్, రేరా అనుమతులు ఉన్న ప్రాజెక్టులకే డిమాండ్ ఉంటోంది. నివాస గృహాల విలువ ఏటా స్థిరంగా పెరుగుతుండటం, హైదరాబాద్ ఐటీ రంగ భవిష్యత్తుపై నమ్మకం ఉండటంతో.. అద్దె ఇళ్ల ఇబ్బందుల కంటే సొంత ఫ్లాట్ కొనుగోలు వైపే ఎక్కువ మంది మొగ్గు చూపుతున్నారు. ఈ ట్రెండ్ ఇలాగే కొనసాగితే రాబోయే రెండు మూడు త్రైమాసికాల్లో నివాస ఇళ్ల అమ్మకాలు మరిన్ని సరికొత్త రికార్డులను సృష్టించడం ఖాయమని మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు.




## అంతరాష్ట్ర బదిలీలకు గ్రీన్ సిగ్నల్...

హైదరాబాద్, జూన్ 23 (న్యూస్ పల్స్)ఏపీ, తెలంగాణ రాష్ట్రాల విభజన అనంతరం పెండింగ్‌లో ఉన్న ప్రభుత్వ ఉద్యోగుల అంతర్‌రాష్ట్ర బదిలీల అంశం మరోసారి తెరపైకి వచ్చింది. ఏపీలో పనిచేస్తున్న 891 మంది ఉద్యోగులు తెలంగాణకు శాశ్వత బదిలీ కోరుతూ సుముఖత వ్యక్తం చేయగా, వారి జాబితాను ఏపీ ప్రభుత్వం తెలంగాణకు పంపించింది. ఈ ప్రతిపాదనకు తెలంగాణ ప్రభుత్వం అంగీకారం తెలిపితే దాదాపు 12 ఏళ్లుగా కొనసాగుతున్న ఉద్యోగుల సమస్యకు పరిష్కారం లభించే అవకాశం ఉంది. ఇదే సమయంలో రాష్ట్రస్థాయి కార్యాలయాల ఉద్యోగులకు వారంలో ఐదు రోజుల పనిదినాల విధానాన్ని మరో ఏడాది పొడిగిస్తున్నట్లు ఏపీ ప్రభుత్వం ప్రకటించింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ప్రభుత్వ ఉద్యోగుల అంతర్‌రాష్ట్ర బదిలీల ప్రక్రియ మళ్లీ తెరపైకి వచ్చింది. రెండు రాష్ట్రాల విభజన తర్వాత విభజన చట్టం ప్రకారం శాశ్వత ప్రాతిపదికన ఏపీలో పని చేస్తున్న 891 మంది ఉద్యోగులు తెలంగాణకు శాశ్వత ప్రాతిపదికన వెళ్లేందుకు సుముఖత వ్యక్తం చేశారు. ఈ మేరకు ఏపీలో పని చేస్తున్న 891 మంది ఉద్యోగుల జాబితాను ఏపీ ప్రభుత్వం తాజాగా తెలంగాణకు పంపింది.ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఏపీ సీఎస్ లేఖ రాశారు. తదుపరి చర్యలు తీసుకునేందుకు ఈ జాబితాను త్వరగా పరిశీలించి, అభిప్రాయాన్ని, అంగీకారం తెలియజేయాలని అందులో తెలంగాణ ప్రభుత్వానికి ఏపీ విజ్ఞప్తి చేసింది. దీనిపై తెలంగాణ ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేస్తూ గ్రీన్‌సిగ్నల్ ఇస్తే ఎంతోకాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ ఉద్యోగుల శాశ్వత బదిలీల ప్రక్రియ సుఖాంతం అవుతుంది. గతంలో ఏపీ నుంచి తెలంగాణకు వెళ్లడానికి మొత్తం 1943 మంది ఆప్షన్‌ను ఎంచుకున్నారు. ఇందులో ప్రస్తుతం 891మంది ఉద్యోగులు ఏపీ నుంచి తెలంగాణకు వెళ్లడానికి సిద్ధమయ్యారు.కాగా 2014, జూన్ 2న తెలంగాణ రాష్ట్ర విభజన సమయంలో ఏపీ, తెలంగాణకు ఉద్యోగుల్ని విభజించిన సంగతి తెలిసిందే. ఈ కేటాయింపుల్లో తెలంగాణ జిల్లాలకు చెందినవారు కొందరు ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లారు. దీంతో 2014 నుంచి వారు అక్కడే కొనసాగాల్సిన పరిస్థితి వచ్చింది. పండుగలు, కుటుంబ అకేషన్స్, సెలవులు వంటి సందర్భాల్లో ఇంటికి వెళ్లాలంటే ఇబ్బందిగా ఉందని, తమను సొంత రాష్ట్రంలో పని చేసే అవకాశం కల్పించాలని అప్పటి నుంచి ఈ ఉద్యోగులంతా ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఇందులో కొంతమంది ఉద్యోగులు ప్రతి వారం శుక్రవారం సాయంత్రం ఏపీ నుంచి తెలంగాణకు వచ్చి.. మళ్లీ సోమవారం ఉదయం ఏపీకి చేరుకుంటున్నారు. గత 12 ఏళ్లుగా ఈ సమస్య ఇలాగే కొనసాగుతోంది. ఈ క్రమంలో తాజాగా ఈ సమస్యకు చెక్ పెట్టేందుకు ఏపీ సర్కార్ కీలక ముందడుగు వేసింది. దీనితోపాటు ఏపీ సర్కార్ మరో కీలక ప్రకటన కూడా చేసింది. రాష్ట్రస్థాయి కార్యాలయాల్లో పనిచేసే ప్రభుత్వ ఉద్యోగులకు వారంలో 5 రోజుల పనిదినాలను మరో ఏడాది పాటూ పొడిగిస్తున్నట్లు తన ప్రకటనలో వెల్లడించింది. ఉద్యోగుల శాశ్వత బదిలీకి తెలంగాణ సర్కార్ కూడా గ్రీన్‌సిగ్నల్ వస్తే ఈ సమస్య పరిష్కారమవుతుంది.అలాగే విభజన సమయంలో ఏపీకి చెందిన ప్రభుత్వ ఉద్యోగులు కూడా కొందరు తెలంగాణలో ఉండిపోయారు. వీళ్లు కూడా మమ్మల్ని ఆంధ్రప్రదేశ్ కు శాశ్వత బదిలీ చేయమని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేస్తున్నారు.

## ”జ్ఞాన వికాసానికి గ్రంథాలయం ఓ వేదిక...

**కామారెడ్డి జిల్లా గ్రంథాలయాన్ని సందర్శించిన డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్‌కు ఘన సత్కారం**

కామారెడ్డి,జూన్ 23:కామారెడ్డి జిల్లా కేంద్రంలోని జిల్లా గ్రంథాలయ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి ఆహ్వానం మేరకు ఈరోజు కామారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ జిల్లా గ్రంథాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలో విద్యార్థులు, పోటీ పరీక్షల అభ్యర్థులు మరియు పాఠకుల కోసం ఏర్పాటు చేసిన వివిధ సౌకర్యాలను ఆయన పరిశీలించారు.చదువుకునే



వారికి ప్రశాంతమైన వాతావరణంతో పాటు అవసరమైన అన్ని వసతులు కల్పించినందుకు గ్రంథాలయ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి ని డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో గ్రంథాలయాల పాత్ర ఎంతో కీలకమని, ఇటువంటి సౌకర్యాల కల్పన సమాజ అభివృద్ధికి దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు.అనంతరం జిల్లా గ్రంథాలయ చైర్మన్ ×మద్ది చంద్రకాంత్ రెడ్డి డీసీసీ అధ్యక్షులు ×ఏలే మల్లికార్జున్ ని శాలువాతో ఘనంగా సత్కరించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఇరువురు ప్రజా సేవ, విద్యాభివృద్ధి మరియు యువత ప్రగతి కోసం కలిసి పనిచేయాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ×కామారెడ్డి టౌన్ కాంగ్రెస్ అధ్యక్షులు ఐరెని సందీప్ కుమార్, కామారెడ్డి మండల అధ్యక్షులు రాజా గౌడ్, కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్, ఎస్టీ సెల్ అధ్యక్షులు రెడ్యా నాయక్, ఎస్సీ సెల్ అధ్యక్షులు బాలరాజు, సిడిసి చైర్మన్ ఇర్షత్, డీసీసీ కార్యవర్గ సభ్యులు, కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు. పలువురు పార్టీ కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.”విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేస్తున్న కామారెడ్డి జిల్లా గ్రంథాలయం. సేవా కార్యక్రమాలకు అంకితమైన చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డిని అభినందించిన డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్.”

# చీలిక దిశగా సమాజ్ వాదీ పార్టీ

లక్నో, జూన్ 23, (న్యూస్ పల్స్)తృణమూల్ కాంగ్రెస్ లో చీలికలు, శివసేన ఉద్ధవ్ వర్గంలో చీలికలు.. తాజాగా మరో పార్టీ కూడా చీలిక దిశగా ప్రయాణిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. అదే సమాజ్ వాదీ పార్టీ. యూపీ ఎన్నికలు సమిపిస్తున్న తరుణంలో ఈ వార్త పెద్ద సంచలనం రేపుతోంది.సమాజ్ వాదీ ఎంపీలంతా బీజేపీ వైపు చూస్తున్నట్లు మంత్రి ఓం ప్రకాశ్ రాజ్ భర్ పెద్ద బాంబు పేల్చారు. దీంతో దేశ రాజకీయాలు ఆసక్తిగా మారాయి.సమాజ్ వాదీ పార్టీలో భారీ చీలిక తప్పదని, ఆ పార్టీకి చెందిన పలువురు నేతలు ఇప్పటికే బీజేపీ వైపు వెళ్లేందుకు సిద్ధంగా వున్నారంటూ ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. మహారాష్ట్రపైనే దృష్టి పెట్టొద్దని, ఇప్పుడు యూపీ వంతు వచ్చిందంటూ వ్యాఖ్యానించారు. ఎవరైనా కొనుగోలు కావడానికి సిద్ధంగా వుంటేనే వారిని ఎవరైనా కొనుగోలు చేస్తారు. మహారాష్ట్ర



గురించే కాకుండా యూపీ పై కూడా దృష్టి నిలపాలని మంత్రి అందులో పేర్కొన్నారు.సమాజ్‌వాదీ పార్టీ సీనియర్ నాయకుడు, అఖిలేష్ యాదవ్ బాబాయి అయిన రామ్ గోపాల్ యాదవ్ ఇటీవల కేంద్ర హోం మంత్రి అమిత్ షాను కలిసి ఒక లేఖను అందజేశారని, ఆ లేఖ పార్టీలోని ఒక వర్గం బీజేపీలో చేరడానికి సిద్ధంగా ఉందనే సంకేతాన్ని ఇచ్చిందని ఆయన పేర్కొన్నారు. అయితే, ఈ విషయంపై సమాజ్‌వాదీ పార్టీ లేదా బీజేపీ నుండి ఎటువంటి స్పష్టతా రాలేదు. తృణమూల్ కాంగ్రెస్ లేదా శివసేన లో జరిగినట్లుగా, ఉత్తరప్రదేశ్‌లోని ప్రధాన ప్రతిపక్ష పార్టీ అయిన సమాజ్‌వాదీ పార్టీలో ప్రస్తుతం చీలిక వచ్చే అవకాశం లేదని అక్కడి రాజకీయ పరిశీలకులు మరియు విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే, ఇటీవల కొన్ని అంతర్గత విభేదాలు మాత్రం వున్నట్లు సమాచారం.027 ఎన్నికలకు ముందు టికెట్ల కేటాయింపు విషయంలో కొందరు నాయకుల మధ్య అసంతృప్తి తలెత్తే అవకాశం ఉందని, ఇది పార్టీ మరియు అఖిలేష్ ప్రణాళికలకు విఘాతం కలిగించవచ్చని వారు భావిస్తున్నారు. గత రాజ్యసభ ఎన్నికల్లో జరిగిన క్రాస్-వోటింగ్ ఉదంతాలతో కూడా పరిశీలకులు దీనిని ముడిపెడుతున్నారు.క్షణమే చీలిక వచ్చే సూచనలేవీ కనిపించనప్పటికీ, రాజ్‌భర్ చేసిన వ్యాఖ్యలు మాత్రం ఖచ్చితంగా ఒక రకమైన ప్రకంపనలను రేకెత్తించాయి. ఏది ఏమైనా, రాజకీయాల్లో ఏం జరుగుతుందో అంచనా వేయడం కష్టం; ఎప్పుడు మిత్రులు అకస్మాత్తుగా శత్రువులుగా మారుతారో, లేదా ఎప్పుడు చిరకాల రాజకీయ ప్రత్యర్థులు ఊహించని విధంగా మిత్రులుగా మారతారో ఎవరూ చెప్పలేంఅయితే, ఒకవేళ ఎస్పీలో చీలిక ఏర్పడితే, దాని ప్రభావం ప్రధానంగా వచ్చే ఏడాది?అంటే 2027లో?జరగనున్న అసెంబ్లీ ఎన్నికలపై పడుతుంది. అంతేకాకుండా, పార్లమెంటరీ సమీకరణాలు కూడా మారవచ్చు. ప్రస్తుతం రాజ్యసభలో ఎస్పీ ప్రధాన ప్రతిపక్ష పార్టీలలో ఒకటిగా ఉంది, అలాగే రామ్ గోపాల్ యాదవ్ ఆ పార్టీకి చెందిన ప్రముఖ వ్యక్తి మరియు బలమైన గొంతుకగా ఉన్నారు. రాజ్యసభలో సమాజ్‌వాదీ పార్టీకి మొత్తం నలుగురు ఎంపీలు ఉన్నారు. ఒకవేళ పెద్ద సంఖ్యలో రాజ్యసభ ఎంపీలు పార్టీ మారితే, సభలో ప్రతిపక్షం బలహీనపడి, ప్రభుత్వం తన బిల్లులను సులభంగా ఆమోదించుకునే అవకాశం ఏర్పడుతుంది.

# రంగు రంగుల కాగితాలతో హైదరాబాద్‌లో జనాభా లెక్కలు

హైదరాబాద్, జూన్ 23, (న్యూస్ పల్స్)సాంకేతిక పరిజ్ఞానం లేని కాలంలోనే హైదరాబాద్ సంస్థానం జనాభా గణనలో సరికొత్త రికార్డు సృష్టించింది. 1901 నాటి నిజాం రాజ్యంలో కంప్యూటర్లు, కాలిక్యులేటర్లు లేకుండానే కేవలం రంగుల కాగితాలు, ప్రత్యేక చిహ్నాల సాయంతో జనాభాను అత్యంత ఖచ్చితంగా లెక్కించారు. అంతకుముందున్న సంక్లిష్ట 'టాలీ మార్కుల' పద్ధతికి స్వస్తి పలికి.. జర్మనీకి చెందిన బవేరియన్ విధానాన్ని స్థానిక అవసరాలకు అనుగుణంగా మార్చి ఈ ప్రయోగం చేశారు. నాటి సెన్సస్ అధిపతి మిర్జా మెహదీ ఖాన్ నేతృత్వంలో సాగిన ఈ వినూత్న ప్రక్రియ ఇప్పటికీ దేశ చరిత్రలో ప్రత్యేకంగానే నిలిచింది.ఆధునిక సాంకేతికత, కంప్యూటర్లు, కాలిక్యులేటర్లు అందుబాటులోకి రాకముందు.. అదీ నూట ఇరవై ఏళ్లకు పైగా సుదీర్ఘ కాలం క్రితమే హైదరాబాద్ సంస్థానంలో అత్యంత పారదర్శకమైన, వేగవంతమైన పద్ధతిలో జనాభా గణన జరిగిందన్న విషయం మీకు తెలుసా? 1901లో నిజాం పరిపాలన సాగుతున్న కాలంలో.. అప్పటి జనాభా లెక్కల అధికారులు కేవలం రంగు రంగుల కాగితపు స్లిప్పులు, ప్రత్యేక శారీరక, సామాజిక గుర్తులను ఉపయోగించి సమగ్ర జనాభాను లెక్కించారు. నాటి హైదరాబాద్ సంస్థానంలో జరిగిన రెండో జనాభా గణనలో ప్రవేశపెట్టిన ఈ వినూత్న పద్ధతికి సంబంధించిన పలు ఆసక్తికరమైన చారిత్రాత్మక విశేషాలు ఆర్కైవ్స్ రికార్డుల ద్వారా వెలుగులోకి వచ్చాయి. ఆ పూర్తి వివరాలు మీకోసం.నిజాం రాజ్యంలో.. ముఖ్యంగా 1891 సమయంలో మొదటిసారి జనాభా గణన నిర్వహించినప్పుడు.. వ్యక్తుల వివరాలను నమోదు చేయడానికి కాగితాలను వాడేవారు. ముఖ్యంగా ఇందుకోసం ఆ కాగితాలపై గీతలు గీయడం అనే సాంప్రదాయ పద్ధతిని వాడేవారు. అయితే ఈ ప్రక్రియ చాలా సమయం తీసుకోవడమే కాకుండా, శ్రమతో కూడుకున్నదిగా, తప్పులు దొర్లడానికి ఆస్కారం ఉన్నదిగా ఉండేది. దీంతో నాటి ప్రముఖ గణాంక నిపుణులు ఈ పాత పద్ధతి పట్ల పెదవి విరిచారు. దీనిని అధిగమించడానికి హైదరాబాద్ సెన్సస్ ఆపరేషన్స్ అధిపతిగా ఉన్న 'మిర్జా మెహదీ ఖాన్' సరికొత్త ఆలోచన చేశారు. 1871లో జర్మనీలోని 'బవేరియన్ జనాభా గణన'లో విజయవంతంగా ఉపయోగించిన కాగితపు స్లిప్పుల విధానాన్ని ఆయన అధ్యయనం చేశారు. ఆ విదేశీ పద్ధతిని భారతదేశ పరిస్థితులకు, స్థానిక అవసరాలకు అనుగుణంగా మార్చి.. మరింత సులభతరంగా మార్పులు చేసి 1901 జనాభా లెక్కింపులో ప్రవేశ పెట్టారుఈ సరికొత్త విధానంలో భాగంగా గణన అధికారులు ప్రతి ఇంటికి వెళ్లి అక్కడి నివాసితుల మతం ఆధారంగా వేర్వేరు రంగుల కాగితపు స్లిప్పులను పంపిణీ చేసేవారు. హిందువులను లెక్కించేందుకు గోధుమ రంగు స్లిప్పులు, ముస్లింలను గుర్తించేందుకు ఆకు పచ్చ రంగు స్లిప్పులను, క్రైస్తవుల కోసం గులాబీ రంగు స్లిప్పులను, జైనుల జనాభాను లెక్కించేందుకు నీలం రంగు స్లిప్పులను ఉపయోగించారు. ఇతర మతాలు, విశ్వాసాల వారి కోసం తెలుపు రంగు స్లిప్పులను కేటాయించారు.కేవలం మతాన్నే కాకుండా సదరు వ్యక్తి లింగం, వైవాహిక స్థితిని కూడా సులభంగా తెలుసుకునేందుకు ఈ స్లిప్పులపై ప్రత్యేక రేఖాచిత్రాలు, ముద్రణ గుర్తులను ముద్రించారు. పురుషులు, మహిళలు, అవివాహితులు, వివాహితులు, వితంతువులను గుర్తించడానికి వేర్వేరు మార్కింగ్‌లు ఉండేవి. సమాచారం సేకరించిన అనంతరం, ఆ స్లిప్పులను వివిధ రంగులు, చిహ్నాల వారీగా వేరు చేసి లెక్కించేవారు. దీనివల్ల సంస్థానంలోని జనాభా మిశ్రమం, స్త్రీ-పురుష నిష్పత్తి లాంటి కీలక గణాంకాలు చాలా ఖచ్చితంగా వెల్లడి అయ్యాయి.మిర్జా మెహదీ ఖాన్ తన అధికారిక నివేదిక 'సెన్సస్ ఆఫ్ ఇండియా 1901 (వాల్యూమ్ చీచీఎఎ - హైదరాబాద్)' లో పేర్కొన్నట్లుగా.. ఈ మోడిఫైడ్ బవేరియన్ విధానం హైదరాబాద్‌లో అద్భుత ఫలితాలను ఇచ్చింది. పాత పద్ధతితో పోలిస్తే ఈ రంగుల కాగితాల లెక్కింపు వల్ల సమయం, శ్రమ, ప్రభుత్వ ధనం భారీగా ఆదా అయ్యాయి. అత్యంత ఖచ్చితమైన సమాచారాన్ని తక్కువ ఖర్చుతో క్రోడీకరించడంలో నిజాం రాచరిక రాష్ట్రం సాధించిన ఈ ప్రయోగం నాటి భారతదేశ జనాభా గణన చరిత్రలోనే ఒక గొప్ప మైలురాయిగా నిలిచిపోయింది.

# ట్రెండింగ్ లో సైకిల్ ప్రెసిడెంట్

తిరువనంతపురం జూన్ 23, (న్యూస్ పల్స్)సాధారణంగా చిన్న పదవి దక్కినా ప్రజాప్రతినిధులు లగ్జరీ కార్లు, ప్రొటోకాల్స్ కోసం పాకులాడుతుంటారు. కానీ కేరళలో ఒక స్థానిక సంస్థల నేత అధికారుల అహంకారానికి, ఏకపక్ష నిర్ణయాలకు వ్యతిరేకంగా అత్యంత సాదాసీదాగా నిరసన తెలిపి వార్తల్లో నిలిచారు. కొల్లాం జిల్లాలోని ఆదిచ్చనల్లూర్ గ్రామ పంచాయతీ ప్రెసిడెంట్, సీపీఐ నాయకుడు జినోజీ ఎడ్వర్డ్.. ఒక ప్రతిష్టాత్మక ప్రభుత్వ కార్యక్రమానికి హాజరయ్యేందుకు ఏకంగా 30 కిలోమీటర్లు సైకిల్ తొక్కుకుంటూ వెళ్లారు. పంచాయతీ సెక్రటరీ ఆయనకు అధికారిక వాహనాన్ని నిరాకరించడమే ఇందుకు కారణం. అధికారుల తీరుపై ధిక్కార స్వరం వినిపిస్తూ.. సైకిల్ పైనే ఘటనా స్థలానికి చేరుకున్న ఆయన్ను చూసి అక్కడి వారు ఆశ్చర్యపోయారు.ఈ వినూత్న నిరసన వెనుక ఓ పెద్ద కథే ఉంది. జినోజీ ఎడ్వర్డ్ ప్రాతినిధ్యం వహిస్తున్న వార్డు పరిధిలో ఒక తారు మిక్సింగ్ ప్లాంట్ నడుస్తోంది. దీనివల్ల స్థానికులకు ఇబ్బందులు తలెత్తుతుండటంతో ప్రెసిడెంట్‌తో పాటు మరో 21 మంది ఎన్నికైన బోర్డు సభ్యులు సదరు ప్లాంట్‌కు వ్యతిరేకంగా నిరసనలు చేపట్టారు. దీంతో ప్రజాభిప్రాయానికి విలువనిస్తూ పంచాయతీ తరపున సదరు కంపెనీకి 'స్టాప్ మెమో' జారీ చేయాల్సిందిగా పంచాయతీ సెక్రటరీ ఫ్లోసీ లాస్‌ను బోర్డు ఆదేశించింది. అయితే ఈ వ్యవహారంలో ప్రజాప్రతినిధుల నిర్ణయం నచ్చని సెక్రటరీ.. తనపై కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే ఈ అధికారిక కారును నిరాకరించారని ప్రెసిడెంట్ జినోజీ ఆరోపించారు.ఫోర్ట్ కొల్లాం చర్చి వేదికగా కేరళ రాష్ట్ర మంత్రి బిందు మిశ్రా, కొల్లాం మేయర్ ఏకే హఫీజ్ ముఖ్య అతిథులుగా ఒక ఉన్నత స్థాయి ప్రభుత్వ కార్యక్రమం ఏర్పాటైంది. ఈ కార్యక్రమానికి పంచాయతీ ప్రెసిడెంట్ హోదాలో జినోజీ వెళ్లాల్సి ఉంది. అయితే ఇది అధికారిక కార్యక్రమం కాదంటూ సెక్రటరీ కారు ఇచ్చేందుకు నిరాకరించారు. దీంతో వెనక్కి తగ్గని జినోజీ.. తన సైకిల్‌ను బయటకు తీశారు. ఆదిచ్చనల్లూర్ నుండి కొల్లాం వరకు సుమారు 15 కిలో మీటర్లు సైకిల్ తొక్కుకుంటూ సభా ప్రాంగణానికి చేరుకున్నారు. అనంతరం కార్యక్రమం ముగిశాక మళ్లీ అంతే దూరం సైకిల్‌పైనే వెనక్కి వెళ్లారు.కార్యక్రమ వేదికపైనే ఉన్న రాష్ట్ర మంత్రి బిందు కృష్ణకు జినోజీ ఎడ్వర్డ్ ఈ ఉదంతంపై లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ, ప్రజాప్రతినిధులను కించపరుస్తున్న పంచాయతీ సెక్రటరీ ఫ్లోసీ లాస్‌పై తక్షణమే శాఖాపరమైన క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంపై సెక్రటరీ స్పందన ఇంకా తెలియాల్సి ఉన్నప్పటికీ.. కేరళలో ప్రజాప్రతినిధులకు, అధికార యంత్రాంగానికి మధ్య ఉన్న అంతర్గత ఈగోల పోరును ఈ ఘటన మరోసారి బహిర్గతం చేసింది. ప్రస్తుతం సోషల్ మీడియాలో ఈ 'సైకిల్ ప్రెసిడెంట్' ఫోటోలు విపరీతంగా ట్రెండ్ అవుతున్నాయి.

# విజయ్ బాటలో కన్నడ నటుడు చేతన్

బెంగళూరు, జూన్ 23, (న్యూస్ పల్స్) కన్నడ చిత్రసీమలో విలక్షణ నటుడిగా రాణించి, సామాజిక ఉద్యమకారుడిగా గుర్తింపు తెచ్చుకున్న చేతన్ అహింసా ప్రత్యక్ష రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చారు. కర్ణాటకలోని సాంప్రదాయ పార్టీల అవినీతిపై సమరం ప్రకటిస్తూ.. రాబోయే 2028 అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా సరికొత్త రాజకీయ పార్టీని స్థాపించారు. రాష్ట్రంలోని మొత్తం 224 నియోజక వర్గాల్లోనూ ఒంటరిగా అభ్యర్థులను నిలుపుతామని ప్రకటించిన ఆయన.. దశాబ్దాలుగా వెనుకబడిన ఉత్తర కర్ణాటక అభివృద్ధిని తమ ప్రధాన ఎజెండాగా మార్చుకున్నారు. గతంలో పలు సామాజిక పోరాటాల వల్ల అరెస్టులు, కేంద్ర ప్రభుత్వం ఓసీఐ హోదా రద్దు వంటి తీవ్ర సవాళ్లు ఎదుర్కొన్న చేతన్.. ఇప్పుడు ఏకంగా పొలిటికల్ పార్టీతో కాంగ్రెస్, బీజేపీ, జేడీఎస్ కూటములకు సవాల్ విసరడం సంచలనంగా మారింది కన్నడ చిత్ర పరిశ్రమలో విలక్షణ నటుడిగా గుర్తింపు తెచ్చుకుని, గత కొంతకాలంగా సామాజిక అంశాలపై నిరంతరం గళమెత్తుతున్న సామాజిక కార్యకర్త చేతన్ అహింసా.. తమిళనాడు సీఎం విజయ్ బాటలో నడుస్తున్నారు. ముఖ్యంగా ఆయనలాగే ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగు పెట్టారు. కర్ణాటకలో ప్రస్తుతం ఉన్న రాజకీయ సమీకరణాలను మార్చేందుకే తాను రాజకీయాల్లోకి వస్తున్నాని చెబుతూ.. సరికొత్త రాజకీయ పార్టీని ప్రకటించారు. అంతేకాకుండా రాబోయే 2028 కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలోని మొత్తం 224 అసెంబ్లీ నియోజక వర్గాల్లో పోటీ చేయబోతున్నట్లు ప్రకటించారు. తాను రాజకీయ పార్టీని ప్రకటించబోతున్నట్లు.. చేతన్ అహింసా ఎక్స్ వేదికగా అధికారికంగా ప్రకటించారు. "ప్రస్తుతం కర్ణాటకలో ఉన్న అన్ని ప్రధాన రాజకీయ పార్టీలు అవినీతిలో కూరుకుపోయాయి. ప్రజా సమస్యలను పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. అందుకే కర్ణాటక 2028 ఎన్నికల కోసం మేము ఒక సరికొత్త అవినీతి రహిత రాజకీయ పార్టీని నిర్మిస్తున్నాం. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని స్థానాల్లోనూ ప్రజా పక్షాన నిలిచే అభ్యర్థులను నిలబెడతాం" అని ఆయన పేర్కొన్నారు. 'ఆ దినగలు', 'మైనా' వంటి విజయవంతమైన చిత్రాలతో కన్నడ ప్రేక్షకులకు దగ్గరైన చేతన్.. గత కొన్నేళ్లుగా సినిమాల కంటే సామాజిక ఉద్యమాల్లోనే ఎక్కువగా కనిపిస్తున్నారు. కుల వివక్ష, సామాజిక న్యాయం, రాజ్యాంగ హక్కులు, వాక్ స్వాతంత్ర్యం వంటి అంశాలపై ఆయన నిరంతరం పోరాడుతున్నారు.చేతన్ అహింసా స్థాపించబోయే ఈ నూతన పార్టీ



ప్రధానంగా 'ఉత్తర కర్ణాటక' ప్రాంతంపై ప్రత్యేక దృష్టి సారించనుంది. మౌలిక సదుపాయాలు, పారిశ్రామిక పెట్టుబడులు, ఉపాధి అవకాశాల కల్పనలో దశాబ్దాలుగా ఈ ప్రాంతం తీవ్ర వివక్షకు గురవుతోందని, దక్షిణ జిల్లాలతో పోలిస్తే ఉత్తర కర్ణాటక ఎంతో వెనుకబడి ఉందనే అసంతృప్తి స్థానికుల్లో బలంగా ఉంది. ఈ ప్రాంత ప్రజల గొంతుకగా నిలిచి, వారి హక్కుల సాధన కోసం తమ పార్టీ అగ్ర ప్రాధాన్యత ఇస్తుందని చేతన్ వివరించారు. కర్ణాటక రాజకీయాల్లో కాంగ్రెస్, బీజేపీ, జేడీఎస్ వంటి దిగ్గజ పార్టీలకు ప్రత్యామ్నాయంగా ఎదిగేందుకు గతంలో చాలామంది ప్రముఖులు ప్రయత్నించినప్పటికీ.. ఆ ప్రయత్నాలు పెద్దగా సఫలం కాలేదు. ఈ నేపథ్యంలో చేతన్ అహింసా అడుగులు ఏ మేరకు ప్రభావం చూపుతాయనేది ఆసక్తికరంగా మారింది.సామాజిక అంశాలపై చేతన్ చేసే వ్యాఖ్యలు ఆయన్ను పలుమార్లు వివాదాల్లోకి నెట్టాయి. 2021లో బ్రాహ్మణత్వానికి వ్యతిరేకంగా చేసిన వ్యాఖ్యల కారణంగా ఆయన అరెస్ట్ అయ్యారు. ఆ తర్వాత 2022లో కర్ణాటకలో తీవ్ర దుమారం రేపిన హిజాబ్ వివాదం సమయంలో హైకోర్టు న్యాయమూర్తిపై సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టినందుకు గానూ పోలీసులు ఆయనను రెండోసారి అదుపులోకి తీసుకున్నారు. ఈ వివాదాల తీవ్రత కారణంగా 2023లో కేంద్ర ప్రభుత్వం ఆయనపై 'దేశ వ్యతిరేక కార్యకలాపాల' ఆరోపణలు మోపుతూ.. ఆయనకు ఉన్న ఓవర్సీస్ సిటిజన్ షిప్ ఆఫ్ ఇండియా (ఓసీఐ) హోదాను రద్దు చేసింది. అయితే కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని చేతన్ కోర్టులో సవాలు చేశారు. ప్రభుత్వం తన అసమ్మతి గొంతును నొక్కేందుకే రాజకీయ ప్రేరేపితంగా ఈ చర్యకు పాల్పడిందని ఆయన గట్టిగా వాదిస్తున్నారు. ఈ అన్ని ఆటంకాలను ఎదుర్కొంటూనే.. ఇప్పుడు ఏకంగా పొలిటికల్ పార్టీ స్థాపించి ఎన్నికల బరిలోకి దిగుతుండటంతో కన్నడనాట రాజకీయ వేడి ఒక్కసారిగా రాజుకుంది. కన్న2017 లో విలక్షణ నటుడు ఉపేంద్ర సైతం రాజకీయాల్లోకి వస్తున్నట్లు ప్రకటించారు. అంతేకాకుండా సరికొత్త రాజకీయ పార్టీని కూడా ప్రకటించారు. 'కర్ణాటక ప్రజ్ఞావంత జనతాపక్ష పార్టీ' పేరుతో లోగోను ఆవిష్కరించారు. బెంగళూరులోని గాంధీభవన్ వేదికగా ఈ విషయాన్ని అధికారికంగా వెల్లడించారు. పేదలకు సేవ చేయడమే తన లక్ష్యం, పార్టీ లక్ష్యమంటూ తీసుకొచ్చిన ఈ పార్టీ.. ఆ తర్వాత కొంత కాలానికే మసకన పడింది. ఎన్నికల్లో రెండు శాతం ఓట్లు కూడా రావాలంటూ పార్టీ అధినేతలు చెప్పగా.. ఉపేంద్ర తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఆ తర్వాత ఆయన బీజేపీలో చేరబోతున్నట్లు వార్తలు వచ్చాయి

# సంగం పెరుగు ప్యాకెట్లో ఎలుక

వరంగల్ ,సంగం పెరుగు ప్యాకెట్ లో ఎలుక పిల్ల రావడం కలకలం రేపింది. వరంగల్ ఎస్‌ఆర్‌ఆర్తోట సమీపంలోని ఓ కిరాణా షాపులో ఒక వ్యక్తి పెరుగు పౌచ్ కొనుగోలు చేసాడు. పెరుగు ప్యాకెట్ కొనుగోలు చేసి ఇంటికి తీసుకెళ్లి కట్ చేయగా, అందులో చనిపోయిన ఎలుక పిల్ల కనిపించింది. సదరు వ్యక్తి వెంటనే కిరాణా యజమానిని నిలదీసి అధికారులకు ఫిర్యాదు చేసాడు. సమాచారం అందుకున్న అధికారులు రంగంలోకి దిగి, . కిరాణా షాపును పరిశీలించి, వెంటనే ఆ బ్యాచ్కి సంబంధించిన ప్యాకెట్ల అమ్మకాలు నిలిపివేశారు. జనగామలో 50 ప్యాకెట్లు, కరీమాబాద్, లక్ష్మీపురం మార్కెట్ ఏరియా, హనుమకొండ భవానీనగర్లోని షాపుల్లో ఆ బ్యాచ్కి చెందిన పెరుగు ప్యాకెట్లు సీజ్ చేసారు.ఆ బ్యాచ్కు సంబంధించిన పెరుగు అమ్మకాలు నిలిపివేసి శాంపిల్స్ను హైదరాబాద్ ల్యాబ్ పంపించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా ఫుడ్ ఇన్స్పెక్టర్ కృష్ణమూర్తి తెలిపారు.

# బీజేపీ నేతలకు ఏమైంది

హైదరాబాద్, జూన్ 23, (న్యూస్ పల్స్) ఒక్క విమర్శకు సరైన సమాధానం లభించడం లేదు. కనీసం ఆత్మరక్షణకు కూడా పాల్పడే అవకాశం కూడా కనిపించడం లేదు. అంత వీక్ అయిపోయారా.. గట్టిగా వాయిస్ కూడా వినిపించలేకపోతున్నారా.. ఇలా ఎందుకు ఉండిపోతున్నారు.. ఇలా ఎందుకు అయిపోతున్నారు.. ఇదిగో ఇలానే సాగుతోంది నంలో ఒక టాక్ బలంగా నడుస్తోంది. దక్షిణాదిన బీజేపీకి వ్యూహం లేదు హవా లేదని అంటున్నారు. 10 మందిలో ఆరు ఏడుగురు ఇదే చెప్తారు. కర్ణాటకలో తప్పితే బీజేపీ ఎక్కడ బలంగా లేదు. కర్నాటకలో వచ్చిన అధికారం నిలుపుకోవడం లేదు. తమిళనాడులో బీజేపీకి మొదటి నుంచి వ్యతిరేకత ఉంది. కానీ అన్నామలై వచ్చాక ఆ ముద్రను చెరిపేసి కొంత వరకూ సక్సెస్ అయ్యారు. చివరకు ఆయనే బీజేపీ నుంచి వెళ్లిపోవడంతో అక్కడా వ్యూహం బెడిసికొట్టింది..ఇక ఏపీలో సొంతంగా బలపడే వ్యూహమే అక్కడ లేదు. టీడీపీతో కలిసే పోటీచేస్తు గెలుస్తున్నారు. ప్రత్యేక హోదా విషయంలో బీజేపీ వ్యతిరేకత బలపడింది. రాజ్యసభలో మద్దతు కోసం జగన్ ను చేరదీసి పొందారని జనంలో భావన ఉంది. బీజేపీ కి ఆంధ్రాలో బలం లేకపోగా వ్యూహం కూడా లేకపోయింది.కేరళలో బీజేపీ వ్యూహం సక్సెస్ అయ్యింది. రాజీవ్ చంద్రశేఖర్ లాంటి నాయకుడిని బీజేపీ ఎంపిక చేయడం కమలం పార్టీకి బలంగా మారింది. తెలంగాణలో ఏర్పడిన దాంట్లో కూడా బీజేపీకి వాటా ఉందని సుష్మ స్వరాజ్ చెప్పడం.. తెలంగాణ ప్రజలు ఆదరించడం జరిగింది. తెలంగాణలో దీనివల్ల ఒరిగిందేమీ లేదు. కేవలం మోడీ మీద అభిమానంతో పార్లమెంట్ ఎన్నికల్లో సీట్లు తెచ్చుకుంది. బండి సంజయ్ హయాంలోనే బీజేపీ తెలంగాణలో బలపడింది.. అనేక సీట్లు గెలిచింది కూడా. బండి సంజయ్ పాదయాత్ర ఆపించేసి బీజేపీ తప్పు చేసింది. అది కంటిన్యూ చేసి ఉంటే బీజేపీ బలపడేది. కానీ బండి సంజయ్ ను పక్కనపెట్టి తెలంగాణలో బీజేపీ మంచి అవకాశం కోల్పోయింది.బిజెపి నాయకుల గురించి తెలంగాణలో చర్చ.2024 ఎన్నికల్లో బిజెపితెలంగాణలో సత్తా చాటింది. ఏకంగా 8 స్థానాలు గెలుచుకుంది. ఈ స్థాయిలో స్థానాలు సాధించి.. రెండు సెంట్రల్ మినిస్టర్ పోస్టులు అందుకొని.. తిరుగులేని స్థితిలో ఉండాల్సిన కమలం పార్టీ తెలంగాణ రాష్ట్రంలో ఇలా ఇబ్బంది పడుతూ ఉండడం ఆవేదన కలిగిస్తోంది.. ముఖ్యంగా ఇటీవల కాలంలో మెట్రో లోన్ కు సంబంధించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వేసిన ప్రశ్నలకు ఇంతవరకు కిషన్ రెడ్డి నుంచి సరైన స్థాయిలో సమాధానం లభించలేదు. మెట్రో కు సంబంధించి రుణం మంజూరు కాకపోవడానికి కిషన్ రెడ్డి నే కారణమని రేవంత్ ఆరోపిస్తున్నారు. ఇటీవల అనేక సందర్భాలలో రేవంత్ రెడ్డి కిషన్ రెడ్డి మీద విమర్శలు చేశారు. కిషన్ రెడ్డి ఏదో ఊకదంపుడు విలేకరుల సమావేశం ఏర్పాటుచేసి.. అలా మాట్లాడుకుంటూ వెళ్లిపోయారు. అంతేతప్ప తెలంగాణ ముఖ్యమంత్రి విమర్శలకు గట్టిగా కౌంటర్ ఇవ్వలేకపోయారు.కిషన్ రెడ్డి మీద విమర్శలు వస్తే ఆయన మాత్రమే సమాధానం ఇవ్వాల్సిన పరిస్థితి.. కనీసం మిగతా ఎంపీలు గాని.. ఇతర నాయకులు గాని కిషన్ రెడ్డికి అనుకూలంగా మాట్లాడలేదు. రేవంత్ రెడ్డి తీరును విమర్శించలేదు. బిజెపి పార్టీ సోషల్ మీడియా కూడా అదే నిర్లక్ష్యంతో ఉంది. కనీసం వివరాలతో.. గణాంకాలతో కౌంటర్ ఇవ్వలేదు. బిజెపి నేతలు ఎవరికి వారే అన్నట్టుగా వ్యవహరిస్తున్న తీరుతో తెలంగాణ ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. 8 మంది ఎంపీలు ఉండి కనీసం.. గట్టిగా కౌంటర్ కూడా ఇవ్వలేరా అంటూ ప్రశ్నిస్తున్నారు.తెలంగాణ బిజెపి నేతల వ్యవహార శైలి ఎవరికి వారు అన్నట్టుగానే ఉంది. గతంలో బండి సంజయ్ బిజెపి రాష్ట్ర అధ్యక్షుడుగా ఉన్నప్పుడు పరిస్థితి ఇలా ఉండేది కాదు. ఆయనను మార్చిన తర్వాత తెలంగాణ రాష్ట్రంలో బిజెపి పరిస్థితి దారుణంగా మారిపోయింది. నేతలు ఎవరికి వారుగా వ్యవహరిస్తున్నారు. ఏదైనా ఆరోపణ వచ్చినప్పుడు లేదా విమర్శలు ఎదురైనప్పుడు సమిష్టిగా వాటికి కౌంటర్ ఇవ్వడం లేదు.. దీనికి తోడు కేంద్ర ప్రభుత్వ పథకాలను తెలంగాణ రాష్ట్రంలో ప్రచారం చేయడంలో ఇక్కడి నాయకులు విఫలమయ్యారు అని చెప్పుకోవచ్చు.. అందువల్లే రేవంత్ రెడ్డి కిషన్ రెడ్డి మీద తీవ్రస్థాయిలో విమర్శలు చేస్తున్నారు.బండి సంజయ్ కొడుకు ఎపిసోడ్ లో కూడా బిజెపి నేతలు పెద్దగా స్పందించింది లేదు. పైగా కొంతమంది నాయకులు మీడియాకు లీకులు ఇచ్చినట్టు వార్తలు వచ్చాయి.

## 'ముగ్గురిని సజీవ దహనం చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలి'

### బీసీ జేఏసీ మిర్యాలగూడ పట్టణాధ్యక్షుడు బంటు వెంకటేశ్వర్లు ముదిరాజ్




మిర్యాలగూడ టౌన్, జూన్ 23 : మిర్యాలగూడ పట్టణంలోని కలాల్‌వాడలో ఈ నెల 5న ముగ్గురి సజీవ దహనానికి కారణమైన నిందితుడు శ్రీకాళహస్తి శిరీష్ కుమార్ ను కఠినంగా శిక్షించాలని బీసీ జేఏసీ మిర్యాలగూడ పట్టణ అధ్యక్షుడు బంటు వెంకటేశ్వర్లు ముదిరాజ్ డిమాండ్ చేశారు. స్థానిక మిర్యాలగూడ పట్టణంలో అమరవీరుల స్థూపం వద్ద బీసీ జేఏసీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భార్య ధనమ్మపై కోపంతో అభం శుభం తెలియని అత్త వనం చందమ్మ, పిల్లలు నక్క లక్ష్మణ్, నక్కా ప్రణీతను అర్ధరాత్రి పెట్రోల్ పోసి తగలబెట్టడం సహించరానిదన్నారు. ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా వెంటనే విచారణ జరిపించి నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.మొన్నటికి మొన్న ధనమ్మ ఇటీవల వన్ టౌన్ పోలీస్ స్టేషన్ బయట పెట్రోల్ పోసుకుని తన భర్త బయటకు వస్తే తనను కూడా చంపేస్తాడని పేర్కొంటూ పెట్రోల్ పోసుకోవడం జరిగిందన్నారు. కావునా నిందితులకు బెయిల్ రాకుండా న్యాయవాదులు ప్రయత్నం చేయాలని, వెంటనే బహిరంగ శిక్షపడేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జన సమితి జిల్లా ఉపాధ్యక్షులు లావురి క్రాంతి కుమార్, వెంకటేష్, పవన్, శ్రీకాంత్, సందీప్, సునీల్, నాగార్జున, నాగయ్య, లావణ్య, రజిత, ప్రియాంక, సునీత, మాలతి, స్వాతి పాల్గొన్నారు.

## ఫొటోగ్రాఫర్ కుటుంబానికి రూ.1.60 లక్షల ఆర్థిక సాయం



బూర్గంపహాడ్, జూన్ 23 : బూర్గంపహాడ్‌కు చెందిన ఫొటోగ్రాఫర్ భజన మల్లయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా బూర్గంపహాడ్ మండల ఫొటోగ్రాఫర్ల వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు దాసరి బాలకృష్ణ ఆధ్వర్యంలో రాష్ట్ర, జిల్లా అసోసియేషన్ల సహకారంతో మంగళవారం మల్లయ్య కుటుంబ సభ్యులకు రూ. 1.60 లక్షల కుటుంబ భరోసా ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ఫొటోగ్రాఫర్లు ఒక సంఘంగా ఏర్పడి రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.హుస్సేన్ సారధ్యంలో ఈ పథకాన్ని ఆవిష్కరించుకున్నారని, 20 వేల సభ్యులతో కొనసాగుతున్న ఈ సంఘంలో ప్రతి ఫొటోగ్రాఫర్ రూ. 10 చొప్పున సంఘం ఖాతాలో జమ చేయాలని.. అప్పుడు రూ. 1.70 లక్షలు సంఘం ఖాతాలో జమ అవుతాయని వీటిని ఎవరైనా సభ్యుడు మరణిస్తే రూ. 1.60 లక్షలు చొప్పున బాధిత కుటుంబానికి అందజేయడం జరుగుతుందని, రూ. 10 వేలు వైద్యఖర్చులకు అందిస్తామని తెలిపారు. ఈ నగదుతో ఓ ఫొటోగ్రాఫర్ కుటుంబానికి కుటుంబ భరోసా కల్పించినట్లవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫొటోగ్రాఫర్ల వెల్ఫేర్ అసోసియేషన్ మండల కార్యదర్శి ఆవుల వెంకటరమణారెడ్డి, కోశాధికారి మేడి శేషగిరి, జిల్లా అధ్యక్షుడు కీసర సుధాకర్రెడ్డి, జిల్లా కన్వీనర్ పంపన రమేష్, ఉపాధ్యక్షులు మూర్తి, విజయ్, మండల ఫొటోగ్రాఫర్లు పాల్గొన్నారు.

## 'బడి బాటతో విద్యా చైతన్యం'

చుంచుపల్లి, జూన్ 23 : చుంచుపల్లి మండలం రాంపురం గ్రామంలో బడిబాట కార్యక్రమాన్ని పాఠశాల ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ చేపట్టి విద్యార్థుల చేరికలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ బాదావత్ అనిత ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బడి ఈడు ఉన్న ప్రతి చిన్నారి తప్పనిసరిగా ప్రభుత్వ పాఠశాలలో చేరేలా తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. నాణ్యమైన విద్య, ఉచిత పాఠ్య పుస్తకాలు, మధ్యాహ్న భోజనం, యూనిఫామ్‌లు వంటి అనేక సౌకర్యాలు ప్రభుత్వ పాఠశాలల్లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.గ్రామ పెద్దలు మాట్లాడుతూ.. బడి ఈడు ఉన్న పిల్లలందరూ పాఠశాలలో చేరేలా గ్రామ స్థాయిలో సహకరిస్తామని, పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపకుండా ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జె.బాలు, ఉప సర్పంచ్ పులిచర్ల వెంకటేశ్వరరావు, చైర్మన్ నర్సింహారావు, గ్రామ పెద్దలు విశ్వనాథం, చెన్నారావు, ముత్యాలరావు, జానకి, భవాని, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.



# సెల్ఫ్ గోల్ చేసుకుంటున్న కవిత

హైదరాబాద్, జూన్ 23 (న్యూస్ పల్స్)నీ బలం , సామర్థ్యం ఎంతో తెలియాలంటే నీ ప్రత్యర్థిని బట్టే తెలుస్తుంది. అంటే నీవు ఎంచుకునే ప్రత్యర్థిని బట్టే నీ స్థాయి ఖరారవుతుంది. రాజకీయాల్లో ఇది వంద శాతం నిజం. తెలంగాణ రక్షణ సేన పేరుతో రాజకీయం చేస్తున్న కల్వకుంట్ల కవిత ఉద్యమకారిణి తరహా రాజకీయ నేత అయ్యేందుకు చేస్తున్న ప్రయత్నాలు ఇక్కడే బెడిసికొట్టాయి. తెలంగాణలో కనీస ఉనికి లేని జనసేన పార్టీని ఆమె ప్రత్యర్థిగా ఎంచుకున్నారు. రోజూ పవన్ పై విమర్శలు చేస్తూ.. అదే రాజకీయంగా గడిపేస్తున్నారు.రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ తో మూడు రోజుల పాటు సుదీర్ఘంగా మేథోమథనం జరిపి.. తన సరికొత్త పార్టీ స్ట్రాటజీని, భవిష్యత్తు యాక్షన్ ప్లాన్‌ను, ప్రజల్లోకి వెళ్లే వినూత్న లైన్‌ను ఆమె సిద్ధం చేసుకున్నట్లు పొలిటికల్ సర్కిల్స్‌లో పెద్ద ప్రచారమే జరిగింది. కానీ, ఆ కాన్సెప్టులను, పీకే ఇచ్చిన గైడ్‌లైన్స్‌ను ఆమె ఎంతవరకు ఒంటబట్టించుకున్నారనేది ఇప్పుడు పెద్ద ప్రశ్నార్థకంగా మారింది. పీకే మార్క్ పాజిటివ్ పాలిటిక్స్ ను పక్కనబెట్టి, ఆమె ఎంచుకున్న సరికొత్త పొలిటికల్ లైన్ చూసి సొంత పార్టీ శ్రేణులే ముక్కున వేలేసుకుంటున్నాయి.తెలంగాణ రాజకీయాల్లో సెంటిమెంట్‌ను



రగిల్చాలన్నా, రాజకీయంగా మైలేజ్ సాధించాలన్నా ఇప్పటికీ నారా చంద్రబాబు నాయుడును టార్గెట్ చేయడం ఒక సంప్రదాయ ఆయుధంగా వస్తోంది. చంద్రబాబును బూచిగా చూపిస్తే తెలంగాణ సమాజంలో కొంతవరకు పొలిటికల్ అడ్వాంటేజ్ పొందే అవకాశం ఉండేది. కానీ కవిత మాత్రం ఊహించని విధంగా, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను టార్గెట్ చేసుకుని తన విమర్శల పదును పెంచారు. తెలంగాణకు, ఇక్కడి రాజకీయ సమీకరణాలకు పెద్దగా సంబంధం లేని పవన్ కల్యాణ్ చుట్టూ కవిత రాజకీయం తిప్పడం వెనుక ఏ రకమైన వ్యూహం ఉందో ఎవరికీ అర్థం కావడం లేదు.పవన్ కల్యాణ్‌పై పోరాటం చేయడం వల్ల కవితకు రాజకీయంగా కలిసి వచ్చే శక్తులు గానీ, సామాజిక వర్గాలు గానీ లేవు. పవన్ కల్యాణ్ ఎక్కడో అన్న మాటలను పట్టుకుని, వాటిని తెలంగాణకు ఆపాదించి, ఇక్కడి ప్రజలను భావోద్వేగాల వైపు రెచ్చగొట్టాలని ఆమె చూస్తున్నారు. దీని ద్వారా తన వ్యక్తిగత బలాన్ని, ఉనికిని పెంచుకోవచ్చని భావిస్తున్నప్పటికీ.. క్షేత్రస్థాయిలో ఆమెకు లభిస్తున్న మద్దతు శూన్యం. పవన్‌ను వ్యతిరేకించడం ద్వారా తెలంగాణలో ఎలాంటి పొలిటికల్ డివిడెండ్స్ రావనే కనీస లాజిక్‌ను కవిత మిస్ అవుతున్నారణ. గతంలో లాగా ఆంధ్రా వర్సెస్ తెలంగాణ అనే అరిగిపోయిన ప్రాంతీయ సెంటిమెంట్ ఆయుధం ఇప్పుడు తెలంగాణ సమాజంలో పెద్దగా పనిచేయడం లేదు. ముఖ్యంగా జెన్-జీ, యువత అభివృద్ధి, ఉపాధిని కోరుకుంటున్నారు తప్ప ఇలాంటి కృత్రిమ వివాదాలను పట్టించుకోవడం లేదు.తెలంగాణలో ప్రస్తుతం ఉనికిలోనే లేని, క్షేత్రస్థాయిలో తమకు శత్రువే కాని పవన్ కల్యాణ్‌ను ఒక పెద్ద విలన్‌గా చిత్రీకరించి, ఆయనపై కవిత చేస్తున్న ఈ శైలి పోరాటం చాలా మందికి అపరిపక్వంగా, తెలివితక్కువతనంగా కనిపిస్తోంది. లేని శత్రువును సృష్టించుకుని యుద్ధం చేయడం వల్ల సమయం, శ్రమ వృథా అవ్వడమే తప్ప ఎలాంటి లాభం ఉండదు. ప్రశాంత్ కిషోర్ లాంటి వ్యూహకర్త ఖచ్చితంగా ఇలాంటి బలహీనమైన, కాలం చెల్లిన వ్యూహాలను కవితకు రికమండ్ చేసి ఉండరనేది స్పష్టమైన వాస్తవం. పీకే ఇచ్చిన గైడెన్స్‌ను పక్కనబెట్టి, సొంత ఆలోచనలతో పవన్ కల్యాణ్‌పై అనవసర యుద్ధానికి దిగడం కవితకు సెల్ఫ్ గోల్ లాగా మారుతోంది.

## 'ప్రజారోగ్య పరిరక్షణకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి'

### నల్లగొండ మున్సిపల్ కమిషనర్ బచ్చలకూరి శరత్‌చంద్ర

నీలగిరి, జూన్ 23 : వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజారోగ్య పరిరక్షణ, పారిశుధ్య నిర్వహణ, అంటువ్యాధుల నివారణ, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, ఆస్తి పన్ను వసూళ్లు, మౌలిక వసతుల అభివృద్ధి తదితర అంశాలపై అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బచ్చలకురి శరత్ చంద్ర అధికారులను ఆదేశించారు. కార్పొరేషన్ పరిధిలోని వివిధ శాఖల అధికారులతో మంగళవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరంలో డెంగ్యూ, మలేరియా, కలరా వంటి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతి వార్డులో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహిస్తూ దోమల వ్యాప్తికి కారణమయ్యే నిల్వ నీటిని వెంటనే తొలగించాలని ఆదేశించారు. ప్రజల్లో వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతపై విస్తృత అవగాహన కల్పించాలని తెలిపారు. వార్డ్ ఆఫీసర్లు, జవాన్లు, రిసోర్స్ పర్సన్స్, శానిటేషన్ సిబ్బంది పరస్పర సమన్వయంతో పనిచేస్తూ కాలనీలు, డివిజన్లలో పారిశుధ్య కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు.ప్రతిరోజూ క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి, ఎక్కడైనా నీరు నిల్వ ఉన్నా లేదా పారిశుధ్య సమస్యలు ఉన్నా వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల



రెండో విడత లబ్ధిదారుల ఎంపిక, ధృవీకరణ ప్రక్రియను వేగవంతం చేసి అర్హులైన పేదలకు గృహాలు అందేలా చర్యలు చేపట్టాలని వార్డ్ ఆఫీసర్లకు సూచించారు. అలాగే గతంలో నిర్మాణం పూర్తయిన డబుల్ బెడ్రూమ్ ఇండ్లలో అవసరమైన మరమ్మతు పనులను త్వరితగతిన పూర్తి చేసి లబ్ధిదారులకు కేటాయించేందుకు చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. కార్పొరేషన్ పరిధిలో సుమారు రూ. 32 కోట్ల మేర ఉన్న ఆస్తి పన్ను బకాయిల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని కమిషనర్ తెలిపారు. పట్టణ అభివృద్ధికి అవసరమైన రోడ్లు, డ్రైన్లు, తాగునీటి పైప్‌లైన్లు తదితర మౌలిక వసతుల కల్పనకు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. ౧జఈఎఆఅ నిధులతో చేపడుతున్న పనులను వేగవంతం చేయడంతో పాటు, కొత్తగా మంజూరైన ఫిల్టర్ బెడ్ నిర్మాణానికి సంబంధించిన టెండర్ ప్రక్రియను త్వరగా పూర్తి చేసి పనులు ప్రారంభించాలని ఆదేశించారు. నగరంలో అక్రమ నిర్మాణాలను అరికట్టేందుకు టౌన్ ప్లానింగ్ విభాగం కఠినంగా వ్యవహరించాలని, ఎల్ఆర్ఎస్‌కు సంబంధించిన పెండింగ్ దరఖాస్తులను నిబంధనల మేరకు త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు.అనుమతులు లేకుండా చేపడుతున్న నిర్మాణాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఇకపై వారానికొకసారి జరిగే సాధారణ సమీక్షలతో పాటు శాఖల వారీగా ప్రత్యేక సమీక్షలు నిర్వహించి, పెండింగ్ పనులపై స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని కమిషనర్ తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. వర్షాకాలంలో ప్రజలు తమ ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, తడి చెత్త, పొడి చెత్త, శానిటరీ వ్యర్థాలు, హానికర వ్యర్థాలను విడివిడిగా మున్సిపల్ వాహనాలకు అందించాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు. వ్యాధులు వచ్చిన తర్వాత చికిత్స కోసం ఖర్చు చేయడం కంటే ముందస్తు జాగ్రత్తలు పాటించడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు.

## లఖ్‌నవూ అగ్నిప్రమాదం.. 'నాన్నా.. నన్ను కాపాడండి' అంటూ..

ఉత్తర్ ప్రదేశ్: లఖ్‌నవూ అలీగంజ్ ప్రాంతంలో భారీ అగ్నిప్రమాదం సంభవించిన సంగతి తెలిసిందే. మూడంతస్తుల భవనంలో మంటలు చెలరేగి 13 మంది విద్యార్థులు సహా మె?త్తం 15 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. భవనంలోని మూడో అంతస్తులో యానిమేషన్ కోచింగ్ సెంటర్ ఉంది. ప్రమాదం జరిగిన సమయంలో ఈ సెంటర్‌లో దాదాపు 30 మంది విద్యార్థులు ఉండగా.. వారిలో 13 మంది సజీవ దహనమయ్యారు. మరో ఐదుగురికి తీవ్రగాయాలు అయ్యాయి. కొంతమంది విద్యార్థులు ప్రాణభయంతో మె?దటి అంతస్తు నుంచి కిందకి దూకగా.. మిగతా వారిని పోలీసులు రక్షించారు. మరోవైపు, ఈ ఘటనపై ఉన్నతస్థాయి దర్యాప్తునకు యూపీ డిప్యూటీ సీఎం బ్రజేశ్ పాఠక్ ఆదేశించారుఈ ప్రమాదంలో మృతిచెందిన వారి కుటుంబసభ్యులు, స్నేహితులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. తమ వారిని కోల్పోయిన బాధలో వారు మాట్లాడిన మాటలు అందరినీ కంటతడి పెట్టిస్తున్నాయి. తన కుమారుడిని గుర్తు చేసుకుంటూ ప్రభ్‌జోత్ సింగ్ అనే వ్యక్తి కన్నీటిపర్యంతం అయ్యారు. 'నా కుమారుడు సుఖ్మణి సింగ్ సోమవారం మధ్యాహ్నం సుమారు 2:15 గంటలకు ఫోన్ చేశాడు. నాన్నా మంటలు వ్యాపించాయి, దయచేసి నన్ను కాపాడండి అన్నాడు. కానీ మేము అతన్ని కాపాడలేకపోయాం' అని ఆవేదన వ్యక్తం చేశాడు. 'దాదాపు రెండున్నర గంటల పాటు భవనాన్ని దట్టమైన పొగ కమ్మేయడంతో మా కుమారుడు లోపలే చిక్కుకుపోయాడు. త్వరగా సహాయం అందుంటే అతను బతికే వాడు. స్థానికులు వీడియోలు తీయకుండా సహాయం చేసి ఉంటే కొంతమందైనా ప్రాణాలతో ఉండేవారు. బహుశా నా కుమారుడూ బతికి ఉండేవాడేమో' అని ఆదిత్య శ్రీవాస్తవ తల్లి పేర్కొన్నారు.మరోవైపు అబ్దుల్ రెహమాన్ మరణంతో అతని కుటుంబం తీవ్ర దుఃఖంలో మునిగిపోయింది. రెహమాన్ అద్దె ఇంట్లో నివసించేవాడని అతని స్నేహితుడు సద్దాం షేక్ తెలిపారు. 'రెహమాన్ తండ్రి పక్షవాతంతో బాధపడుతున్నారు, తల్లి గృహిణి. కుటుంబంలో సంపాదించే ఏకైక వ్యక్తి అతనే. ఇప్పుడు వారి పరిస్థితి ఏంటి?' అని ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ సందర్భంగా ఓ యువతి తన స్నేహితుడు ఆదిత్యని గుర్తు చేసుకుంది. 'ఆదిత్యకి చాలా మంచి భవిష్యత్తు ఉంది. గత వారమే అతన్ని కలవాలని అనుకున్నా. ఇంతలోనే ఆదిత్య ప్రాణాలు కోల్పోయాడు' అని విలపించింది.

## అమెరికా పౌరసత్వం ఖరీదు.. ఫైలింగ్ ఫీజు మరింత పెంచే ప్రతిపాదన



న్యూ ఢిల్లీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారం చేపట్టినప్పటి నుంచి ఇమిగ్రేషన్ రూల్స్‌ను కఠినతరం చేస్తూనే ఉన్నారు. తాజాగా ఆయన కార్యవర్గం చేసిన ప్రతిపాదనలతో అమెరికా పౌరసత్వం మరింత ఖరీదుగా మారనుంది. పౌరసత్వ దరఖాస్తుల ఫైలింగ్ ఫీజులను 75 శాతం మేర పెంచాలని యూఎస్‌కు చెందిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌లాండ్ సెక్యూరిటీ ప్రతిపాదించింది. సక్రమ మార్గంలో వచ్చిన వలసదారులు పౌరసత్వానికి దరఖాస్తు చేసుకుంటే.. ప్రాసెసింగ్, వెట్టింగ్ ఖర్చులు భరించాల్సిరావడంతోపాటు ఇప్పటివరకు ఉన్న పలు మినహాయింపులను కూడా కోల్పోనున్నారు.పౌరసత్వ దరఖాస్తు (పేపర్ బేస్డ్) ఫైల్ చేయడానికి ఫీజు 760 డాలర్ల నుంచి 1330 డాలర్లకు పెరగనుంది. ఆన్‌లైన్ దరఖాస్తు విషయానికొస్తే 710 డాలర్ల నుంచి 1280 డాలర్లకు ఫీజు పెంపును అధికారులు ప్రతిపాదించారు. ఈ కొత్త ఫీజులు అమల్లోకి వస్తే 75 శాతం మేర భారం పడనుంది. ఏదైనా సిటిజన్‌షిప్ అప్లికేషన్ తిరస్కరణకు గురైతే.. దానిని తిరిగి పరిశీలించాలని కోరినా సరే ఖర్చుల మోత మోగనుంది. ఆ రుసుము 830 డాలర్ల నుంచి 1475 డాలర్లకు అంటే 645 డాలర్ల మేర పెరగనుంది. ప్రస్తుతం ఈ ప్రతిపాదిత నిబంధనలపై 60 రోజులపాటు ప్రజాభిప్రాయ సేకరణ చేయనున్నారు.అలాగే అమెరికాలో ఆదాయ ఆధారిత మార్గదర్శకాల ప్రకారం.. దరఖాస్తుదారులకు ప్రస్తుతం లభిస్తోన్న మినహాయింపులను తొలగించాలని డీహెచ్ఎస్ ప్రతిపాదించింది. 400 శాతం లేక అంతకంటే తక్కువ ఆదాయం ఉన్న దరఖాస్తుదారులకు రెడ్యూస్డ్ ఫీజ్ ఆప్షన్‌ను తీసేయాలని సూచించింది. ఈ కొత్త రూల్స్ వల్ల సహజంగా పౌరసత్వం పొందడానికి అర్హత ఉన్న శాశ్వత నివాసితులు తమకున్న అవకాశాలు కోల్పోయే ప్రమాదం ఉందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

## గంగారంతండాలో తిరిగి ప్రారంభం కానున్న ప్రభుత్వ పాఠశాల



కారేపల్లి, జూన్ 23 : గత కొన్నేండ్లుగా మూతబడిన ప్రభుత్వ పాఠశాల తిరిగి ప్రారంభం కావడానికి సిద్ధమైంది. పాఠశాలకు విద్యార్థులు రాకపోవడంతో 2022లో ఆ పాఠశాల మూతబడింది. రాష్ట్ర ప్రభుత్వం మూతబడిన పాఠశాలలను మళ్లీ తెరిపించాలని ఆదేశాలు జారీ చేయగా తమ గ్రామంలో తిరిగి పాఠశాల ప్రారంభం కాబోతుండడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. వివరాల్లోకి వెళితే.. ఖమ్మం జిల్లా సింగరేణి(కారేపల్లి) మండలం గంగారం తండాలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థుల కొరతతో 2022 సంవత్సరంలో మూతబడింది. అప్పటి ఉపాధ్యాయులు పాఠశాలను మళ్లీ తిరిగి ప్రారంభించాలని ప్రయత్నించినప్పటికీ తల్లిదండ్రులు తమ పిల్లలను బడికి పంపేందుకు ముందుకు రాకపోవడంతో ప్రారంభానికి నోచుకోలేదు. తాజాగా జరిగిన పంచాయతీ ఎన్నికల్లో గంగారమ్ తండా సర్పంచ్ గా ఎన్నికైన భూక్యా కిరణ్ తల్లిదండ్రులను చైతన్య పరిచి విద్యార్థులను రప్పించేందుకు ప్రయత్నం చేశాడు.దీంతో గంగారం తండా గ్రామంలో గురువారం నుండి పాఠశాలను తెరిపించేందుకు మండల విద్యాశాఖ అధికారి జయరాజ్ ముహూర్తం ఖరారు చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ జయరాజు మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ప్రభుత్వం ఉచిత పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, మధ్యాహ్న భోజనం తదితర సౌకర్యాలు కల్పిస్తుందని, అంతేకాకుండా అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే విద్యా బోధన చేస్తున్నామని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రుల సహకారంతో పాఠశాల అభివృద్ధి కోసం తమ వంతు కృషి చేస్తానని స్థానిక సర్పంచ్ కిరణ్ హామీ ఇచ్చారు. పాఠశాల ప్రారంభానికి కావాల్సిన అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వెల్లడించారు.

## ఒకే కుటుంబంలో ముగ్గురి దారుణ హత్య.. కుమార్తెతోపాటు ఆమె ప్రియుడే నిందితులు..!

బెంగళూరు, జూన్ 23: నగరంలోని ఒక అపార్ట్‌మెంట్‌లో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు వ్యక్తులు దారుణ హత్యకు గురయ్యారు. ఆ కుటుంబంలోని వ్యక్తే ఈ హత్యలు చేసి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. స్థానికంగా సంచలనం సృష్టించిన ఈ ఘటన సోమవారం కేఆర్ పురం పోలీస్ స్టేషన్ పరిధిలో సీగేహళ్లి, ధమానిక్ లేఅవుట్‌లోని సాయి గ్రీన్ అపార్ట్‌మెంట్‌లో జరిగింది. ఆ అపార్ట్‌మెంట్‌లో సోమసుందర్ (55), అతని భార్య ముత్తులక్ష్మి (48), పెద్ద కుమార్తె శ్వేతతో పాటు చిన్న కుమార్తె సుప్రియ (20) నివసిస్తున్నారు.ఆ దంపతులతోపాటు చిన్ని కుమార్తె సుప్రియ దారుణ హత్యకు గురయ్యారు. ఈ హత్యలపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో పలు కీలక విషయాలు వెలుగులోకి వచ్చినట్లు తెలుస్తోంది. సోమసుందర్ దంపతుల పెద్ద కుమార్తె శ్వేతతోపాటు ఆమె ప్రియుడు కెన్నెత్ ఈ హత్యలు చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.కొన్నాళ్లుగా కెన్నెత్‌తో శ్వేత సహజీవనం చేస్తోంది. ఈ విషయం తల్లిదండ్రులకు తెలిసింది. దీనిని వారు తీవ్రంగా వ్యతిరేకించారు. శ్వేత భారీగా అప్పులు చేసింది. దాంతో శ్వేతపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో వారి మధ్య తరచూ ఘర్షణలు చోటు చేసుకునేవని పోలీసులు దర్యాప్తులో వెల్లడి అయింది. ఈ కారణాంగానే వారిని వీరిద్దరు హత్య చేసి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు.

# బీజేపీ గూటికి వైసీపీ ఎంపీలు

తిరుపతి జూన్ 23, మళ్లీ కూటమిలో చేరికలు మొదలయ్యే అవకాశం ఉంది. నియోజకవర్గాల పునర్విభజన బిల్లు మళ్ళీ పార్లమెంటు ముంగిటకు రానుంది. ఏపీలో దాదాపు 80 అసెంబ్లీ సీట్లతో పాటు 13 పార్లమెంటు సీట్లు పెరగనున్నాయి. అదే జరిగితే అధికార కూటమికి అభ్యర్థులు అవసరం ఉంటారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పుంజుకోకపోవడంతో ఆ పార్టీ నేతలు జంప్ చేసేందుకు సిద్ధంగా ఉన్నారు. ఈ పరిణామాల క్రమంలోనే జనసేన చేరికల కమిటీని ఏర్పాటు చేసింది. మరోవైపు బిజెపి సైతం ఆపరేషన్ ఆకర్ష్ మొదలు పెట్టినట్లు తెలుస్తోంది. వైసీపీ ఎంపీలపై ప్రత్యేకంగా ఫోకస్ పెట్టినట్లు సమాచారం.ప్రస్తుతం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి లోక్సభలో నలుగురు ఎంపీలు, రాజ్యసభలో నలుగురు ఎంపీలు ఉన్నారు. వారిపై బిజెపి గురి పెట్టినట్లు ప్రచారం నడుస్తోంది. వారు సైతం అవసరాల కోసం బిజెపి వైపు మొగ్గు చూపుతున్నట్లు టాక్ నడుస్తోంది. ముఖ్యంగా రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి పేరు వినిపిస్తోంది. మద్యం కుంభకోణం కేసులో మిథున్ రెడ్డి నిందితుడిగా ఉన్నారు. ఆయన తండ్రి, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పై కూడా అనేక కేసులు నమోదయ్యాయి. వైసీపీలో ఒక వెలుగు వెలిగారు ఈ ఇద్దరు తండ్రి కొడుకులు. కానీ ఇప్పుడు సంక్లిష్ట పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. అందుకే పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి బిజెపి వైపు చూస్తున్నట్లు మళ్లీ ప్రచారం మొదలైంది.మరోవైపు వివేకానంద రెడ్డి హత్య కేసులో ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు అవినాష్ రెడ్డి. ఎంతకాలం జగన్మోహన్ రెడ్డి బిజెపితో ఉన్న స్నేహంతో అవినాష్ రెడ్డి బయటపడ్డారు. కానీ ఇప్పుడు వైసీపీ విషయంలో బిజెపి అభిప్రాయం మారింది. కోర్టు కూడా మళ్లీ విచారణ మొదలు పెట్టాలని సిబిఐ కు ఆదేశించే అవకాశం ఉంది. అదే జరిగితే అవినాష్ రెడ్డి అడ్డంగా బుక్ కావడం ఖాయం. అందుకే ఆయన సైతం బిజెపిని ఆశ్రయిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇంకోవైపు రాజ్యసభ సభ్యుడు వైవి సుబ్బారెడ్డి సైతం బిజెపికి టచ్ లోకి వెళ్లినట్లు తెలుస్తోంది. టీటీడీ లడ్డు కల్తీ కి సంబంధించి అభియోగాలు మోపుతూ విచారణ లోతుగా సాగింది. సుబ్బారెడ్డికి వ్యతిరేకంగా బలమైన ఆధారాలు లభించినట్లు తెలుస్తోంది.. అందుకే ఆయన సైతం బిజెపి వైపు వచ్చేందుకు మంతనాలు సాగిస్తున్నట్లు పొలిటికల్ వర్గాల్లో ఒక ప్రచారం ఉంది.అయితే ఈ ముగ్గురు జగన్మోహన్ రెడ్డికి అత్యంత విధేయులు. వారు పార్టీ మారుతారు అంటే అంత సులువు కాదు. పైగా వీరి అవసరం బిజెపికి ప్రస్తుతం లేదు. మీరు




బిజెపిలో కేవలం ఇబ్బందులను దృష్ట్యా వెళ్తారే తప్ప.. వీరికంటూ వైసీపీపై ఎటువంటి అసంతృప్తి లేదు. పైగా టిడిపి నుంచి అనేక రకాల అభ్యంతరాలు ఉంటాయి. మీరు ఎట్టి పరిస్థితుల్లో బిజెపిలో చేరే అవకాశం లేనట్టు చాలామంది కొట్టి పారేస్తున్నారు.ఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి మరో షాక్. ఆ పార్టీకి చెందిన మాజీ మంత్రి ఒకరు గుడ్ బై చెప్పనున్నారు. తెలుగుదేశం పార్టీలో చేరేందుకు దాదాపు సిద్ధపడ్డారు. గత కొంతకాలంగా జగన్మోహన్ రెడ్డి తీరుతో ఆగ్రహంగా ఉన్నారు. జగన్ వైఖరిలో మార్పు రాకపోవడంతో పార్టీని వీటడమే మేలన్న నిర్ణయానికి ఆయన వచ్చారు. కార్యకర్తలతో వరుసగా భేటీలు నిర్వహిస్తూ వచ్చిన ఆయన పార్టీకి రాజీనామా చేసేందుకు డిసైడ్ అయ్యారు. ఆయనే నెల్లూరు జిల్లాకు చెందిన మాజీమంత్రి మానుగుంట మహీధర్ రెడ్డి. ఇప్పటికే నెల్లూరు జిల్లాలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఒక రకమైన నైరాస్యం అలముకుంది. ఇప్పుడు మహీధర్ రెడ్డి గుడ్ బై చెబితే మరింత సంక్షోభం ఖాయం ఆ పార్టీకి.మానుగుంట మహిధర్ రెడ్డికి కందుకూరు రాజకీయాల్లో మంచి నేపథ్యం ఉంది. బలమైన క్యాడర్ కూడా ఉంది. మానుగుంట ఆదినారాయణ రెడ్డి వారసుడిగా పొలిటికల్ ఎంట్రీ ఇచ్చారు కాంగ్రెస్ పార్టీ ద్వారా. 1989లో తొలిసారిగా కందుకూరు నుంచి పోటీ చేసి గెలిచారు. 1994లో ఆయనకు కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇవ్వకపోవడంతో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. 1999లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి మరోసారి ఓటమి చవి చూశారు. 2004లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. 2009లో సైతం విజయాన్ని దక్కించుకున్నారు. నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి ప్రభుత్వంలో మంత్రిగా కూడా వ్యవహరించారు. ఉమ్మడి రాష్ట్రంలో కీలకమైన మున్సిపల్ శాఖ మంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టారు. 2014 ఎన్నికలకు దూరంగా ఉన్నారు. 2019లో మాత్రం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున గెలిచారు.. 2024 ఎన్నికల్లో జగన్ ఆయనకు టికెట్ ఇవ్వలేదు. కొంతకాలంగా పార్టీ కార్యక్రమాలకు మహిధర్ రెడ్డి దూరంగా ఉన్నారు. దాదాపు రెండేళ్లుగా ఆయన పార్టీలో యాక్టివ్ గా లేరు. ఇటీవల వరుసగా పార్టీ శ్రేణులతో పాటు అనుచరులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తూ వచ్చారు. పసుపు కండువా కప్పుకోవాలని దాదాపు ఒక నిర్ణయానికి వచ్చారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఉండి.. ఆ తరువాత నెల్లూరు జిల్లాలో విలీనమైన కందుకూరు నియోజకవర్గంలో మహీధర్ రెడ్డి టిడిపిలో చేరితే ఒక ఊపు రావడం ఖాయం అని విశ్లేషకులు భావిస్తున్నారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం, క్లీన్ ఇమేజ్ ఉన్న మహిధర్ రెడ్డి వంటి సీనియర్ నేత పార్టీని వీడితే కచ్చితంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీపై ప్రభావం చూపడం ఖాయం. మహీధర్ రెడ్డిని పార్టీని వీడకుండా జగన్ చేస్తున్న ప్రయత్నాలు కూడా ఫలితం ఇవ్వడం లేదని తెలుస్తోంది. చూడాలి మరి ఏం జరుగుతుందో..

## రైల్వేజంక్షన్ గా కుప్పం

తిరుపతి, జూన్ 23,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మరో కొత్త రైల్వే జంక్షన్ అందుబాటులోకి రానుంది. రెండేళ్లలో కుప్పం రైల్వే జంక్షన్‌గా మారనుంది. కర్ణాటకలోని మారికుప్పం నుంచి చిత్తూరు జిల్లా కుప్పం వరకూ కొత్త రైల్వేట్రాక్ ఏర్పాటు చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ పనులలో రైల్వే అధికారులు వేగం పెంచారు. ప్రస్తుతం ఈ మార్గంలోని భూములను చదును చేసే పనులు జరుగుతున్నాయి. కర్ణాటక సరిహద్దుల నుంచి ఏపీ సరిహద్దు వరకు భూమిని చదును చేసే పనులను చేపడుతున్నారు. ఇందులో ఇప్పటికే 90 శాతం పూర్తయ్యాయి . అలాగే బిసానత్తం నుంచి కుప్పం వరకు 18 కిలోమీటర్ల మేరకు పనులు చేపట్టనున్నారు. ఇందుకోసం 269 ఎకరాల భూమిని సేకరించారు. ఈ నూతన రైలు మార్గం ఏర్పాటు కోసం రూ.363 కోట్లు అంచనాలతో పనులు జరుగుతున్నాయి. 2028 మార్చికల్లా పనులు పూర్తి చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు.మరోవైపు కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల సరిహద్దులలో ఉంటుంది కుప్పం. రెండు రాష్ట్రాలకు సుమారుగా 30 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. చెన్నై బెంగళూరు రైల్వే మార్గంలో కుప్పం రైల్వేస్టేషన్ ఉండటంతో.. రోజూ పదుల సంఖ్యలో రైళ్లు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తుంటాయి. అమృత్ భారత్ స్టేషన్ల పథకం కింద రైల్వేశాఖ కుప్పం రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేస్తోంది. ఈ క్రమంలోనే 2011లో కుప్పం - మారికుప్పం మధ్యన కొత్త రైల్వే ట్రాక్ నిర్మాణం కోసం ప్రతిపాదనలు చేశారు.23.7 కి.మీ. మేరకు కుప్పం రామకుప్పం కొత్త రైల్వే లైన్ ఏర్పాటు చేసేందుకు రైల్వేశాఖ అధికారులు ప్రణాళికలు రచించారు. కుప్పం, మల్దేపల్లె, నక్కనపల్లి, గుండ్లసాగరం, కనమనపల్లె, అగరం, కుప్పిగానిపల్లి, కోటచెంబగిరి, పొగురుపల్లె, బిసానత్తం, అత్తిసత్తం మీదుగా మారికుప్పం వరకూ ఈ ట్రాక్ నిర్మిస్తున్నారు. ఈ ప్రాజెక్టులో భాగంగా కర్ణాటక ప్రభుత్వం ఇప్పటికే భూసేకరణ పూర్తి చేసింది. అలాగే మారికుప్పం ప్రాంతం నుంచి కర్ణాటక సరిహద్దు వరకు పనులు జరుగుతున్నాయి. ఈ ప్రాజెక్టు పూర్తి అయ్యి కుప్పం-మారికుప్పం రైల్వేట్రాక్ అందుబాటులోకి వస్తే.. ఈ మార్గంలో ప్యాసింజర్ రైళ్ల రాకపోకలు పెరుగుతాయి. అలాగే కుప్పం రైల్వేస్టేషన్ జంక్షన్‌గా రూపుదిద్దుకుంటుందని అధికారులు చెప్తున్నారు

## ఏపీలో రెడీగా మరో విద్యాసంస్థ

### రూ. 234 కోట్ల భారీ వ్యయం.. 50 ఎకరాల్లో వరల్డ్ క్లాస్ క్యాంపస్!


నెల్లూరు, జూన్ 23, ఆంధ్రప్రదేశ్ విద్యా రంగానికి కేంద్ర ప్రభుత్వం మరో భారీ కానుకను అందించింది. నెల్లూరు వేదికగా అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించనున్న కేంద్ర ప్రభుత్వ సంస్థ రీజినల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ కు సంబంధించిన మాస్టర్ ప్లాన్‌ను అధికారికంగా ఆవిష్కరించారు. ఈ ప్రతిష్టాత్మక క్యాంపస్ నిర్మాణ పనులను ప్రారంభించేందుకు వీలుగా ఎన్విరాన్‌మెంటల్ క్లియరెన్స్ కోసం కూడా దరఖాస్తు చేసుకున్నారు. మైసూర్ తర్వాత దక్షిణ భారతదేశంలోనే రెండవ ఆర్ఐఈ క్యాంపస్‌గా నెల్లూరు రూపుదిద్దుకోనుంది.ఈ ప్రపంచస్థాయి క్యాంపస్‌ను నెల్లూరులో దాదాపు 50 ఎకరాల విస్తీర్ణంలో అత్యంత ఆధునిక వసతులతో నిర్మించనున్నారు. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం రూ. 234.36 కోట్ల భారీ బడ్జెట్‌ను కేటాయించింది. ఈ అత్యాధునిక క్యాంపస్‌లో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన డిజిటల్ తరగతి గదులు, పరిశోధనా కేంద్రాలు , అత్యాధునిక లైబ్రరీ, కాన్ఫరెన్స్ హాల్స్‌తో పాటు విద్యార్థులు, అధ్యాపకులకు అవసరమైన హాస్టల్, వసతి గృహాల సముదాయాలను నిర్మించనున్నారు. పర్యావరణ అనుకూలమైన గ్రీన్ క్యాంపస్ నమూనాతో ఈ మాస్టర్ ప్లాన్‌ను సిద్ధం చేశారు.ఎన్‌సీఈఆర్‌టీ పరిధిలో పనిచేసే ఈ నెల్లూరు ఆర్ఐఈ.. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాల విద్యా అవసరాలను తీర్చనుంది. దక్షిణ భారతదేశంలోనే ఉపాధ్యాయ విద్య , అధ్యాపక శిక్షణ, విద్యా పరిశోధనల్లో ఒక ప్రధాన హబ్‌గా ఇది అవతరించనుంది. జాతీయ విద్యా విధానం కు అనుగుణంగా ఇక్కడ బోధనా పద్ధతులపై సరికొత్త పరిశోధనలు జరగనున్నాయి. నూతన తరం ఉపాధ్యాయులను తీర్చిదిద్దడంలో ఈ సంస్థ అత్యంత కీలక పాత్ర పోషించనుంది.గతంలో ఈ ప్రాజెక్టు మంజూరైనప్పటికీ వివిధ కారణాల వల్ల ఆలస్యమవగా.. ఇప్పుడు మాస్టర్ ప్లాన్ విడుదల కావడం, ఎన్విరాన్‌మెంటల్ క్లియరెన్స్ ప్రక్రియ తుది దశకు చేరడంతో నెల్లూరు ప్రజల్లో , విద్యా వర్గాల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. పర్యావరణ అనుమతులు రాగానే నిర్మాణ పనులు వేగంగా ప్రారంభం కానున్నాయి.

## ఉత్తరాంధ్ర అభివృద్ధి పరుగులు

విశాఖపట్టణం, జూన్ 23, ఉత్తరాంధ్ర పై వెనుకబాటు ఒక అపవాదు ఉంది. విశాఖ జిల్లాను పక్కన పెడితే విజయనగరం తో పాటు శ్రీకాకుళం జిల్లా వెనుకబడి ఉన్నాయన్నది ఇప్పటివరకు ఉన్న ప్రచారం. అయితే దానికి చెక్ పడనుంది. ఉత్తరాంధ్ర అన్ని విధాల అభివృద్ధికి పునాది పడింది. వచ్చే నెలలో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం జాతికి అంకితం చేయనున్నారు. మరోవైపు విశాఖ తో పాటు ఉత్తరాంధ్రకు భారీగా పెట్టుబడులు వస్తున్నాయి. ఇప్పటికే గూగుల్ డేటా సెంటర్ రాకతో.. ఐటీ అనుబంధ పరిశ్రమల చూపు విశాఖ వైపు ఉంది. కేవలం విశాఖ మాత్రమే కాదు విజయనగరం తో పాటు శ్రీకాకుళం జిల్లాలో కూడా ఈ పరిశ్రమల విస్తరణకు అవకాశం ఉంది. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం అనేది ఉత్తరాంధ్రకు గేమ్ చేంజర్గా నిలవనుంది. అన్ని రంగాల అభివృద్ధికి ఇది దోహదం కానుంది. పైగా సువిశాల తీర ప్రాంతం ఉత్తరాంధ్ర సొంతం. పర్యాటకంగానూ చాలా కీలక ప్రాజెక్టులు నిర్మితం కానున్నాయి ఉత్తరాంధ్రలో. కేవలం ఉత్తరాంధ్ర మాత్రమే కాదు పక్కనే ఉన్న ఒడిస్సా, చత్తీస్గఢ్ ప్రజలు సైతం భోగాపురం ఎయిర్పోర్ట్ మీదుగా రాకపోకలు సాగించనున్నారు. కచ్చితంగా ఇది విశాఖ తో పాటు ఉత్తరాంధ్రకు కలిసి వచ్చే అంశం. ఇతర రంగాల్లో కూడా అభివృద్ధి సాధిస్తే ఆదాయం భారీ స్థాయిలో సమకూరే అవకాశాలు ఉన్నాయిమరోవైపు విశాఖ- రాయపూర్ గ్రీన్ హైవే ఈ ఏడాది అందుబాటులోకి రానుంది. ఒడిస్సా తో పాటు చత్తీస్గఢ్ వరకు 500 కిలోమీటర్ల మేర ఈ రహదారి దాదాపు నిర్మితమైంది. దీంతో ఉత్తరాది రాష్ట్రాలకు కనెక్టివిటీ పెరుగుతుంది. ప్రధానంగా ఉత్తరాంధ్రలో తయారీ రంగ పరిశ్రమలతో పాటు ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు మరింత అభివృద్ధి కానున్నాయి. శ్రీకాకుళంలో కొబ్బరి జీడి ఉత్పత్తులకు జాతీయస్థాయి మార్కెట్ కలగనుంది. వీటితో పాటు అటవీ ప్రాంతాల్లో లభించే అటవీ ఉత్పత్తులకు సైతం మార్కెట్ సదుపాయం రానుంది. రవాణా మరింత మెరుగు పడనుంది. రవాణా అందుబాటులోకి రావడంతో ఔత్సాహికులు పరిశ్రమలు పెట్టేందుకు ఆసక్తి చూపుతారు. భారీగా పెట్టుబడులు కూడా పెడతారు.మరో రెండేళ్లలో గూగుల్ డేటా సెంటర్ నిర్మితం కానుంది. మరోవైపు రిలయన్స్ డేటా సెంటర్ సైతం ఏర్పాటు చేయనున్నారు. అయితే ఈ ఐటి అనుబంధ పరిశ్రమలు కేవలం విశాఖకు మాత్రమే పరిమితం కావడం లేదు. విజయనగరం తో పాటు శ్రీకాకుళం జిల్లాలో కూడా ఇవి ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. మరోవైపు శ్రీకాకుళం జిల్లాలో కార్గో ఎయిర్పోర్ట్ నిర్మాణం ఏర్పాటుకు వడివడిగా అడుగులు పడుతున్నాయి. కోస్టల్ క్యారీడార్ తో పాటు మూడో రైల్వే లైన్ నిర్మాణం కానుంది. ఇలా రవాణా పరంగా కనెక్టివిటీ పెంచుకుంటోంది ఉత్తరాంధ్ర. తద్వారా మరింత అభివృద్ధి దిశగా అడుగులు వేయనుంది అన్నమాట.

## డీ లిమిటేషన్ వరకు వైసీపీ కాపు నేతల టైం పాస్!

విజయవాడ, జూన్ 23, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో కాపు నేతలు మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నారు. మొన్నటి ఎన్నికల్లో ఓటమి తర్వాత వారిలో ఒక రకమైన భయం ఉంది. కానీ ప్రత్యామ్నాయం లేకపోవడంతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలోనే వారంతా కొనసాగుతున్నారు. కూటమి పార్టీలో చేరాలనుకున్నా.. ఆ మూడు పార్టీల నాయకత్వాలు పెద్దగా ఆసక్తి చూపలేదు. దీంతో వైసీపీలోనే ఉంటూ కాస్త హడావిడి చేస్తున్నారే తప్ప.. మనస్ఫూర్తిగా పనిచేయని కాపు నేతలు వైసీపీలో అధికంగా ఉన్నారు. ముఖ్యంగా గోదావరి జిల్లాలో అయితే ఉన్నామంటే ఉన్నాం అన్నట్టు వైసిపిలో కొనసాగుతున్నారు. రెండేళ్లు అవుతున్నా పార్టీలో ఎటువంటి పురోగతి లేదు. పుంజుకున్న దాఖలాలు లేవు. ఆపై కూటమి సమన్వయంతో ముందుకు సాగుతోంది. ఈ పరిస్థితుల్లో వైసీపీలో ఉంటే తమ పొలిటికల్ కెరీర్ క్లోజ్ అయిపోతుందని భయం ఆ నేతల్లో ఉందిమొన్నటి ఎన్నికల్లో కూటమికి రికార్డు స్థాయిలో మెజారిటీ లభించింది. ఆ ఫలితాలు చూశాక చాలామంది వైసిపి నేతలకు భవిష్యత్తుపై ఆశలు పోయాయి. అందుకే కూటమి పార్టీల్లోకి జంప్ కావాలని భావించారు. కానీ స్థానిక రాజకీయాల దృష్ట్యా కూటమి పార్టీల నుంచి గ్రీన్ సిగ్నల్ లభించలేదు. ఈ నేతలంతా అటు వెళ్లలేక.. ఇటు ఉండలేక వైసీపీలోనే ఉండిపోవాల్సి వచ్చింది. వైసీపీలో ఉంటూ ఉనికి కోసం వారు చేసే ప్రయత్నం అంతా ఇంతా కాదు. మళ్లీ ఇప్పుడు కాపు ఆత్మీయ సదస్సులు అంటూ సరికొత్త రాగాలు అందుకుంటున్నారు. నిన్ననే కాపు నేతల ఆత్మీయ సదస్సు జరిగింది. కాపులకు రాజ్యాధికారం కావాలన్నట్టు వారు మాట్లాడారు. వైసీపీకి దీంతో సంబంధం లేదు అని సంకేతాలు ఇచ్చారు. అయితే వీరు పార్టీ కోసం.. జగన్మోహన్ రెడ్డి కోసం ఈ ప్రయత్నం చేయలేదు. కేవలం అవకాశాల కోసం ఎదురు చూస్తున్నట్టు కనిపించారు.పవన్ కళ్యాణ్ కు వ్యతిరేకంగా కాపుల ఆత్మీయ సమావేశం పెట్టారు. కూటమి నుంచి పవన్ బయటకు వచ్చేలా ఒత్తిడి పెంచేందుకు ఈ ప్రయత్నం చేశారు. కానీ అంతకుమించి నిజం ఏంటంటే రాజకీయ భవిష్యత్తు ఇస్తామంటే.. వచ్చే ఎన్నికల్లో టికెట్లు ఇస్తామంటే మాత్రం వీరంతా కూటమి గూటికి చేరడం ఖాయం. ముఖ్యంగా జనసేన వైపు ఆశగా ఎదురుచూస్తున్నారు. త్వరలో డీలిమిటేషన్ జరగనున్న దృష్ట్యా దాదాపు 80 సీట్లు పెరుగుతాయి. వాటిలో వారి వారసులకు అవకాశం కల్పిస్తామన్న మరుక్షణం వారు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి గుడ్ బై చెప్పడం ఖాయం. ఈ కాపు ఆత్మీయ సమావేశాలు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజకీయ వ్యూహంలో భాగంగా జరగవచ్చు. కానీ వాటిని తమ వారసులకు ఒక రాజకీయ వారధిగా మార్చుకోవాలని చూస్తున్నారు నేతలు.శ్రీకాకుళం నుంచి నెల్లూరు వరకు ఉన్న కాపు నాయకులు పునరాలోచనలో ఉన్నారు. ప్రస్తుతం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఉన్నాం కాబట్టి అధినేత జగన్ ఆదేశాల ప్రకారం ఆత్మీయ సదస్సులు పెట్టాలని నిర్ణయించారు. కానీ ఇందులో మెజారిటీ కాపు నేతలు పార్టీ మారేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. వచ్చే నెలలో డిలిమిటేషన్ బిల్లు పార్లమెంటులో ఆమోదం పొందిన మరుక్షణం ఏపీలో రాజకీయాలు మారిపోతాయి. ప్రస్తుతం వైసీపీలో ఉన్న కాపు నేతలంతా వచ్చే ఎన్నికల వరకు ఆ పార్టీలో ఉంటారు అనుకోవడం చాలా తప్పు. వారు కూటమి నుంచి వచ్చే గ్రీన్ సిగ్నల్ కోసం ఎదురుచూస్తున్నారు. ఈ ఆత్మీయ సమావేశాలు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కోసం అని జగన్ అనుకున్నారు. కానీ జస్ట్ టైం పాస్ అని కాపు నేతలు భావిస్తున్నారు. మొత్తానికైతే జూలైలో డీలిమిటేషన్ బిల్లు ఆమోదం పొందిన మరుక్షణం చాలామంది కాపు నేతలు వైసీపీకి గుడ్ బై చెప్పడం ఖాయం. అటువంటి వారంతా టిడిపి కంటే జనసేన వైపు వెళ్తారు. అలా ప్లాన్ చేస్తున్నారన్నమాట.



## శ్రీవాణి నిధులు షిర్డికి ఇవ్వడం లేదా

విజయవాడ, జూన్ 23, కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయానికి భక్తుల నుంచి భారీ సంఖ్యలో విరాళాలు అందుతున్నాయి. ఈ నిధులతో వెంకన్న ఆలయాలతో పాటు ఇతరత్రా ఆలయాల నిర్మాణం, అభివృద్ధి, ఆయా ఆలయాల్లో భక్తుల సౌకర్యార్థం మౌలిక సదుపాయాల కల్పన పనులు చేపడుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న శ్రీవారి భక్తులు సమర్పిస్తున్న విరాళాలను తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) పాలక మండలి నిర్ణయం మేరకు వెచ్చిస్తున్నారు. అయితే షిరిడీ సాయి మందిరాలకు ఈ నిధులు అందడం లేదు. ఇదే విషయంపై తాజాగా వచ్చిన ఓ ప్రశ్నకు సమాధానం ఇచ్చిన ఏపీ దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ట్రస్టు నిధుల వినియోగంపై మరోమారు స్పష్టత ఇచ్చారు.శ్రీవాణి నిధులను హిందూ ధర్మశాస్త్రంలో పేర్కొన్న ఆలయాలకు మాత్రమే వెచ్చించాల్సి ఉంది. ఈ నిబంధన మేరకే టీటీడీ నిర్ణయం తీసుకుంటూ ఉంది. తిరుమలతో పాటు ఇతరత్రా హిందూ ఆలయాలన్నింటికీ దాదాపుగా ఈ ట్రస్టు నిధులను వెచ్చించే అవకాశం ఉంది. అయితే షిరిడీ సాయి ఆలయాల విషయానికి వచ్చేసరికి ఈ ట్రస్టు నిధులను వెచ్చించడానికి వీల్లేని పరిస్థితులు ఉన్నాయి. ఎందుకంటే షిరిడీ సాయి ఆలయం హిందూ ధర్మశాస్త్రంలో పేర్కొనబడలేదు. హిందూ ధర్మశాస్త్రాల్లో పేర్కొన్న దేవాదిదేవుల ఆలయాల వృద్ధి కోసం మాత్రమే ఈ నిధులు వెచ్చించాలని ఓ స్పష్టమైన నిబంధన అమలు అవుతోంది.ఇవే అంశాలను ప్రస్తావించిన మంత్రి ఆనం? అయినా శ్రీవాణి ట్రస్టు నిధుల కోసం వేచి చూసే పరిస్థితి షిరిడీ సాయి ఆలయానికి లేదని చెప్పారు. హిందూ దేవుళ్లకు కేవలం హిందువులు మాత్రమే భక్తులుగా కొనసాగుతుండగా? షిరిడీ సాయికి హిందువులతో పాటుగా ఇతర మతాలకు చెందిన వారు కూడా భక్తులుగా ఉన్న విషయాన్ని మంత్రి తెలిపారు.పౌరాణిక హిందూ ధర్మశాస్త్రాలు, ఆగమ సంప్రదాయాల్లో షిర్డీ సాయికి స్థానం లేదని, శ్రీవాణి నిధులను సనాతన ధర్మ ప్రచారం, వైదిక సంప్రదాయాల పరిరక్షణ కోసమే వినియోగిస్తున్నామని పేర్కొన్నారు. షిర్డీ సాయి ఆలయాల్లో ఆగమ శాస్త్రాల ప్రకారం పూజా విధానాలు జరగవని కూడా అభిప్రాయపడ్డారు. షిర్డీ సాయిబాబా అంశం గతంలోనూ వివాదాలకు కేంద్రబిందువైంది. సాయిబాబాను హిందూ దేవతలతో సమానంగా ఆరాధించాలా వద్దా అనే అంశంపై పీఠాధిపతులు, హిందూ మత సంస్థలు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేసిన సందర్భాలు ఉన్నాయి. మరోవైపు దేశవ్యాప్తంగా కోట్లాది మంది భక్తులు షిర్డీ సాయిబాబాను విశ్వసిస్తూ పూజిస్తుండటంతో ఈ అంశం తరచూ చర్చనీయాంశంగా మారుతోంది.ఇదిలా ఉండగా, శ్రీవాణి నిధులతో ఆలయాల నిర్మాణ కార్యక్రమాన్ని ప్రభుత్వం మరింత విస్తరించనున్నట్లు మంత్రి వెల్లడించారు. నెల్లూరు జిల్లా ఆత్మకూరు టిడ్కో కాలనీలో తొలి ఆలయ నిర్మాణాన్ని జూలైలో ప్రారంభిస్తామని తెలిపారు. దేవాదాయ శాఖ రెండేళ్ల ప్రగతి నివేదికను వివరిస్తూ పలు సంక్షేమ కార్యక్రమాలను కూడా మంత్రి ప్రస్తావించారు. ధూపదీప నైవేద్య పథకం కింద అర్హత కలిగిన ఆలయాల బ్యాంకు ఖాతాల్లో ప్రతి నెల రూ.10 వేల చొప్పున జమ చేస్తున్నామని చెప్పారు. ఆలయాల పునర్నిర్మాణం కోసం 'సర్వ శ్రేయోనిధి' కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు వెల్లడించారు.అంతేకాకుండా షిరిడీ సాయి భక్తులు పెద్ద సంఖ్యలో ఉన్నారని, వారి ద్వారా పోగవుతున్న విరాళాలతోనే షిరిడీ సాయి ఆలయాలు ఆశించిన దానికంటే కూడా అదికంగానే విస్తరిస్తున్నాయని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో షిరిడీ సాయి ఆలయాలకు శ్రీవాణి నిధులు తీసుకోవాల్సిన అవసరం ఎంతమాత్రం లేదని ఆయన తెలిపారు

## మారని ఆక్వా కంపెనీలు

భీమవరం, జూన్ 23, ఆంధ్రప్రదేశ్‌లో ఆక్వా సాగు సంక్షోభంలో కూరుకుపోతున్న తరుణంలో, ఆక్వా ఫీడ్ తయారీ కంపెనీలు సాగుదారులకు తీవ్ర అన్యాయం చేస్తున్నాయి. నిలకడలేని మార్కెట్ ధరలు, పెరిగిన పెట్టుబడులతో నష్టాల్లో ఉన్న ఆక్వా రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం తీసుకున్న చొరవకు ఫీడ్ కంపెనీలు మొండిచేయి చూపించాయి. ఫీడ్ ధరలను ఆశించిన స్థాయిలో తగ్గించకుండా కంపెనీలు తమ ఏకపక్ష వైఖరిని ప్రదర్శిస్తుండటంపై రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆక్వా రైతులు తీవ్రంగా మండిపడుతున్నారు.ప్రస్తుత పరిస్థితుల్లో పెట్టుబడి భారాన్ని తగ్గించేందుకు ఆక్వా ఫీడ్ ధరను కిలోకు కనీసం రూ. 4 చొప్పున తగ్గించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఫీడ్ తయారీ కంపెనీలకు స్పష్టమైన సూచనలు చేసింది. అయితే, ప్రభుత్వ ఆదేశాలను బేఖాతరు చేస్తూ కంపెనీలు ఇష్టారాజ్యంగా వ్యవహరించాయి. కేవలం రూ. 2 మాత్రమే తగ్గిస్తున్నట్లు పేర్కొంటూ ఫీడ్ తయారీ అసోసియేషన్లు ఒక లేఖను విడుదల చేశాయి. ప్రభుత్వ ప్రతిపాదనలో సగం మాత్రమే తగ్గించి చేతులు దులుపుకోవాలని చూడటంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

# సూపర్ టేస్టీ 'టమాటా రైస్'.. నిమిషాల్లోనే లంచ్ బాక్స్ కు రెడీ..!



ఎప్పుడూ ఒకేరకమైన కూరలు తిని బోర్ కొట్టిందా..? అయితే ఎలాంటి కర్రీస్ లేకుండా సూపర్ టేస్టీ టమాటా రైస్ ను తయారు చేసుకోండి. టైమ్ లేనప్పుడు ఈజీగా క్షణాల్లో ఈ టమాటా రైస్ రెడీ అవుతుంది. కాస్త పుల్లగా, కాస్త కారంగా ఉండే దీన్ని పిల్లల నుంచి పెద్దల వరకు అందరూ భలే ఇష్టంగా తింటారు. మరి ఈ సూపర్ టేస్టీ టమాటా రైస్ ను ఎలా తయారు చేయాలి..? కావాల్సిన పదార్థాలు ఏంటి..? పూర్తి వివరాలు ఇక్కడ చూద్దాం.. టమాటా రైస్ తయారీకి కావాల్సిన పదార్థాలు చూస్తే బియ్యం ఒక కప్పు, టమాటోలు మూడు మధ్యస్థ సైజులో, ఉల్లిపాయ ఒకటి, నూనె రెండు స్పూన్ లు, అల్లం వెల్లుల్లి పేస్ట్ ఒక స్పూన్, పోపు గింజలు కొద్దిగా, పచ్చిమిర్చి రెండు, కరివేపాకు కొద్దిగా, పసుపు అర టీ స్పూన్, ఉప్పు రుచికి సరిపడా తీసుకోవాలి. ఇప్పుడు తయారీ విధానం చూస్తే ముందుగా టమాటా రైస్ తయారీకి బియ్యం కడిగి నీరు వంచేసి పక్కన పెట్టుకోవాలి. ఆ తర్వాత బాణలిలో నూనె వేసి వేడి చేయాలి. ఇప్పుడు అందులో పోపు గింజలు వేయాలి. అలా పోపు గింజలు వేసిన తర్వాత అందులోనే ఉల్లిపాయలు, పచ్చిమిర్చి, అల్లం పేస్ట్ వేసి వేయించాలి. ఆ తర్వాత అందులో తరిగిన టమాటాలు, ఉప్పు, పసుపు వేసి మెత్తగా ఉడికించుకోవాలి. ఇప్పుడు కడిగిన బియ్యం, రెండు కప్పుల నీళ్లు పోసి మూత పెట్టి ఉడికించుకోవాలి. ఇప్పుడు అన్నం ఉడికిన తర్వాత అందులో కొత్తిమీర చల్లుకుని వడ్డించుకోవడమే.. అంతే సూపర్ టేస్టీ టమాటా రైస్ రెడీ అయినట్టే..

# రోజూ ఈ రసం తాగండి – షుగరు, కిడ్నీ ఆరోగ్యానికి వరం..!!

ఉసిరి రసం ఒక వరం. ఆరోగ్య పరంగా మేలు చేస్తోంది. ఈ రసంలో రసంలో విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఉసిరి రసం ప్రతీ రోజు 50 ఎంఎల్ తీసుకోవటం ద్వారా ఎన్నో దీర్ఘ కాలిక సమస్యలు నియంత్రణలో ఉంటాయి. ఆజీర్తి, గుండె సంబంధిత సమస్యలు, షుగర్ లెవల్స్ తో పాటుగా కిడ్నీ ఆరోగ్యానికి మేలు చేస్తుంది. జుట్టు నల్లగా మార్చటానికి సహకరిస్తుంది. దీంతో పాటుగా ఎన్నో ప్రయోజనాలు తులసి రసం ద్వారా అందుతాయి. ప్రతీ రోజు ఉదయం ఖాళీ కడుపుతో ఉసిరి రసం తాగడం వల్ల జీర్ణ ఆరోగ్యం మెరుగుపడుతుంది. పోషకాల శోషణ సామర్థ్యం మెరుగుపడుతుంది. దీంతో పోషకాల లోపం దరి చేరదు. ఉసిరి రసంలో విటమిన్ సి కంటెంట్ ఎక్కువగా ఉంటుంది. ఇది రోగనిరోధకశక్తిని బలంగా మార్చుతుంది. ఉసిరి రసం తాగితే సీజనల్ ఇన్ఫెక్షన్ల రిస్క్ తగ్గుతుంది. ఖాళీ కడుపుతో ఉసిరి రసం తాగడం వల్ల జీర్ణ స్రావాల ఉత్పత్తి పెరుగుతుంది. దీంతో జీర్ణ సమస్యలు రావు. మలబద్దకం,





అజీర్తి నుంచి ఉపశమనం లభిస్తుంది. ఉసిరిలో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి కణాలను ఆరోగ్యంగా మార్చుతాయి. ఉసిరి తింటే చర్మం ఎలాస్టిసిటీ పెరుగుతుంది. దీంతో ముడతలు తగ్గుతాయి. జుట్టును వేర్ల నుండి సహజంగా నల్లగా మార్చడానికి సహాయపడుతుంది. ఆరోగ్య పరమైన ప్రయోజనాలు దీంతో పాటుగా ఉదయాన్నే ఉసిరి రసం తాగడం వల్ల కిడ్నీ ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఇందులోని యాంటీ ఆక్సిడెంట్లు కిడ్నీ సమస్యలను దూరం చేస్తాయి. ఉదయాన్నే ఉసిరి రసం తాగడం వల్ల కాలేయం డీటాక్సిఫై అవుతుంది. ఉసిరి రసం తాగితే కాలేయ వాపు సమస్యలు తగ్గుతాయి. కాలేయ పనితీరు మెరుగుపడుతుంది. మార్నింగ్ ఉసిరి రసం తాగడం వల్ల బరువు తగ్గొచ్చు. ఉసిరి రసంలో కొంచెం మిరియాల పొడి కలిపి తీసుకుంటే మంచి ఫలితాలు ఉంటాయి. ఉదయాన్నే ఉసిరి రసం తాగడం వల్ల డయాబెటిస్ కంట్రోల్ అవుతుంది. ఉసిరి రసం ఇన్సులిన్ స్థాయిలను స్థిరంగా ఉంచుతుంది. ఉసిరి రసం తాగితే జీవక్రియ రేటు పెరుగుతుంది.

# "రొయ్యల పప్పు" ఎప్పుడైనా ట్రై చేశారా..?



సీఫుడ్ ప్రియులకు రొయ్యలతో చేసే వంటకాలు ఎప్పుడూ ప్రత్యేకమే. అందులో రొయ్యల పప్పు ఒక అద్భుతమైన కాంబినేషన్. రొయ్యల ప్రత్యేక రుచి, కందిపప్పు లేదా పెసరపప్పు మృదుత్వం కలిసి ఈ వంటకాన్ని మరింత రుచికరంగా మారుస్తాయి. ప్రోటీన్లు, విటమిన్లు, ఖనిజ లవణాలతో నిండిన ఈ కూర ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు చేస్తుంది. వేడి వేడి అన్నంలో నెయ్యి వేసుకుని తింటే ఈ రుచి మరింత రెట్టింపు అవుతుంది. రొయ్యల్లో ఉండే ప్రోటీన్, ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్, పప్పులో ఉండే ఫైబర్, ఐరన్, ఫోలేట్ శరీరానికి అవసరమైన పోషకాలను అందిస్తాయి. పిల్లలు, పెద్దలు అందరూ ఇష్టపడే ఈ రొయ్యల పప్పు రుచి, పోషకాలు రెండింటినీ ఒకేసారి అందించే అద్భుతమైన సంప్రదాయ వంటకం. ఇంట్లో అతిథులు వచ్చినప్పుడు లేదా ప్రత్యేకంగా ఏదైనా కొత్త వంటకం చేయాలనుకున్నప్పుడు రొయ్యల పప్పు మంచి ఎంపిక. ఈ రెసిపీ మీకోసం ప్రత్యేకంగా.. మరిన్ని కనుగొనండి కావలసిన పదార్థాలు.. రొయ్యలు - 200 గ్రాములు (శుభ్రం చేసినవి) కందిపప్పు లేదా పెసరపప్పు - 1 కప్పు ఉల్లిపాయ - 1 (సన్నగా తరిగినది) పచ్చిమిర్చి - 3 టమోటాలు - 2 (చిన్న ముక్కలుగా తరిగినవి) అల్లం వెల్లుల్లి పేస్ట్ - 1 టీస్పూన్ కారం - 1 టీస్పూన్ పసుపు - అర టీస్పూన్ ఉప్పు - రుచికి తగినంత గరం మసాలా - అర టీస్పూన్ కొత్తిమీర తరుగు - కొద్దిగా నూనె లేదా నెయ్యి - 2 టేబుల్ స్పూన్లు పోపు కోసం ఆవాలు - అర టీస్పూన్ జీలకర్ర - అర టీస్పూన్ ఎండు మిర్చి - 2 కరివేపాకు - కొద్దిగా వెల్లుల్లి రెబ్బలు - 4 (చితక్కొట్టినవి) తయారీ విధానం.. ముందుగా కందిపప్పు లేదా పెసరపప్పును బాగా కడిగి 15-20 నిమిషాలు నానబెట్టాలి. అనంతరం కుక్కర్‌లో పప్పు, కొద్దిగా పసుపు, తగినన్ని నీళ్లు వేసి 3-4 విజిల్స్ వచ్చే వరకు మెత్తగా ఉడికించాలి. శుభ్రం చేసిన రొయ్యల్లో చిటికెడు పసుపు, కొద్దిగా ఉప్పు, కారం వేసి 10 నిమిషాలు పక్కన పెట్టాలి. ఇలా చేయడం వల్ల రొయ్యలకు మంచి రుచి వస్తుంది. పాన్‌లో కొద్దిగా నూనె వేసి వేడెక్కాక రొయ్యలను వేసి 2-3 నిమిషాలు మాత్రమే వేయించాలి. ఎక్కువసేపు వేయిస్తే రొయ్యలు గట్టిగా మారిపోతాయి. రంగు మారగానే వాటిని తీసి పక్కన పెట్టుకోవాలి. అదే పాన్‌లో నూనె వేసి ఉల్లిపాయలు, పచ్చిమిర్చి, అల్లం వెల్లుల్లి పేస్ట్ వేసి దోరగా వేయించాలి. తర్వాత టమోటా ముక్కలు వేసి మెత్తబడే వరకు ఉడికించాలి. ఇప్పుడు ఉడికించిన పప్పు, వేయించిన రొయ్యలు, కారం, ఉప్పు వేసి బాగా కలపాలి. అవసరమైతే కొద్దిగా నీళ్లు పోసి 5-7 నిమిషాలు మరిగించాలి. దీంతో రొయ్యల రుచి పప్పులో బాగా కలిసిపోతుంది. చిన్న పాన్‌లో నెయ్యి లేదా నూనె వేడి చేసి ఆవాలు, జీలకర్ర, ఎండు మిర్చి, కరివేపాకు, వెల్లుల్లి వేయించి ఈ తాలింపును పప్పులో కలపాలి. చివరగా గరం మసాలా, కొత్తిమీర చల్లి స్టవ్ ఆఫ్ చేయాలి. చిట్కాలు.. కందిపప్పుతో చేస్తే గట్టిగా, పెసరపప్పుతో చేస్తే తేలికగా, మృదువుగా ఉంటుంది. కొద్దిగా చింతపండు రసం కలిపితే పులుపు రుచి వస్తుంది. పచ్చి మిరియాల పొడి చిటికెడు వేస్తే ప్రత్యేకమైన ఫ్లేవర్ వస్తుంది. వేడి అన్నంలో నెయ్యి వేసుకుని రొయ్యల పప్పుతో తింటే అద్భుతంగా ఉంటుంది. చపాతీ, రాగి సంగటి, జొన్న రొట్టెలతో కూడా ఈ కూర చాలా రుచిగా ఉంటుంది.

# నోట్లో కరిగిపోయేలా ఫంక్షన్ స్టైల్ రవ్వ కేసరి.. ఇలా చేస్తే రోజూ కావాలంటారు!



రవ్వ కేసరి అనేది చాలా త్వరగా, సులభంగా తయారుచేసుకోగలిగే రుచికరమైన స్వీట్. చాలా పండుగలు, శుభ కార్యాలలో దీనిని ప్రత్యేకంగా పెడతారు. మనం ఉప్మా చేసుకునే బొంబాయి రవ్వతో అద్భుతంగా చేసుకునే రవ్వ కేసరిని ఒకసారి ఎలా తయారు చెయ్యాలో తెలుసుకుందాం. రవ్వ కేసరి తయారీ విధానం ఇక్కడ ఉంది.

కావలసిన పదార్థాలు:

బొంబాయి రవ్వ (ఉప్మా రవ్వ): 1 కప్పు

పంచదార: 1 కప్పు నుండి ఒకటిన్నర కప్పు

నెయ్యి: 1/2 కప్పు

నీళ్లు: 3 కప్పులు

జీడిపప్పు, కిస్‌మిస్: తగినన్ని

యాలకుల పొడి: 1/2చెంచాఫుడ్ కలర్ (ఆరెంజ్ లేదా ఎల్లో): ఒక చిటికెడు

**తయారీ విధానం:**

ముందుగా స్టవ్ మీద ఒక పాన్ పెట్టి, అందులో 2 చెంచాల నెయ్యి వేసి వేడి చేయండి. నెయ్యి కరిగాక జీడిపప్పు, కిస్‌మిస్ వేసి దోరగా వేయించి ఒక గిన్నెలోకి తీసుకుని పక్కన పెట్టుకోండి. ఆపై అదే పాన్‌లో మరికొంత నెయ్యి వేసి బొంబాయి రవ్వను వేయండి. రవ్వను తక్కువ మంట మీద మంచి సువాసన వచ్చే వరకు, రంగు మారకుండా 4-5 నిమిషాలు బాగా వేయించి పక్కన పెట్టుకోండి.

**రవ్వ కేసరికి పంచదార వేసేటప్పుడు జాగ్రత్త**

ఇప్పుడు మరొక గిన్నెలో 3 కప్పుల నీళ్లు పోసి బాగా మరిగించండి. కావాలనుకుంటే ఈ నీళ్లలోనే చిటికెడు ఫుడ్ కలర్ కలపవచ్చు. నీళ్లు బాగా మరిగిన తర్వాత, మంటను పూర్తిగా తగ్గించి, వేయించి పెట్టుకున్న రవ్వను ఉండలు కట్టకుండా ఒక చేత్తో కలుపుతూ కొద్దికొద్దిగా నీళ్లలో వేయండి. రవ్వ నీటిని పీల్చుకుని దగ్గరపడే వరకు మూత పెట్టి 2 నిమిషాలు ఉడికించండి. రవ్వ మెత్తగా ఉడికిన తర్వాతే పంచదార వేయాలి. ముందే వేస్తే రవ్వ ఉడకదు.

**పంచదార రవ్వకు బాగా పట్టేలా ఇలా చెయ్యాలి**

పంచదార వేసాక అదంతా కరిగి కేసరి మళ్లీ పల్చగా అవుతుంది. మంటను మీడియంలో ఉంచి, పంచదార రవ్వకు బాగా పట్టేలా కలుపుతూ ఉండాలి. నెయ్యి, కేసరి కాస్త చిక్కబడుతున్నప్పుడు మిగిలిన నెయ్యిని కొద్దికొద్దిగా వేస్తూ కలపండి. నెయ్యి అంతా కలిసిపోయి, మిశ్రమం పాన్‌కు అంటుకోకుండా విడిపోతున్నప్పుడు యాలకుల పొడి, ముందుగా వేయించి పెట్టుకున్న జీడిపప్పు, కిస్‌మిస్ వేసి బాగా కలపండి.

మునక్కాయ స్వీట్ కార్న్ కర్రీ.. పాలతో కలిపి వండితే నాలుకకు అమృతమే!

మునక్కాయ స్వీట్ కార్న్ కర్రీ.. పాలతో కలిపి వండితే నాలుకకు అమృతమే!

1 కప్పు రవ్వకు ఖచ్చితంగా 3 కప్పుల నీళ్లు

చివరగా స్టవ్ ఆఫ్ చేసి సర్వింగ్ బౌల్‌లోకి తీసుకుంటే ఎంతో రుచికరమైన, నోట్లో వేసుకుంటే చాలు కరిగిపోయే రవ్వ కేసరి సిద్ధం అవుతుంది. కేసరి చల్లారిన తర్వాత గట్టిపడకుండా, దూదిలా మెత్తగా ఉండాలంటే 1 కప్పు రవ్వకు ఖచ్చితంగా 3 కప్పుల నీళ్లు ఉపయోగించాలి.

# ఘుమఘుమలాడే 'వెజ్ దమ్ బిర్యానీ'.. ఇలా చేస్తే టేస్ట్ అద్దిరిపోతుంది..!

వీకెండ్ వచ్చిందంటే చాలు చాలామంది బయట రెస్టారెంట్స్ లో తినేందుకు ఇష్టపడుతుంటారు. ఇక బయటకు వెళ్లినప్పుడు అందరికీ మొదటి ఆప్షన్ బిర్యానీనే.. అయితే బయట బిర్యానీ కంటే ఎంచక్కా ఇంట్లోనే సూపర్ టేస్టీ బిర్యానీ తయారు చేసుకోవచ్చు. నాన్ వెజ్ లోనే కాదు వెజ్ బిర్యానీ కూడా చాలా అద్భుతంగా ఉంటుంది. మరి ఘుమఘుమలాడే 'వెజ్ దమ్ బిర్యానీ' ను ఎలా తయారు చేసుకోవాలి..? కావాల్సిన పదార్థాలు ఏంటి..? 'వెజ్ దమ్ బిర్యానీ' తయారీకి కావాల్సిన పదార్థాలు చూస్తే.. బియ్యం 250 గ్రాములు, ఉల్లిపాయలు 2 మధ్యస్థ పరిమాణంలో, పచ్చిమిరపకాయలు మూడు లేదా నాలుగు, క్యారెట్, బంగాళాదుంప, బీన్స్ ఇష్టానుసారం, బిర్యానీ ఆకులు, దాల్చిన చెక్క, ఇలాచీ, లవంగాలు, షాజీరా, అల్లం వెల్లుల్లి పేస్ట్ అర టీ స్పూన్, ధనియాల పొడి అర టేబుల్ స్పూన్, కారం పొడి ఒకటిన్నర టీ స్పూన్, కరివేపాకు, పూదీనా, కొత్తమీర, పెరుగు అర కప్పు, నెయ్యి రెండు స్పూన్ లు, నీళ్లు తగినన్ని తీసుకోవాలి. ఇప్పుడు తయారీ విధానం చూస్తే.. ముందుగా బియ్యాన్ని శుభ్రంగా కడిగి నానబెట్టుకోవాలి. ఆ తర్వాత ఒక గిన్నెలో నూనె వేడి చేయాలి. ఆ తర్వాత అందులో కరివేపాకు, పుదీనా, పచ్చి మిరపకాయలు, అల్లం వెల్లుల్లి పేస్ట్, ఆ తర్వాత క్యారెట్, బంగాళాదుంప, బీన్స్ ముక్కలు, ఉప్పు వేసి వేయించుకోవాలి. ఇప్పుడు ఒక గిన్నెలో పెరుగు తీసుకుని, కారం పొడి, ధనియాల పొడి వేసి కలపాలి. దీనిని ఉడుకుతున్న కూరగాయలకు వేసి, అలాగే తరిగిన కొత్తిమీర కూడా వేయాలి. ఒక గిన్నెలో నీరు తీసుకుని, హోల్ బిర్యానీ మసాలా వేసి, మరిగిన తర్వాత బియ్యం వేయాలి. అలా 60 నుంచి 70 శాతం ఉడికించాలి. మరిన్ని కనుగొనండి ఇప్పుడు ఉడికించిన బియ్యాన్ని ఉడికిన కూరపై వేయాలి. ఆ తర్వాత ఆ మిశ్రమంపై వేయించిన ఉల్లిపాయలు, నెయ్యి వేయాలి. ఇప్పుడు గిన్నెపై మూత పెట్టి చుట్టూ గోధుమపిండితో సీల్ చేసి ఓ 10 నుంచి 15 నిమిషాల పాటు ఉడికించుకోవాలి. అంతే సూపర్ టేస్టీ వెజ్ దమ్ బిర్యానీ రెడీ అయినట్టే..



# చిటికెడు వాము - చెడు కొలెస్ట్రాల్ కు దివ్యౌషధం..!!



వంటింట్లో లభించే వాము ఎన్నో సమస్యలకు దివ్యౌషధం. వామును తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి. వాములో ఎన్నో ఔషధ గుణాలు ఉంటాయని ఆయుర్వేద వైద్య నిపుణులు చెబుతున్నారు. ఈ క్రమంలోనే పలు రకాల అనారోగ్య సమస్యలకు, వ్యాధులకు వాము చక్కని ఔషధంగా పని చేస్తుందని వారు అంటున్నారు. వాము రుచి ఘాటుగా ఉంటుంది. చెడు కొలెస్ట్రాల్.. అజీర్ణ సమస్యలు.. బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్లతో సహా ఎన్నింటికో వాము దివ్యౌషధంగా పరిగణిస్తారు. ఆయుర్వేద పరంగా చూస్తే వాము మనకు ఎన్నో ప్రయోజనాలను అందిస్తుంది. వామును తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి. వాములో ఎన్నో ఔషధ గుణాలు ఉంటాయని ఆయుర్వేద వైద్య నిపుణులు చెబుతున్నారు. వామును నమలడం వల్ల నోట్లోని బ్యాక్టీరియా నశిస్తుంది. దీంతో చిగుళ్ల వాపులు తగ్గుతాయి. దంతాల నొప్పి నుంచి ఉపశమనం లభిస్తుంది. నోటి దుర్వాసన తగ్గుతుంది. నోట్లో ఉండే ఇన్‌ఫెక్షన్లు తగ్గుతాయి. నోరు, దంతాలు, చిగుళ్లు ఆరోగ్యంగా ఉంటాయి. వాములో థైమోన్ అనే సమ్మేళనం ఉంటుంది. వామును తింటే బ్యాక్టీరియా, ఫంగస్ ఇన్‌ఫెక్షన్లు తగ్గుతాయి. రోగ నిరోధక వ్యవస్థ పటిష్టంగా మారుతుంది. వాము శరీరంలో ఉండే చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి, మంచి కొలెస్ట్రాల్‌ను పెంచడంలో సహాయపడు తుంది. ఇది గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుందని, ఇది హృదయ స్పందన రేటు, రక్తపోటులో విశేషమైన పాత్ర పోషిస్తుంది. ంశ్రీబనీ ఖీవజీట తెలుగు రాష్ట్రాలకు తొలి వందేభారత్ స్లీపర్ ఖరారు- రూట్, ముహూర్తం..!! మరిన్ని కనుగొనండి ాజూనీతీబిబ నిపుణుల సూచనలు కాగా, వాములో యాంటీ స్పాస్మోడిక్ గుణాలు ఉంటాయి. అందువల్ల కడుపు నొప్పికి వాము దివ్యౌషధంగా పనిచేస్తుంది. ఇది అన్ని రకాల కడుపు నొప్పులను తగ్గిస్తుంది. స్త్రీలకు రుతు సమయంలో వచ్చే కడుపు నొప్పి సైతం తగ్గిపోతుంది. అలాగే అజీర్ణం వల్ల వచ్చే నొప్పిని సైతం వాము తగ్గిస్తుంది. కనుక వామును తింటే ఆయా సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. అలాగే వాములో ఉండే థైమోల్ అనే సమ్మేళనం ముక్కు రంధ్రాలను క్లియర్ చేస్తుంది. దీని వల్ల ముక్కు దిబ్బడ నుంచి ఉపశమనం లభిస్తుంది. ఆస్తమా, బ్రాంకైటిస్, జలుబు ఉన్నవారికి ఎంతగానో మేలు చేస్తుంది. వామును పొడి చేసి ఒక వస్త్రంలో చుట్టి వాసన పీలుస్తుంటే ఆయా సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. గుండెల్లో మంట, అసిడిటీ నుంచి ఉపశమనం లభిస్తుంది. జీర్ణవ్యవస్థలో ఉండే అసౌకర్యం తొలగిపోతుంది. గ్యాస్ నుంచి ఉపశమనం లభిస్తుంది. పొట్టలో గ్యాస్ ఏర్పడకుండా చూసుకోవచ్చు. అజీర్ణం తగ్గిపోతుంది. తిన్న ఆహారం సరిగ్గా జీర్ణమవుతుంది. జీర్ణ వ్యవస్థ మెరుగ్గా పనిచేస్తుంది.

# స్పోర్ట్స్ న్యూస్

## భారత జట్టులోకి పంజాబ్ కింగ్స్ ఆల్‌రౌండర్

పంజాబ్ కింగ్స్ ఆల్‌రౌండర్ సూర్యాంశ్ షెడ్జె తొలిసారి భారత క్రికెట్ జట్టుకు ఎంపికయ్యాడు. మరికొద్ది రోజుల్లో ఐర్లాండ్, ఇంగ్లండ్‌లతో జరిగే టీ20 సిరీస్‌ల కోసం ప్రకటించిన భారత జట్టులో సూర్యాంశ్ చేరాడు. హైదరాబాదీ ప్లేయర్ నితీశ్ కుమార్ రెడ్డి స్థానంలో అతడిని బీసీసీఐ ఎంపిక చేసింది. జూన్ 20న అఫ్ఘానిస్థాన్ తో జరిగిన మూడో వన్డే తర్వాత నితీశ్ రెడ్డి ఎడమ తొడ కండరాలలో నొప్పితో బాధపడ్డాడు. వైద్య పరీక్షల అనంతరం కొంతకాలం పునరావాసం పొందాలని బీసీసీఐ వైద్య బృందం సిఫార్సు చేసింది. దీంతో అతడు ఈ రెండు టీ20 సిరీస్‌లకు దూరమయ్యాడు.ఇటీవల శ్రీలంకలో



ముగిసిన ముక్కోణపు సిరీస్‌లో భారత-ఎ జట్టు తరఫున మంచి ప్రదర్శన చేసిన నేపథ్యంలో సూర్యాంశ్‌కు బీసీసీఐ నుంచి ఈ పిలుపు అందింది. మిడిలార్డర్‌లో బ్యాటింగ్ చేసిన ఈ యువ ఆటగాడు.. ముక్కోణపు సిరీస్‌లో ఐదు మ్యాచ్‌లలో 147 పరుగులు సాధించడంతో పాటు, 23 ఓవర్లు బౌలింగ్ చేసి బంతితో కూడా రాణించాడు.అలానే సయ్యద్ ముస్తాక్ అలీ 2024-25లో ముంబై తరఫున లోయర్ మిడిల్ ఆర్డర్‌లో 251.92 స్ట్రైక్ రేట్‌తో 131 పరుగులు చేశాడు. అంతేకాక ఆ జట్టు తరఫున అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన ఆటగాళ్లలో ఒకడిగా నిలిచాడు. అలానే ఐపీఎల్ 2026లో పంజాబ్ కింగ్స్ తరఫున సూర్యాంశ్ ఆడాడు. ఈ సీజన్‌లో ఆడిన 8 మ్యాచ్‌ల్లో 158 పరుగులతో స్ట్రైక్ రేట్ 175.56 గా నమోదైంది. లోయర్ ఆర్డర్‌లో వేగంగా పరుగులు రాబట్టే ఫినిషర్‌గా పంజాబ్ జట్టు ఇతనికి అవకాశాలు కల్పించింది'ఐర్లాండ్, ఇంగ్లండ్‌లతో జరగబోయే టీ20 సిరీస్‌ల కోసం భారత జట్టులో నితీశ్ కుమార్ రెడ్డి స్థానంలో సూర్యాంశ్ షెడ్జెను సెలక్షన్ కమిటీ ఎంపిక చేసింది' అని బీసీసీఐ ఒక ప్రకటనలో తెలిపింది. అలానే ఐర్లాండ్, ఇంగ్లండ్‌తో జరిగే వన్డేల్లో కూడా హార్దిక్ పాండ్య స్థానంలో కూడా నితీశ్ కుమార్ రెడ్డి భర్తీ చేయాల్సి ఉంది. కానీ వన్డే మ్యాచులకు కూడా అందుకునే అవకాశం లేదని క్రీడా వర్గాల నుంచి సమాచారం. బీసీసీఐ రిహాబిలిటేషన్ సెంటర్ లో అతడ తన పునరావాసాన్ని పూర్తి చేయడానికి కనీసం నాలుగు వారాల సమయం పడుతుందని.. ఆ గడువు పొడిగించవచ్చే అవకాశం కూ?డ ఉందని సమాచారం.

## వైభవ్ చేతికి టీమిండియా జెర్సీ.. ఈ అనుభూతిని వర్ణించలేనంటూ..

భారత యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ జీవితంలో ఓ మధుర క్షణం చోటు చేసుకుంది. తన అద్భుత ప్రదర్శనలతో ప్రపంచం దృష్టిని ఆకర్షించిన వైభవ్.. 15 ఏళ్ల వయసులోనే జాతీయ జట్టుకు ఎంపికైన సంగతి తెలిసిందే. ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటనల కోసం ప్రకటించిన భారత జట్టులో అతడు స్థానం సంపాదించుకున్నాడు. తాజాగా వైభవ్ టీమిండియా జెర్సీని అందుకున్నాడు. ఈ మేరకు బీసీసీఐ ఎక్స్ వేదికగా వీడియో విడుదల చేసింది. 'యావత్ దేశం ఎదురుచూస్తున్న క్షణం వచ్చేసింది. వైభవ్ సూర్యవంశీ భారత జెర్సీని అందుకున్నాడు' అని బీసీసీఐ ఆ పోస్ట్‌కు క్యాప్షన్ ఇచ్చింది.భారత జట్టు త్రోడౌన్ స్పెషలిస్ట్ రఘు చేతుల మీదుగా వైభవ్ జెర్సీని అందుకున్నాడు. ఈ జెర్సీ ఇచ్చేందుకు రఘు గది వద్దకు రాగానే.. వైభవ్ అతడి కాళ్లకు నమస్కరించాడు. జెర్సీని చూసిన వెంటనే అతడి ముఖంలో ఆనందం వెల్లివిరిసింది. ఈ సందర్భంగా వైభవ్ మాట్లాడుతూ భావోద్వేగానికి గురయ్యాడు. 'నేను మొదటిసారి బ్యాట్ పట్టిన రోజు నుంచి భారత జట్టు తరఫున ఆడాలని కల కనేవాడిని. ఆ కల ఇప్పుడు నిజమైంది. ఈ అనుభూతిని మాటల్లో వర్ణించలేను. జెర్సీని చూసిన క్షణం నుంచి నా




ఆనందానికి అవధులు లేవు. ఇదంతా ఓ కలలా అనిపిస్తోంది. ఎప్పుడూ ఊహించని విషయం ఒక్కసారిగా నిజమైతే ఎలా స్పందించాలో తెలియదు. ప్రస్తుతం నేను అదే పరిస్థితుల్లో ఉన్నా' అని వైభవ్ వెల్లడించాడు.వైభవ్‌కు భారత జట్టులో జెర్సీ నంబర్-03 కేటాయించారు. గతంలో స్టార్ ప్లేయర్లు హర్భజన్ సింగ్, సురేశ్ రైనా ఈ జెర్సీ నంబర్‌తోనే ఆడటం విశేషం. ఐపీఎల్, అండర్ 19 ప్రపంచ కప్, ట్రై సిరీస్.. ఇలా ఆడిన ప్రతి సిరీస్‌లో సంచలన ప్రదర్శనతో ఆకట్టుకున్న వైభవ్.. ఇప్పుడు భారత జట్టులో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించనున్నాడు. అయితే జట్టులో చోటు దక్కినప్పటికీ.. తుది జట్టులో స్థానం సంపాదించడం వైభవ్‌కు సవాలుతో కూడుకున్న విషయమే. ఓపెనింగ్ స్థానం కోసం అభిషేక్ శర్మ, సంజు శాంసన్, ఇషాన్ కిషన్ వంటి సీనియర్లతో వైభవ్ పోటీ పడాల్సి ఉంటుంది.

## నితీశ్ కుమార్ రెడ్డికి గాయం.. ఐర్లాండ్ సిరీస్‌కు దూరం

భారత క్రికెట్ జట్టు జూన్ 26 నుంచి రెండు టీ20ల సిరీస్ కోసం ఐర్లాండ్‌లో పర్యటించనుంది. భారత యువ ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి గాయం కారణంగా ఈ సిరీస్‌కు దూరమయ్యాడు. ఇటీవల అఫ్ఘానిస్థాన్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో నితీశ్ తొడ కండరాలకు గాయమైంది. దీనివల్ల ఇంగ్లండ్‌తో జరిగే వన్డే సిరీస్‌లో కూడా నితీశ్ ఆడకపోవచ్చనే వార్తలు వస్తున్నాయి. ప్రస్తుతం నితీశ్ రెడ్డి బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌కు వెళ్లనున్నాడు. అక్కడ వైద్య పరీక్షల



అనంతరం గాయం తీవ్రత, కోలుకునేందుకు పట్టే సమయంపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. కాగా అతడి స్థానంలో ఎవరిని ఎంపిక చేస్తారనే విషయంపై స్పష్టత లేదు.23 ఏళ్ల నితీశ్ రెడ్డిని భారత జట్టు ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటనల కోసం వన్డే, టీ20 జట్లలో ఎంపిక చేసింది. హార్దిక్ పాండ్య గాయం కారణంగా జట్టుకు దూరంగా ఉండటంతో ప్రధాన సీమ్ బౌలింగ్ ఆల్‌రౌండర్‌గా అతడిపై సెలక్టర్లు ఆశలు పెట్టుకున్నారు. అయితే గాయం కారణంగా నితీశ్ కూడా జట్టుకు దూరమవ్వడం భారత్‌కు ఎదురుదెబ్బగా మారింది. గతేడాది నుంచి వరుస గాయాలు నితీశ్ కెరీర్ పురోగతిని దెబ్బతీస్తున్నాయి. ఐపీఎల్ 2025లో ఫిట్‌నెస్ సమస్యల కారణంగా అతడు 13 మ్యాచ్‌ల్లో కేవలం ఐదు ఓవర్లు మాత్రమే బౌలింగ్ చేశాడు. అనంతరం ఇంగ్లండ్ టెస్టు పర్యటన మధ్యలోనే మోకాలి గాయంతో జట్టును వీడాల్సి వచ్చింది. అయితే ఐపీఎల్-2026లో తన ఫిట్‌నెస్ మెరుగుపర్చేందుకు నితీశ్ తీవ్రంగా శ్రమించాడు. సన్‌రైజర్స్ హైదరాబాద్ తరఫున వికెట్లు తీసి జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించాడు. మంచి ఫామ్‌లో ఉన్న నితీశ్ ఇలాంటి సమయంలో గాయపడటం అతడికి పెద్ద ఎదురుదెబ్బగా మారింది.

## భారీ షాట్ల వల్ల వైభవ్ కెరీర్ ప్రమాదంలో పడుతుంది: సౌతాఫ్రికా క్రికెటర్

భారత యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ మరోసారి తన విధ్వంసకర బ్యాటింగ్‌తో క్రికెట్ ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచాడు. ముక్కోణపు వన్డే సిరీస్‌లో భాగంగా శ్రీలంక-ఎపై 11 బంతుల్లో హాఫ్ సెంచరీ.. 29 బంతుల్లో 94 పరుగులు చేసి ఔరా అనిపించాడు. లిస్ట్-ఎ క్రికెట్‌లో ఫాస్టెస్ట్ ఫిఫ్టీ రికార్డు సాధించాడు. ఆ మ్యాచ్‌లో భారత్-ఎ 66 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించి ట్రోఫీ ముద్దాడింది. వైభవ్ సూర్యవంశీ అద్భుత ప్రదర్శనలపై ప్రశంసలు వెల్లువెత్తుతున్న వేళ.. సౌతాఫ్రికా మాజీ క్రికెటర్ డారిల్ కలినన్ మాత్రం వైభవ్ భవిష్యత్తుపై ఆందోళన వ్యక్తం చేశాడు.'ఈ కుర్రాడి ఆటను చూస్తే ఆశ్చర్యం వేస్తోంది. కానీ అతడి గాయాల నుంచి ఎవరూ మాట్లాడటం లేదు. 15 ఏళ్ల వయసులోనే భారీ బ్యాట్‌తో బలంగా షాట్లు ఆడుతున్నాడు. దీనివల్ల చేతి మణికట్టు, మోచేతులు, కీళ్లు తీవ్ర ఒత్తిడికి గురవుతాయి. వైద్య నిపుణులు దీనిపై ఏమంటారో తెలుసుకోవాలి. సచిన్ టెండూల్కర్ కెరీర్ కూడా ఒకానొక దశలో మోచేతి గాయం కారణంగా ప్రమాదంలో పడింది. వైభవ్ తరహాలో సచిన్ అంత బలంగా షాట్లు ఆడలేదు. కానీ అతడికే తప్పలేదు. వైభవ్ సూర్యవంశీ ఆరోగ్యంపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. వరుస మ్యాచ్‌ల్లో భారీ షాట్లు బాదడం వల్ల భవిష్యత్తు ప్రమాదంలో పడే అవకాశం ఉంటుంది. వైభవ్ ఇంకా ఎదుగుదల దశలో ఉన్నాడు. ఇలాంటి సమయంలో అధిక స్థాయిలో క్రికెట్ వల్ల కీళ్లు, లిగమెంట్లు, కండరాలపై ప్రభావం పడుతుంది. మేము తక్కువ బరువు ఉన్న బ్యాట్లు ఉపయోగించేవాళ్లం. ఇప్పటి తరహాలో ఇన్ని మ్యాచ్‌లు కూడా ఆడేవాళ్లం కాదు. గాయపడితే కోలుకోవడానికి సమయం ఉండేది. వైభవ్‌కు గొప్ప భవిష్యత్తు ఉంది. కానీ అతడి కెరీర్, ఆరోగ్యం విషయంలో నాకు ఆందోళన కలుగుతోంది' అని డారిల్ కలినన్ వెల్లడించాడు.కాగా, ఐపీఎల్ 2026లో 776 పరుగులతో అత్యధిక పరుగుల వీరుడిగా నిలిచిన వైభవ్.. ట్రై సిరీస్‌లోనూ అదే జోరు కొనసాగించాడు. 15 ఏళ్లకే జాతీయ జట్టుకు ఎంపికయ్యాడు. త్వరలోనే ఐర్లాండ్‌తో రెండు టీ20లు, అనంతరం ఇంగ్లండ్ పర్యటనలో టీ20 సిరీస్‌లో వైభవ్ సూర్యవంశీ పాల్గొననున్నాడు.

## క్రిస్ గేల్‌కు క్షమాపణలు చెప్పిన కీరన్ పొలార్డ్.. ఎందుకంటే..



వెస్టిండీస్ దిగ్గజ క్రికెటర్, యూనివర్స్ బాస్ క్రిస్ గేల్‌కు అదే జట్టు మాజీ ఆల్‌రౌండర్ కీరన్ పొలార్డ్ క్షమాపణలు చెప్పాడు. 12 ఏళ్లుగా గేల్ పేరిట ఉన్న ఓ అరుదైన రికార్డ్‌ను కీరన్ పొలార్డ్ తాజాగా బద్దలు కొట్టాడు. టీ20 క్రికెట్‌లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా నిలిచాడు. ఈ ప్రపంచ రికార్డ్‌తో క్రిస్ గేల్‌కు పొలార్డ్ క్షమాపణలు తెలియజేశాడు.మేజర్ లీగ్ క్రికెట్ 2026లో వాషింగ్టన్ ఫ్రీడమ్, ఎంఐ న్యూయార్క్ మధ్య మ్యాచ్ జరిగింది. న్యూయార్క్ తరఫున ఆడిన పొలార్డ్ 56 బంతుల్లోనే సెంచరీతో మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. వాషింగ్టన్ బౌలర్లను ఊచకోత కోశాడు . ఇక ఈ మ్యాచ్‌లో 81 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద.. గేల్ ఆల్‌టైమ్ రికార్డ్‌ను అధిగమించాడు. 39 ఏళ్ల పొలార్డ్ ఇప్పటి వరకు 736 టీ20 మ్యాచ్‌లు ఆడి..14,582 పరుగులు చేశాడు. 14,562 పరగులతో గేల్ రెండో స్థానంలో కొనసాగుతున్నాడు.ఈ మ్యాచ్ అనంతరం పొలార్డ్ ఆసక్తిర వ్యాఖ్యలు చేశాడు. తాము స్ఫూర్తిగా తీసుకునే క్రిస్ గేల్ రికార్డ్‌ను బద్దలు కొట్టడం చాలా ప్రత్యేకమైనదని, యూనివర్స్ బాస్.. క్షమించండని పొలార్డ్ తెలిపాడు. తామిద్దరం ఇప్పుడు అగ్రస్థానంలో ఉన్నామని, ఆరు లేదా ఏడో స్థానంలో బ్యాటింగ్ చేయడం చాలా కష్టమని వెల్లడించాడు. చాలా మంది టాప్ ఆర్డర్‌లో బ్యాటింగ్ చేయాలనుకుంటారని, కానీ ఎవరో ఒకరు లోయర్ ఆర్డర్‌లో వచ్చి మ్యాచ్‌ను ముగించే కష్టమైన పనిని చేయాల్సి ఉంటుందని పేర్కొన్నాడు.తాను ఆ బాధ్యతనను సవాల్‌గా స్వీకరించానని, టెక్నాలజీలానే క్రికెట్ కూడా మారుతోందని కీరన్ పొలార్డ్ తెలిపాడు. ప్రస్తుతం క్రికెట్ కేవలం ఒక ఆట మాత్రమే కాదని, అదొక వ్యాపారమని అన్నాడు. ఒకప్పుడు తమని విమర్శించిన వారందరూ ఇప్పుడు మౌనంగా మా విజయాలను ఆస్వాదిస్తారని ఆశిస్తున్నారని కీరన్ పోలార్డ్ చెప్పుకొచ్చాడు. పొలార్డ్, గేల్, బ్రావో వంటి ఆటగాళ్లు అంతర్జాతీయ మ్యాచ్‌ల కంటే ఫ్రాంచైజీ లీగ్స్‌కు ప్రాధాన్యత ఇస్తున్నారని పలువురు మాజీ క్రికెటర్లు వారిపై అప్పట్లో విమర్శించారు.

## ప్లేయర్ల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకోండి.. బీసీసీఐకు గావస్కర్ సూచన



భారత మాజీ క్రికెటర్ సునీల్ గావస్కర్ బీసీసీఐకి పలు కీలక సూచనలు చేశాడు. ఇటీవల అఫ్గానిస్థాన్‌తో జరిగిన టెస్టు, వన్డే సిరీస్‌ల్లో భారత్ ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో గావస్కర్ పలు అంశాలను ప్రస్తావించాడు. వరుస సిరీస్‌లతో బిజీగా మారిన భారత ప్లేయర్లకు ప్రతి ఏడాది ఒక నెలపాటు విశ్రాంతి ఇవ్వాలని సూచించాడు. ప్రతి సిరీస్‌కు భారత జట్టులో మార్పులు చేయడం సరైంది కాదని అభిప్రాయపడ్డాడు.'అఫ్గానిస్థాన్, జింబాబ్వే, శ్రీలంక వంటి దేశాలకు భారత్ పెద్దన్న పాత్ర పోషిస్తూ వస్తోంది. వారి క్రికెట్ అభివృద్ధికి, ఆర్థికంగా బలోపేతం కావడానికి సిరీస్‌లు ఆడుతోంది. ఇది మంచి విషయమే. అయితే మన ప్లేయర్ల ఆరోగ్యం కూడా అంతే ముఖ్యం. వారికి ఏడాదిలో కనీసం ఒక నెలపాటు తప్పనిసరిగా విశ్రాంతి ఇవ్వాలి. భారత్‌కు ప్రతిభావంతులైన ఆటగాళ్ల కొరత లేదు. జట్టులో మార్పులు చేయడం అవసరమే.. కానీ కేవలం విశ్రాంతి తీసుకుంటున్న స్టార్ ప్లేయర్ల స్థానంలో కొత్త ఆటగాళ్లకు క్యాప్ అందించడం సరైంది కాదు. భారత జట్టులో చోటు సంపాదించుకోవాలి. అంతేగానీ జట్టులో ఖాళీ ఉంది కాబట్టి అవకాశం ఇవ్వకూడదు. అఫ్గాన్‌తో టెస్టులో మానవ్ సుతార్ అరంగేట్రం చేశాడు. అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. కానీ బుమ్రాకు ఎందుకు విశ్రాంతి ఇవ్వాల్సి వచ్చింది? ఒకవేళ అతడిని జట్టులోకి తీసుకుని ఉంటే ఐదు లేదా పది వికెట్లు పడగొట్టేవాడు. గాయాలు లేనంత వరకు అత్యుత్తమ జట్టే బరిలోకి దిగాలి' అని గావస్కర్ వెల్లడించాడు.'ఏడాది పొడవునా ఎక్కడో ఒక చోట భారత్ క్రికెట్ ఆడుతూనే ఉంది. వర్క్‌లోడ్ పేరుతో తరుచూ విశ్రాంతులు ఇవ్వడం తగ్గించాలి. వారి ప్లేస్‌లో కొత్త వాళ్లని తీసుకునే ప్రయోగాలు ఆపాలి. అఫ్గాన్‌తో లఖ్‌నవూ, చెన్నైలో జరిగిన చివరి రెండు వన్డేలకు స్టేడియాలు పూర్తిగా నిండలేదు. వరుసగా క్రికెట్ చూసి అభిమానులు కూడా అలసిపోయారు. యువ ప్లేయర్ల కోసం 'ఎ' జట్లు, అండర్-19 టోర్నీలు నిర్వహించండి. వారికి అవకాశాలు ఇవ్వండి. కానీ సీనియర్ ప్లేయర్లకు మాత్రం విరామం కల్పించడం అత్యవసరం. వచ్చే ఏడాది ఐపీఎల్‌ను ముందుగానే ముగించే ఆలోచన ఉంటే.. ఆ షెడ్యూల్‌లో ఒక నెల విశ్రాంతిని కూడా బీసీసీఐ అందులో చేర్చాలి' అని గావస్కర్ సూచించాడు.

## ఐపీఎల్‌లో భారీ ట్రేడ్.. ఢిల్లీకి పంత్, లఖ్‌నవూకు కుల్‌దీప్ యాదవ్

ఐపీఎల్‌లో ఓ భారీ ట్రేడ్ డీల్ జరిగింది. టీమిండియా స్టార్ వికెట్ కీపర్ బ్యాటర్ రిషభ్ పంత్ తిరిగి తన పాత జట్టు ఢిల్లీ క్యాపిటల్స్ (ఆఅ) గూటికి చేరుకున్నాడు. గత రెండు సీజన్ల క్రితం రికార్డు స్థాయిలో రూ. 27 కోట్లకు లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ (ఒూఉ) పంత్‌ను సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే. అయితే, తాజా ట్రేడ్ డీల్‌లో భాగంగా ఢిల్లీ స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్‌ను లఖ్‌నవూకి ఇచ్చి, బదులుగా పంత్‌ను తమ జట్టులోకి తెచ్చుకుంది. ఐపీఎల్ అధికారిక ప్రకటన ప్రకారం.. పంత్ ఢిల్లీలో ఏడాదికి రూ. 15 కోట్ల వేతనం అందుకోనుండగా, కుల్‌దీప్ రూ. 13.50 కోట్ల కాంట్రాక్టుతో లఖ్‌నవూలో చేరాడు.2025 సీజన్‌కు ముందు లఖ్‌నవూ సారథిగా బాధ్యతలు చేపట్టిన పంత్‌కు ఆ జట్టుతో రెండేళ్ల ప్రయాణం ఆశించినంతగా సాగలేదు. 2025లో 269 పరుగులు, 2026లో 312 పరుగులు మాత్రమే చేయగలిగాడు. అలానే కెప్టెన్‌గా, బ్యాటర్‌గా విఫలం కావడంతో పాటు జట్టులో స్థిరమైన బ్యాటింగ్ ఆర్డర్ లేకపోవడం అతని ప్రదర్శనపై ప్రభావం చూపింది. దీంతో ఇటీవలే లఖ్‌నవూ కెప్టెన్సీ నుంచి తప్పుకున్న పంత్, రూ. 12 కోట్ల భారీ వేతనం కోతకు సిద్ధపడి మరీ తన సొంత జట్టు ఢిల్లీ వైపు మొగ్గు చూపాడు. వాస్తవానికి 2016లో ఢిల్లీ క్యాపిటల్స్‌తోనే ఐపీఎల్ కెరీర్ ప్రారంభించిన పంత్, ఆ జట్టు తరఫున అత్యధికంగా 111 మ్యాచ్‌లు ఆడాడు. 43 మ్యాచ్‌లకు కెప్టెన్‌గానూ వ్యవహరించాడు.మరోవైపు చైనామన్ స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్ ఢిల్లీ క్యాపిటల్స్ తరఫున ఐదు సీజన్ల ఆడాడు. 2022 నుంచి ఢిల్లీ తరఫున 65 మ్యాచ్‌ల్లో 72 వికెట్లు తీసి అత్యుత్తమ ప్రదర్శన కనబరిచాడు. గతంలో ఢిల్లీలో రూ. 13.25 కోట్లు పొందిన కుల్‌దీప్ తాజాగా లఖ్‌నవూకు మారడం ద్వారా రూ. 13.50 కోట్లతో స్వల్ప లాభాన్ని పొందాడు.ఈ స్వాప్‌డీల్ గురించి రెండు జట్లు ఎక్స్ వేదికగా వెల్లడించాయి. అలానే ఈ ట్రేడ్ రాబోయే ఐపీఎల్ సీజన్లలో ఇరు జట్ల బలాబలాలను ఎలా మారుస్తుందో అని క్రికెట్ ప్రియులు ఆసక్తిగా చూస్తున్నారు.



# సినిమా

## జెన్ జీ పెళ్లి గురించి ఏం ఆలోచిస్తోంది.. రష్మిక ఏమన్నారంటే?




ప్రస్తుత జనరేషన్ (జెన్–జీ) లైఫ్ స్టైల్, ఆలోచనలు పాత తరంతో పోలిస్తే చాలా డిఫరెంట్‌గా ఉంటున్నాయి. ముఖ్యంగా 'పెళ్లి' అనే కాన్సెప్ట్‌ను ఈ తరం యూత్ చూసే విధానం పూర్తిగా మారిపోయింది. తాజాగా నేషనల్ క్రష్ రష్మిక మందన్న ఒక ఇంటర్వ్యూలో పెళ్లి గురించి, అలాగే నేటి యువత ఆలోచనా తీరు గురించి కొన్ని చాలా ఇంట్రెస్టింగ్ అండ్ బోల్డ్ కామెంట్స్ చేశారు. ప్రస్తుతం సోషల్ మీడియాలో రష్మిక చేసిన ఈ వ్యాఖ్యలు తెగ వైరల్ అవుతున్నాయి. ఆ వివరాలు చూద్దాం.. పెళ్లి ఒక అవుట్ డేటెడ్ కాన్సెప్ట్?: ఇటీవల జరిగిన ఒక ఇంటర్వ్యూలో రష్మికకు నేటి తరం జెన్–జీ పెళ్లిని ఒక 'అవుట్ డేటెడ్' కాన్సెప్ట్‌గా భావిస్తోందనే ప్రశ్న ఎదురైంది. దీనికి ఆమె చాలా ప్రాక్టికల్‌గా స్పందించారు. సమాజం పెళ్లి విషయంలో కొన్ని కఠినమైన రూల్స్ పెట్టిందని, ముఖ్యంగా అమ్మాయిలకు ఒక నిర్దిష్ట వయసు రాగానే కచ్చితంగా పెళ్లి చేసేయాలనే ఒత్తిడి తెస్తుందని రష్మిక అన్నారు. ఇక సొసైటీ పెట్టిన ఇలాంటి రూల్స్ నచ్చకే నేటి యూత్ పెళ్లికి దూరంగా ఉండాలని ఆలోచిస్తోందని ఆమె చెప్పుకొచ్చారు.సమాజం రూల్స్ కాదు.. పార్ట్‌నర్స్ ఇష్టం ముఖ్యం: పెళ్లి అనేది కేవలం సమాజం పెట్టిన రూల్స్ కోసమో, ఎవరో ఏదో అనుకుంటారనో చేసుకోవాల్సిన అవసరం లేదని రష్మిక తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. పెళ్లి బంధంలోకి అడుగుపెట్టే ఇద్దరు భాగస్వాములు ఒకరినొకరు ఎలా అర్థం చేసుకుంటున్నారు, వారు కలిసి ఎలా ఉండాలనుకుంటున్నారు అనేదే అన్నింటికంటే ముఖ్యమని స్పష్టం చేశారు. ఇక సమాజం కండిషన్ల కంటే పార్ట్‌నర్స్ ఇష్టానికే ఎక్కువ ప్రయారిటీ ఇవ్వాలని రష్మిక అన్నారు. బ్యాక్ టు బ్యాక్ చిత్రాలతో రష్మిక లైనప్: ఒకవైపు ఇలాంటి బోల్డ్ స్టేట్‌మెంట్లతో వార్తల్లో నిలుస్తున్న రష్మిక.. సినిమాల పరంగానూ ఈ ఏడాది ఫుల్ జోరు చూపిస్తోంది. ఆమె నటించిన 'కాక్‌టైల్ 2' ఈరోజే విడుదలై మంచి టాక్ తెచ్చుకుంటోంది. దీనితో పాటు ఈ ఏడాది మరో రెండు భారీ సినిమాలు ప్రేక్షకులను అలరించడానికి రెడీ అవుతున్నాయి. విజయ్ దేవరకొండ సరసన ఆమె నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ మూవీ 'రణబాలి' సెప్టెంబర్‌లో విడుదల కానుంది. అలాగే ఆమె లేడీ ఓరియెంటెడ్ ప్యాన్–ఇండియా యాక్షన్ చిత్రం 'మైసా' డిసెంబర్ కానుకగా థియేటర్లలోకి రాబోతోంది. ం ఇక పెళ్లి అనేది ఇద్దరు వ్యక్తుల వ్యక్తిగత విషయమని, దానికి సమాజం గీసిన గీతలే ప్రామాణికం కాదంటూ రష్మిక చేసిన కామెంట్స్ నూటికి నూరు పాళ్ళు నిజమని నేటి యూత్ సపోర్ట్ చేస్తున్నారు. ఇక ఏది ఏమైనా పెళ్లి విషయంలో సొసైటీ ప్రెజర్‌ను పక్కన పెట్టాలనే రష్మిక మాటలకు కొందరు సపోర్ట్ చేస్తున్నారు. ఇక ఈరోజే విడుదలైన కాక్‌టైల్ 2 మరియు రాబోయే రణబాలి, మైసా చిత్రాలతో ఈ ఏడాది బాక్సాఫీస్ వద్ద రష్మిక ఎలాంటి సంచలనాలు సృష్టిస్తుందో చూడాలి.

## ప్రియదర్శి మరో డిఫరెంట్ కాన్సెప్ట్.. హీరోయిన్ ఎవరంటే..



: టాలీవుడ్ లో ప్రస్తుతం కమర్షియల్ హంగుల కంటే కూడా మట్టి వాసన ఉన్న కథలకే ఆడియన్స్ ఎక్కువగా ఎట్రాక్ట్ అవుతున్నారు. ఈ సరికొత్త ట్రెండ్ ను సరిగ్గా క్యాచ్ చేసిన స్టార్ డైరెక్టర్ సుకుమార్ తన సొంత బ్యానర్ సుకుమార్ రైటింగ్స్, సక్సెస్ ఫుల్ ప్రొడ్యూసర్ బన్నీ వాస్ వర్క్స్ తో కలిసి ఒక వైవిధ్యమైన ప్రాజెక్ట్ ను అనౌన్స్ చేశారు. కొత్త దర్శకుడు వంశీ రెడ్డి ఈ సినిమాతో మెగాఫోన్ పడుతున్నాడు. ఇదొక స్వచ్ఛమైన కంటెంట్ ఓరియెంటెడ్ సినిమా అని అనౌన్స్మెంట్ తోనే అందరికీ ఒక క్లారిటీ వచ్చేసింది. ఈ ప్రాజెక్ట్ కు సంబంధించిన లేటెస్ట్ వివరాల్లోకి వెళితే.. మేకర్స్ తీసుకున్న ఒకే ఒక్క నిర్ణయం ఇండస్ట్రీలో ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. తెలంగాణకు చెందిన పాపులర్ ఫోక్ సింగర్, డాన్సర్ నాగదుర్గను ఈ సినిమాలో హీరోయిన్ గా ఎంపిక చేశారట. నల్గొండ ప్రాంతానికి చెందిన ఆమెకు జానపద కళల్లో ఎంతో మంచి పట్టుంది. కేవలం గ్లామరస్ హీరోయిన్స్ ని కాకుండా ఇలాంటి నేచురల్ టాలెంట్ ను వెండితెరకు పరిచయం చేయడం వెనుక దర్శకుడి పక్కా ప్లాన్ కనిపిస్తోంది.ఇక ఈ సినిమాలో కూడా కథలోని నేటివిటీని పర్ఫెక్ట్ గా మ్యాచ్ చేయడం కోసమే నాగదుర్గను ఎంపిక చేసుకున్నట్లు తెలుస్తోంది. ఇదొక ఎమోషనల్ గా సాగే రూరల్ డ్రామా కావడంతో ఆ వాతావరణానికి, ఆ యాసకు పక్కాగా సరిపోయే అమ్మాయి కావాలనే ఈ సర్ ప్రైజ్ ఛాయిస్ తీసుకున్నారని ఇండస్ట్రీ వర్గాల్లో గట్టిగా వినిపిస్తున్న మాట. ఇక ఈ ప్రాజెక్ట్ లో మరో అతిపెద్ద ప్లస్ పాయింట్ యంగ్ హీరో ప్రియదర్శి. బలగం లాంటి రూటెడ్ విలేజ్ డ్రామాతో బాక్సాఫీస్ దగ్గర మ్యాజిక్ క్రియేట్ చేసి తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపుని అందుకున్నాడు. కామెడీ పాత్రలకే పరిమితం కాకుండా కంటెంట్ ఉన్న సబ్జెక్ట్స్ ను ఎంచుకుంటూ తనేంటో ప్రూవ్ చేసుకుంటున్నాడు. ఇప్పుడు మరోసారి ఒక పల్లెటూరి నేపథ్యంలో సాగే ఇంటెన్స్ ఎమోషనల్ కథతో రాబోతుండటంతో ఈ సినిమాపై ముందు నుంచే అంచనాలు పెరిగిపోతున్నాయి. సుకుమార్ రైటింగ్స్ బ్రాండ్ వాల్యూ ఈ సినిమాకు అతిపెద్ద అండగా నిలవబోతోంది. కుమారి 21ఎఫ్, ఉప్పెన లాంటి సినిమాలతో కొత్త టాలెంట్ ను ఎంకరేజ్ చేసి బ్లాక్ బస్టర్స్ కొట్టిన అద్భుతమైన ట్రాక్ రికార్డు ఈ బ్యానర్ కు ఉంది. బన్నీ వాస్ లాంటి జడ్జిమెంట్ ఉన్న ప్రొడ్యూసర్ తోడవ్వడంతో ఈ చిన్న బడ్జెట్ కాన్సెప్ట్ ఓరియెంటెడ్ సినిమా థియేట్రికల్ గా, ఓటీటీ పరంగా కూడా డిస్ట్రిబ్యూటర్లకు భారీ లాభాలను తెచ్చిపెట్టే అవకాశం పుష్కలంగా ఉంది. గతంలో కేవలం యూట్యూబ్, సోషల్ మీడియాకే పరిమితమైన జానపద కళాకారులకు ఇప్పుడు నేరుగా వెండితెరపై మెయిన్ లీడ్స్ దొరకడం నిజంగా మంచి విషయమే అని చెప్పాలి. కొత్త డైరెక్టర్ వంశీ రెడ్డి సిద్ధం చేసిన ఈ రా అండ్ రూరల్ ఎమోషనల్ డ్రామా ప్రేక్షకులను ఏ రేంజ్ లో మెప్పిస్తుందో చూడాలి.

## ప్రభాస్ ఫ్యాన్స్ అంతా చూడగలరా..?



బాహుబలి సినిమా తర్వాత ప్రభాస్ స్టార్‌డం అమాంతం పెరిగిందనే విషయం ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. పాన్ ఇండియా రేంజ్‌లో వరుస సినిమాలు చేస్తున్న ప్రభాస్ సక్సెస్.. ఫ్లాప్... లతో సంబంధం లేకుండా తన స్టార్‌డంను మరింతగా పెంచుకుంటూ ఆకాశమే హద్దు అన్నట్లుగా ముందుకు సాగుతున్నాడు. ఇలాంటి సమయంలో ప్రభాస్ తదుపరి సినిమా సందీప్ రెడ్డి వంగతో కావడం ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ప్రభాస్, సందీప్ రెడ్డి కాంబోలో 'స్పిరిట్' మూవీ రూపొందుతున్న విషయం తెల్సిందే. సినిమాలో ప్రభాస్‌ను పోలీస్ ఆఫీసర్‌గా చూపించబోతున్నాడని ఇప్పటికే క్లారిటీ వచ్చింది. అంతే కాకుండా సందీప్ రెడ్డి గత చిత్రాలతో పోల్చితే ఇంకాస్త అడల్ట్ కంటెంట్ ఎక్కువగానే ఉండబోతుందని అంటున్నారు. యానిమల్ సినిమాలో ఏ స్థాయిలో యాక్షన్ సీన్స్ ఉన్నాయో తెలిసిందే. ఇందులోనూ అంతకు మించి ఉంటాయని అంటున్నారు. .. ధురంధర్ సినిమాలోని యాక్షన్ సీన్స్ విషయమై విమర్శలు వచ్చిన విషయం తెల్సిందే. ముఖ్యంగా ధురంధర్ 2 సినిమాలోని యాక్షన్ సీన్స్ ను పెద్ద వారు సైతం చూడ్డానికి ఇబ్బందిగా ఉందంటూ విమర్శలు వచ్చాయి. ఇన్‌సైడ్ టాక్ ప్రకారం ధురంధర్ యాక్షన్ సీన్స్‌ను మించి స్పిరిట్‌లో యాక్షన్ సీన్స్ ను దర్శకుడు ప్లాన్ చేస్తున్నాడట. సందీప్ సినిమా అంటే ఎలాగూ ఎ సర్టిఫికెట్ కన్ఫర్మ్. అయినా అంతకు మించి అంటే సెన్సార్ నుంచి ఎలాంటి అడ్డంకులు వస్తాయో అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మాస్ ఎలిమెంట్స్‌తో ప్రభాస్ ఫ్యాన్స్‌కి ఫుల్ కిక్ ఇవ్వడం మాత్రమే కాకుండా ఆయన్ను గతంలో ఫ్యాన్స్ ఎప్పుడూ చూడని విధంగా చూపించే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. అందుకే ప్రభాస్ స్పిరిట్ మరో లెవల్ లో ఉండబోతుందని ఫ్యాన్స్ బలంగా నమ్ముతున్నారు. అందుకు తగ్గట్లుగా దర్శకుడు స్పిరిట్‌ను రూపొందించే పనిలో ఉన్నాడు. ప్రభాస్ స్పిరిట్ సినిమాతో... ప్రభాస్ ఫ్యాన్స్‌లో అన్ని వర్గాల వారు ఉంటారు. అంటే చిన్న పిల్లల నుంచి పెద్ద వారు, మహిళలు, ముఖ్యంగా ఫ్యామిలీ ఆడియన్స్‌లో ప్రభాస్‌కి మంచి క్రేజ్ ఉంది. అలాంటి ప్రభాస్‌ను అల్ట్రా యాక్షన్ ఎపిసోడ్స్‌లో, మరీ హింసాత్మక యాక్షన్ సీన్స్‌లో చూపిస్తే అందరూ చూసే అవకాశం ఉంటుందా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రభాస్ అభిమానులు ఒక సూపర్ హిట్ కోరుకుంటున్నారు. అది స్పిరిట్‌తో దర్శకుడు సందీప్ వంగ ఇవ్వడం కన్ఫర్మ్. అయితే ఫ్యాన్స్ అంతా చూసే విధంగా స్పిరిట్ ఉంటుందా అనే అనుమానం మాత్రం వ్యక్తం అవుతోంది. ప్రభాస్‌ను అభిమానించే వారిలో చిన్న పిల్లలు టీనేజర్స్ ఎక్కువగా ఉంటారు. అలాంటి వారు స్పిరిట్ యాక్షన్ సీన్స్‌ను థియేటర్‌లో చూసేందుకు వీలు ఉండదు. ఎ సర్టిఫికెట్ సినిమా కనుక ఫ్యామిలీ ఆడియన్స్ కూడా ఎక్కువ శాతం థియేటర్లకు వెళ్లకుండా, ఓటీటీ కోసం వెయిట్ చేసే అవకాశాలు ఉంటాయని కొందరు అంటున్నారు. హిట్ కావడానికి ప్రధాన కారణం హీరో బోల్డ్‌నెస్, హింసాత్మకమైన యాక్షన్ సీన్స్. కొన్ని రొమాంటిక్ సీన్స్‌ను కూడా ఈయన యాడ్ చేస్తాడు. అలా చేస్తే ప్రభాస్ అభిమానులు ఎంత వరకు సినిమాను థియేటర్‌లో చూసి ఎంజాయ్ చేయగలరు అంటూ కొందరు ప్రశ్నిస్తున్నారు.

## ఓటీటీలోకి అర్జున్ బ్లాస్ మూవీ




చాలా రోజుల తర్వాత అర్జున్ తన యాక్షన్‌తో మెప్పించిన చిత్రం 'బ్లాస్ట్'. ఇటీవల ప్రేక్షకుల ముందుకువచ్చిన ఈ సినిమా పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకుంది. ఇప్పుడీ చిత్రం ఓటీటీ ఆడియన్స్‌ను అలరించేందుకు సిద్ధమైంది. నెట్‌ప్లిక్స్ వేదికగా జూన్ 25 నుంచి స్ట్రీమింగ్ కానుంది. ఈ విషయాన్ని నెట్‌ప్లిక్స్ అధికారికంగా వెల్లడించింది. కొన్ని రోజులుగా దీని ఓటీటీ తేదీపై వార్తలు వస్తున్నప్పటికీ నేడు నెట్‌ప్లిక్స్ అధికారిక తేదీని వెల్లడించింది. సుభాష్ కె రాజ్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాలో ప్రీతీ ముకుందన్, అభిరామి, అర్జున్ చిదంబరం నటించారు.

## ప్రేక్షకులను అలరించేలా చిత్రాలు ఉండాల్సిందే


### డబుల్ ఆక్యుపెన్సీ చిత్ర సక్సెస్ మీట్‌లో ఖుష్బూ



మనం నిర్మించే చిత్రాలు ప్రేక్షకులను అలరించేలా ఉండాలని ప్రముఖ నటి ఖుష్బూ పేర్కొన్నారు. అవ్నీ మూవీస్ పతాకంపై రూపొందిన 'డబుల్ ఆక్యుపెన్సీ'చిత్రం గతవారం విడుదలై ఘన విజయం సాధించింది. ఈ సక్సెస్‌ను పురస్కరించుకుని తాజాగా చిత్రబృందం చెన్నై నగరంలో సక్సెస్ మీట్ నిర్వహించింది. ఈ కార్యక్రమంలో ఖుష్బూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా ఆమె ఖుష్బూ మాట్లాడుతూ.. 'చిన్న చిత్రం ఇంతటి సక్సెస్ సాధించడం ఎంతో సంతోషంగా ఉంది. మనం నిర్మించే సినిమా ప్రేక్షకులను అలరించాలి. వారు చెల్లించే డబ్బుకు తగిన విలువ ఉండాలి అని నా భర్త సుందర్ అంటుంటారు. ఈ చిత్రంతో ఆయన మాటలను మేము కూడా నిజం చేశాం. గత కొన్ని రోజులుగా నేను ఎంతో బిజీగా ఉన్నాను. నా పెద్ద కుమార్తె పెళ్ళి పనుల్లో బిజీగా ఉంది. నా భర్త సుందర్ 'పురుషన్' షూటింగ్, పెళ్ళి పనుల్లో క్షణం తీరికలేకుండా ఉన్నారు. నా చిన్న కుమార్తె ఈ చిత్ర నిర్మాణ పనులు చూసుకుంది. ఈ సినిమా నిర్మాణంలో పలు ఇబ్బందులు ఎదురైనప్పటికీ, వాటిని ఆమె విజయవంతంగా అధిగమించింది. నా పెద్ద కుమార్తె రెండు చిత్రాల్లో నటిస్తోంది. మరో నాలుగు చిత్రాలకు కమిట్ అయింది. గతంలో ఒక హీరోయిన్.. ప్రేమ, పెళ్ళి వంటి అంశాలపై మాట్లాడేందుకు భయపడేది. ఇప్పుడు కాలంతో పాటు అంతా మారిపోయిందని పేర్కొన్నారు.

## బాలయ్యతో మరోసారి డాక్టర్ కాత్యాయని...!

నందమూరి బాలకృష్ణ, గోపీచంద్ మలినేని కాంబోలో మరో మూవీ రాబోతున్న విషయం తెల్సిందే. ఇప్పటికే వీరి కాంబోలో వీర సింహారెడ్డి సినిమా వచ్చింది. 2023లో వచ్చిన ఆ సినిమా భారీ విజయాన్ని సొంతం చేసుకుంది. నందమూరి అభిమానులను మాత్రమే కాకుండా తెలుగు ప్రేక్షకులను మెప్పించింది. అంతే కాకుండా విమర్శకుల ప్రశంసలు సైతం దక్కించుకున్న విషయం తెల్సిందే. అందుకే బాలకృష్ణ, గోపీచంద్ మలినేని కాంబో మూవీ అనగానే అంచనాలు భారీగా పెరిగాయి. గత ఏడాది నుంచే వీరి కాంబో మూవీ గురించి వార్తలు వస్తున్నాయి. ఎప్పటికప్పుడు అంచనాలు పెరుగుతూ వచ్చాయి. తాజాగా బాలయ్య బర్త్‌డే సందర్భంగా విడుదలైన గ్లిమ్స్ కి మంచి స్పందన వచ్చింది. ప్రస్తుతం ఈ సినిమా గురించిన చర్చ సోషల్ మీడియాలో ప్రముఖంగా వినిపిస్తోంది. ఈ సమయంలోనే సినిమా నుంచి మరో అప్‌డేట్ వచ్చింది. 111 లో హీరోయిన్‌గా నయనతార... ఔఃఐ111 వర్కింగ్ టైటిల్‌తో రూపొందుతున్న ఈ సినిమాలో హీరోయిన్‌గా నయనతార నటించబోతున్నట్లు గతంలోనే అధికారిక ప్రకటన వచ్చింది. నయనతార బర్త్‌డే సందర్భంగా యూనిట్ సభ్యుల తరపున ప్రత్యేకమైన వీడియో సైతం రిలీజ్ అయ్యింది. ఇప్పుడు మరో హీరోయిన్ ఈ సినిమాలో నటిస్తున్నట్లుగా అధికారికంగా ప్రకటన వచ్చింది. బాలకృష్ణకు జోడీగా గతంలో భగవంత్ కేసరి సినిమాలో కాజల్ అగర్వాల్ నటించిన విషయం తెల్సిందే. ఇప్పుడు ఆ కాంబో మళ్లీ రిపీట్ కాబోతుంది. భగవంత్ కేసరి సినిమా తర్వాత బాలయ్యతో మరోసారి జత కట్టేందుకు గాను కాజల్ అగర్వాల్ రెడీ అయ్యింది. నేడు కాజల్ బర్త్‌డే సందర్భంగా చిత్ర యూనిట్ సభ్యులు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఒక పోస్టర్‌ను విడుదల చేయడం జరిగింది. ప్రస్తుతం ఈ పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్ అవుతూ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. కాజల్ అగర్వాల్ హీరోయిన్‌గా... చీర కట్టులో, కళ్లకు పెద్ద అద్దాలు పెట్టుకుని హుందాగా కనిపిస్తున్న కాజల్ అగర్వాల్ లుక్‌తో సినిమాపై మరింతగా ఆసక్తి పెరిగింది అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ఆమె లుక్, వెనుక ఉన్న సెటప్ చూస్తూ ఉంటే గవర్నమెంట్ ఆఫీసర్ అయ్యి ఉంటుందని కొందరు ఊహిస్తూ కామెంట్స్ చేస్తే, మరికొందరు ఐఏఎస్ పాత్రలో కాజల్ కనిపించబోతున్నట్లుగా అనిపిస్తోందని కొందరు అంటున్నారు. మొత్తానికి కాజల్ అగర్వాల్ పవర్ ఫుల్ రోల్ లో ఔఃఐ111 సినిమాలో కనిపించబోతున్నట్లుగా ఈ ఫోటోను చూస్తే అనిపిస్తోంది. నయనతార ఎలాగూ ఈ సినిమాలో ఉంది కనుక కాజల్ అగర్వాల్ పాత్రకు పెద్దగా ప్రాధాన్యత ఉండక పోవచ్చు అనే వారు లేకపోలేదు. అయితే గోపీచంద్ మలినేని తన ప్రతి సినిమాలో హీరోయిన్స్‌కి మినిమం ప్రాధాన్యత ఇస్తాడు అనే విషయం గత సినిమాలను చూస్తే అర్థం అవుతుంది. కనుక ఈ సినిమాలో కాజల్ అగర్వాల్ కి మంచి పాత్ర దక్కి ఉంటుందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.బాలకృష్ణ ఫ్యాన్స్ ఎదురు చూపులు... బాలకృష్ణ బ్యాక్ టు బ్యాక్ హిట్స్ తో దూసుకు పోతున్నాడు. ఒకానొక సమయంలో బాలయ్య సినిమా వస్తుందంటే ట్రోల్ చేసేందుకు కొందరు రెడీగా ఉండేవారు. కానీ ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారింది. బాలయ్య సినిమాలకు ఫ్యాన్స్ మాత్రమే కాకుండా ఫ్యామిలీ ఆడియన్స్ సైతం క్యూ కడుతున్నారు. ఇలాంటి సమయంలో గోపీచంద్ మలినేని వంటి మాస్ కమర్షియల్ దర్శకుడితో బాలకృష్ణ మరోసారి సినిమా చేస్తున్న నేపథ్యంలో అంచనాలు భారీగా పెరిగాయి. గత బాలయ్య సినిమాల బడ్జెట్‌తో పోల్చితే ఈ సినిమా బడ్జెట్ అంతకు మించి అన్నట్లుగా ప్రచారం జరుగుతోంది. వెంకట సతీష్ కిలారు ఈ సినిమాను భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నాడు.




Printed by Published by **KALIDINDI RAJA JAGADESHWARA SANTOSH** on behalf of **KALIDINDI RAJA JAGADESHWARA SANTOSH**, Printed at and Published at 1-7-750/1-3, F 103 and 102, ST. PIOUS SCHOOL ROAD, Sruthi Sadan Apts, Ramnagar, Hyderabad-500020, Telangana. Editor **RAGHURAMA RAJU KALIDINDI.** PRGI NUMBER TGTEL/25/A3603, CELL : 9849379430, MAIL ID: kingdailynewspaper@gmail.com